సూర్య ఆదివారం
sunday@suryaa.com
విజ్ఞానం, వినోదం, కథలు మరియు ఆధ్యాత్మిక
అంశాలతో కూడిన విషయాలు మీకు ఆదివారం
ఉచితంగా అందిస్తున్నది 'సూర్య' ఆదివారం
ప్రతి ఆదివారం 'సూర్య'తో ఉచితంగా అందుకోండి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



సంపుటి 11 | సంచిక 147
ఆదివారం | 25 మార్చి 2018 | విజయవాడ | పేజీలు 12+16+16 | వెల: రూ. 6.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వసంత రుతువు, చైత్ర మాసం, శుక్ల పక్ష తిథి : అష్టమి ఉ.7.37, నవమి తె.3.49, ఆరుద్ర మ.2.04, వర్జ్యం రా.1.14 నుంచి 2.42 వరకు, రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు, సూర్యోదయం : ఉ.6.20 గం; సూర్యాస్తమయం: సా. 6.25 గం.

లాలూకు మరో 14 ఏళ్ల జైలు



6లో

- నాలుగవ కేసులో శిక్ష ఖరారు చేసిన రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు
- లాలూకు జైలు శిక్షతో పాటు రూ. 60 లక్షల జరిమానా
- గత డిసెంబర్ 23 నుంచి బిర్సా ముండా జైలులో ఉన్న లాలూ

రాజ్యసభలో పెరిగిన బీజేపీ బలం



6లో

- కాంగ్రెస్‌కు తగ్గిన స్థానాలు
- తాజా సంఖ్యా బలాలు ఇవీ
- 11 స్థానాలు పెరిగి 69కి చేరిన బీజేపీ బలం
- నాలుగు స్థానాలు చేజార్చుకుని 50కి పరిమితమైన కాంగ్రెస్
- పెద్దల సభలో ఇక బీజేపీ ఆధిపత్యం

ఫేస్‌బుక్‌ను వీడుతున్న టాప్ కంపెనీలు



5లో

- ఖాతాలను తొలగించుకున్న టెస్లా, స్పేస్ ఎక్స్
- కోట్లాది మంది ఖాతాదారుల సమాచారం దుర్వినియోగం
- అసంతృప్తితో ఎంతో మంది
- చిక్కుల్లో పడ్డ ఫేస్‌బుక్

నీ లేఖ తప్పుల తడక

- అమిత్ షా లేఖపై చంద్రబాబు మండిపాటు
- అంశాలను పక్కదారి పట్టించేందుకే
- అడిగితే ఎదురుదాడి చేయడం తగదు
- ఇతర రాష్ట్రాలకు ఇచ్చినపుడు హోదా ఎందుకివ్వరు
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

బీజేపీ జాతీయ అధ్యక్షుడు రాసిన తొమ్మిది పేజీల లేఖపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడు రాయల్సిన విధంగా లేఖ లేదని, అసత్యాలు, ర్ధసత్యాలతో అదో తప్పుల తడకగా ఉందని అభివర్ణించారు. ఏ రాష్ట్రానికీ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సాయం చేశామని అమిత్‌షా లేఖలో పేర్కొనడంపై సీఎం ఘాటుగా స్పందించారు. ప్రాధాన్యతా క్రమంలో అనేక అంశాలను పక్కదారి పట్టించేందుకే తెలివిగా ఈ లేఖ రాశారన్నారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకే బీజేపీ ఈ విధంగా వ్యవహరిస్తోందన్నారు. శాసనసభలో శనివారం అమిత్‌షా రాసిన లేఖలో ప్రతి అంశాన్ని ముఖ్యమంత్రి చదువుతూ గతంలో తాను రాసిన లేఖలో పేర్కొన్న విషయాలతో పోలుస్తూ కేంద్రాన్ని గట్టిగా నిలదీశారు.



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : హేతుబద్ధత లేకుండా చేసిన విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధంగా రావాల్సినవి అడిగితే ఎదురుదాడి చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తామేమీ కొత్తవి అడగడంలేదని, చట్టంలో ఇస్తామని పేర్కొన్నవే అడుగుతున్నామన్నారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాలకూ న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై లేదా అని ప్రశ్నించారు. ఆర్థిక సంఘం ఇచ్చినవి కూడా కేంద్రమే ఇచ్చినట్టు గొప్పలు చెప్పుకుంటోందని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదాకు సమానంగా సాయం అందిస్తామని చెప్పడం వల్లే ప్రత్యేక సాయానికి ఒప్పుకున్నామన్నారు. ఆర్థికంగా బలోపేతంగా ఉంటే కేంద్రాన్ని నిధులు అడగాల్సిన అవసరం తమకేంటి? అని అన్నారు.

హోదా విషయం తేల్చాల్సిందే : కాంగ్రెస్ కంటే బీజేపీనే తమకు ఎక్కువ అన్యాయం చేసిందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు. హోదా విషయాన్ని తేల్చాల్సిందేన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఎదగాలంటే తమకు మరో పదేళ్లు పడుతుందని అన్నారు. చట్టంలో ఇచ్చిన హామీల నెరవేర్చే విషయంలో వాస్తవాలను ప్రజలకు చెప్పే ధైర్యం బీజేపీకి ఉందా? అని సవాల్ చేశారు.

ఆ లేఖను ప్రజలంతా చదవాలి : అమిత్‌షా రాసిన తప్పులతడక లేఖను ప్రజలంతా చదవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల

మిగతా 6లో

అన్ని రాజకీయ పార్టీలకు
బీసీలే లక్ష్యం

- ఎన్నికలు సమీపిస్తున్న తరుణం
- తెలుగు రాష్ట్రాల్లో బడుగులకు చేరు వయ్యేలా రాజకీయ పార్టీల ఎత్తుగడలు
- జనాభాలో అధిక శాతం ఉన్న సామాజిక వర్గాలపై ప్రధాన పార్టీల నజర్
- తెలుగు దేశం పార్టీ పుట్టిందే బడుగుల అభివృద్ధి కోసమని టీడీపీ ప్రచారం
- బడుగులతో పాటు ముస్లిం ఓట్లను కొల్లగొట్టేలా టీఆర్ఎస్ ముందస్తు వ్యూహాలు
- తాము అధికారంలోకి వస్తే బడుగులకు పెద్దపీట వేస్తామని కాంగ్రెస్ ప్రచారం
- బీసీల అభివృద్ధి తమతోనే సాధ్యమని బీజేపీ నేతల వ్యాఖ్యలు
- ఇక పై ఓటు బ్యాంకు రాజకీయాలను సహించేది లేదంటున్న బడుగు నేతలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: తెలుగు రాష్ట్రాల్లో క్రమంగా రాజకీయ సెగ రగులుతోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. జనాభాలో అధిక శాతం గల బడుగు బలహీన వర్గాలను మచ్చిక చేసునేలా వ్యూహాలు రచిస్తున్నాయి. దేశ జనాభాలో 54శాతం గల బడుగులు రాజ్యాధికారానికి ఇంకా ఆమడ దూరంలోనే ఉన్నారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో ఇంత వరకు ఏ పార్టీ కూడా బీసీలకు పెద్దపీట వేసిన ఘటన చరిత్రలో లేదు... ఇకపై వేస్తారన్న నమ్మకమూ బీసీలకు కలగడం లేదు. అలాగని తమ ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి చెప్పేందుకు ఏ రాజకీయ పార్టీ మౌనంగా కూర్చోనూ..లేదు. ఎవరి ప్రయత్నాలను వారు కొనసాగిస్తూనే..ప్రజల్లోకి వెళ్తుతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సూచనలు, సలహాలతో ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తోన్న పలు సంక్షేమ,

మిగతా 6లో



టీఎస్‌టీతో బాబు దోపిడీ



- టీఎస్టీ, కేఎస్టీతో ప్రజల్ని దోచుకుంటున్నారు
- అవినీతిలో రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్ పురోగతి సాధించింది
- ఓటుకు కోట్లు కేసు అవినీతి డబ్బుతో ఎమ్మెల్యేలను కొనుగోలు అడ్డంగా దొరికాడు
- రైతన్న పంటను అమ్ముకోవాలంటే లంచాలు ఇవ్వాల్సిందే
- ప్రజా సంకల్ప యాత్రలో వైసీపీ అధ్యక్షుడు , ప్రతి పక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి
- కేంద్రం మట్టి, నీరు ఇచ్చిందని ఏపీ ప్రభుత్వం విమర్శిస్తోంది
- మీరు మాత్రం హెలికాప్టర్‌లో తిరిగి నీళ్లు చల్లి శుద్ధి చేస్తారా?
- రాజధాని డిజైన్లు ఇప్పటికీ ఖరారు చేయలేదు
- ఏపీ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోంది: వైఎస్ జగన్ ఆరోపణలు

నర్సారావుపేట,సూర్యప్రతినిధి: నర్సారావుపేటలోని వ్యాపారులు, దుకాణ దారులు జీఎస్టీతో బాధపడుతున్నారు. జీఎస్టీకి అదనంగా రాష్ట్రంలో టీఎస్టీ కూడా ఉంది. టీఎస్టీ అంటే తెలుగు తమ్ముళ్లకు సంబంధించిన సర్వీస్ టాక్స్. జన్మభూమి కమిటీల నుంచి ప్రాజెక్టుల వరకు ప్రతి

మిగతా 6లో

చంద్రబాబు చెప్పేదంతా అబద్ధమే



6లో


- మీ నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది
- నిధులు ఎన్నో ఇచ్చినా ఇవ్వలేదనడంలో ఆంతర్యం ఏమిటి?
- ఏపీకి ఇచ్చిన హామీలను కేంద్రం పూర్తి స్థాయిలో నెరవేర్చింది
- నెరవేర్చాల్సిన హామీలపై చర్చలు సాగుతున్నాయి
- ఇచ్చిన నిధులకు లెక్కలు ఎన్నడైనా చెప్పారా?
- సాయం చేస్తున్నా ఈ అభాండాలేమిటి?
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమిత్ షా ఘాటు లేఖ

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

అవగాహన లేని అమిత్

- అవగాహన లేకుండా లేఖ రాస్తారా
- అమిత్ షాపై ఏపీ ఐటి శాఖ మంత్రి లోకేశ్ విసుర్లు
- ప్రతి దానికీ అవినీతి అనడం సరికాదు
- సోము వీర్రాజు ఆరోపణలపై మంత్రి లోకేష్
- పల్లెల్లో నీటి కొరత లేకుండా చర్యలు
- రేణిగుంటలో ఐఐడిటి హాస్టల్ భవనానికి శంకుస్థాపన



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా రాసిన లేఖపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. రాష్ట్ర సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన లేకుండా అమిత్‌షా లేఖ రాశారని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అన్ని పనులకు సంబంధించి యూసీలు ఎప్పటికప్పుడు కేంద్రానికి అందించినట్లు తెలిపారు. యూసీ సర్టిఫికెట్లకు, ప్రత్యేక హోదాకు సంబంధమేంటని ప్రశ్నించారు. హోదాతో సహా మిగిలిన 18 హామీలు నెరవేర్చడానికి యూసీ అవసరమా? అని అడగారు. ఎన్డీయే నుంచి బయటకొచ్చేందుకు ఆవేశంగా నిర్ణయం తీసుకున్నారని అమిత్‌షా లేఖలో పేర్కొన్నారని, తాము తీసుకున్న నిర్ణయం ఆవేశపూరిత నిర్ణయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేశాక కూడా ఎన్డీయేలో ఉన్నామని గుర్తు చేశారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని అనేక పర్యాయాలు ప్రధాని దృష్టికి

మిగతా 6లో

కాంగ్రెస్ వస్తే ఓకే జీఎస్టీ స్లాబ్

- దేశ ఆర్థిక వ్యవస్థ నాశనం
- నోట్ల రద్దు, జీఎస్టీలతో ఆర్థిక వ్యవస్థ కుదేలు
- నీరవ్ రూ. 22 వేల కోట్లతో ఉడాయించాడు
- అదే డబ్బుతో ఎన్నో వ్యాపారాలు చేసి ఉండవచ్చు: రాహుల్



మైసూరు : తమ పార్టీ అధికారంలోకి వస్తే ఒకే జీఎస్టీ స్లాబ్‌ను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వెల్ల డించారు. మైసూరులో కాలేజీ విద్యార్థులతో ముచ్చటిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 28 శాతం శ్లాబ్ అన్న మాట వినిపించకుండా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన పెద్ద నోట్ల చలామణీ రద్దు, జీఎస్టీలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూ లిందని, నిరుద్యోగాన్ని మరింత పెంచిందని రాహుల్ గాంధీ విమర్శించారు. డీమానిటైజేషన్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం ఓ పిచ్చి పనిగా కొట్టిపారేశారని గుర్తు చేశారు. నీరవ్ మోడీ రూ. 22 వేల కోట్ల బ్యాం కు డబ్బుతో విదేశాలకు ఉడాయించాడని, ఆ మొత్తాన్ని మీకు ఇస్తే ఎన్నో రకా ల వ్యాపారాలు చేసేవారని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. దేశంలో నిరు ద్యోగం పెరిగిపోతోందని చెప్పారు. నైపుణ్యం ఉన్న వారికి ఆర్థిక స్తోమత లేకపోవడం, సహకారం లేకపోవడమే దీనికి కారణమని తెలిపారు.

అంతా ఇంతే!



ఆయన రాసిన లేఖను కరపత్రాల్లా ప్రింట్ చేసి ప్రజలందరికీ పంచుదాం



కేంద్రానికి అశోక్‌గజపతి ఘాటు హెచ్చరిక

అమిత్ షా లేఖపై అమిత ఆగ్రహం

విజయనగరం, సూర్య ప్రతినిధి : ఎన్డీయే నుంచి టీడీపీ ఏకపక్షంగా వీడిపోయిందంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా లేఖలో పేర్కొనడం సమంజసం కాదని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ ఎంపీ అశోక్‌గజపతిరాజు అన్నారు. అన్యాయంగా విభజింపబడిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం చేయాలని పలుమార్లు విన్నవించుకున్నా కేంద్రం నిర్లక్ష్యం చేసిన కారణంగానే ఎన్డీయే నుంచి వైదొలగాల్సి వచ్చిందని వివరించారు. టీడీపీ అధిష్టానం నిర్ణయం మేరకు కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్ గజపతిరాజు తొలిసారిగా శనివారం విజయనగరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు విషయంలో కేంద్రం ముందడుగు వేయలేదన్నారు. ఇస్తామన్న జాతీయ విద్యాసంస్థలకు కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అదేవిధంగా అవిశ్వాస తీర్మానంపై సభలో చర్చకు రాకపోవటం, సభను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. గతంలో టీడీపీ నుంచి లోక్‌సభకు ఎన్నికై లోక్‌సభ స్పీకర్‌గా వ్యవహరించిన బాలయోగి రాజ్యాంగబద్ధంగా వ్యవహరించారని కొనియాడారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. తెలుగు ప్రజలది కష్టపడే తత్వమని, అలాగని మోసం చేయాలనుకుంటే తమ ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఎంపీ అశోక్ ఘాటుగా హెచ్చరించారు. ఢిల్లీ నుంచి తొలిసారిగా విజయనగరానికి వచ్చిన అశోక్ గజపతి రాజుకి టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. విశాఖ జిల్లా ఆరిలోవ నుంచి విజయనగరం వరకు భారీ ద్విచక్ర వాహనాలు, కార్ల ర్యాలీ నిర్వహించారు. సుమారు 20 కిలోమీటర్ల పొడవున మూడు గంటల పాటు సాగిన ఈ ర్యాలీ జాతరను తలపించింది.



ఉత్తరాది రాష్ట్రాలకిచ్చారు.. మాకెందుకివ్వరు ?

- ఈపిఏ నిధులు ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదు
- హోదాపై రాజీపడి ఆత్మగౌరవం తాకట్టుపెట్టాలా ?
- ప్రత్యేక హోదా కింద రాయితీలన్నీ ఇవ్వాల్సిందే
- చట్టంలో పెట్టినవీ నెరవేర్చకుంటే ఎలా ?
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



వెలగపూడి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం చివరి బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయలేదని, మిత్రపక్షంగా చేయాల్సిన ధర్మాన్ని కూడా పాటించలేదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన నేపథ్యంలో ఆయన శనివారం ఆ లేఖను అసెంబ్లీలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షా ప్రకటించిన 9 పేజీల లేఖలో అన్నీ అసత్యాలే ఉన్నాయని, ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు అసత్యాలు చెబుతారా అని ప్రశ్నించారు. అసత్యాలు ఎందుకు చెప్పాల్సి వచ్చిందని అడుగుతున్నానన్నారు. ఎవరిపై ఎదురుదాడి చేయాలని మీ ఉద్దేశం. రాష్ట్రానికి ఏం మేలు చేశారన్నారు. మాకు రావాల్సిన వాటిని అడిగితే కేంద్రం బాధ్యత లేకుండా తిరిగి ఎదురుదాడి చేయడం ఎంతవరకూ సబబు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా లెక్కలేనితనంగా వ్యవహరిస్తున్నారని, ఉత్తరాది రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చినప్పుడు మాకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఈపీఏ ఇస్తామని చెప్పారని, ఇప్పటివరకూ ఒక్కపైసా కూడా ఇవ్వలేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఒక పరిశ్రమ ఏడాదికి రూ.200కోట్లు వరకూ పన్నులు కడుతోందని, కేంద్రం మన దగ్గరే పన్నులు వసూలు చేసుకుంటోందని మండిపడ్డారు. కేంద్రం తొలి నుంచి ఏదో దురుద్దేశంతోనే ఉందని, హోదాతో సమానంగా ప్యాకేజీ ఇస్తామన్నారని, అది ఏమైందని ప్రశ్నించారు. కో ఆపరేటివ్ ఫెడరలిజానికి తెలుగుదేశం చిహ్నమని ఆనాడు ఎన్టీఆర్ దీనికోసం కృషి చేశారని వివరించారు. రాష్ట్రానికి వచ్చే డబ్బులు కేంద్రం తీసుకునే వాటిని ఇస్తూ మళ్లీ తమకేదో ఇస్తున్నామన్నట్లు మాట్లాడుతున్నారన్నారని వ్యాఖ్యానించారు. పక్క రాష్ట్రాలతో సమానంగా ఎదిగేదాకా సాయం చేయాలని అడిగామని.. కాంగ్రెస్ కంటే బీజేపీనే ఎక్కువ అన్యాయం చేసిందన నే భావన ప్రజల్లో నెలకొని ఉందని తెలిపారు. కనీసం మీరు విభజన చట్టంలో పెట్టినవి కూడా నెరవేర్చకుండా ఎలా సమర్థించుకుంటారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ ఎయిర్‌పోర్ట్ కోసం 1000 ఎకరాలు భూమి ఇచ్చామని, కేంద్రానికి ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసుకుంటే మనమే విమానాశ్రయం నిర్మించుకోగలిగేవారమని ఆవేదన వ్యక్తం చేశారు. లేఖలో అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే తదిరాల గురించి ప్రస్తావించారని, దేశంలో చాలా రాష్ట్రాల్లో జాతీయ రహదారులు అభివృద్ధి చేస్తున్నారని, ఏ రాష్ట్రాల్లో ఎంత ఖర్చు పెట్టారో చర్చించడం మొదలెడితే చాలా విషయాలు చర్చకు వస్తాయన్నారు . ఆనాడు హైదరాబాద్‌కు 160 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును కేంద్రం ఎలాంటి సాయం అందించకున్నా తాను అభివృద్ధి చేసిన సంగతి గుర్తుపెట్టుకోవాలన్నారు. గుంతకల్లు రైల్వే లైను గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రం ప్రాజెక్టులోని 50శాతం డబ్బులు, దానికి అవసరమయ్యే భూమి ఇస్తే కేంద్రం దాన్ని పూర్తి చేస్తుందని చెప్పారు. దీన్ని కూడా రాష్ట్రానికి ఏదో మేలు చేసినట్లు మాట్లాడుతున్నారంటూ దుయ్యబట్టారు.

కాంగ్రెస్ కంటే బీజేపీతోనే ఎక్కువ మోసం

సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ కంటే బీజేపీనే ఎక్కువ మోసం చేసిందని ప్రజల్లో బలంగా ఉందని, విభజన హామీలపై కేంద్రం సమీక్ష జరపలేని స్థితిలో ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. విభజన చట్టంలో పెట్టినవే ఇవ్వమన్నామని, ఇవ్వాల్సినవి ఇవ్వకుండా వక్రీకరిస్తూ లేఖలు రాస్తారా అంటూ ప్రశ్నించారు. ప్రజలు కట్టిన పన్నుల్లోంచే రాష్ట్రానికి వాటా ఇస్తున్నారని, కేంద్ర విద్యాసంస్థలకు రూ.11672 కోట్లు అవసరమైతే 576 కోట్లు ఇచ్చారని చెప్పారు. కేంద్ర విద్యాసంస్థలకు రూ.11584 కోట్ల విలువైన భూములు ఇచ్చామని ఈ సందర్భంగా బాబు గుర్తుచేశారు. ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి వేల కోట్ల విలువైన భూములు ఇచ్చాం. ఇచ్చిన భూములకు డబ్బులు కూడా ఇవ్వలేదు. ఏ రాష్ట్రంలో జాతీయ రహదార్లకు ఎంత ఖర్చు చేశారో చర్చ జరిగితే అన్ని విషయాలు తెలుస్తాయి. నడికుడి-కాళహస్తి రైల్వేలైన్‌కు భూమిచ్చి 50 శాతం నిధులిచ్చాం. తామే చేశామని కేంద్రం చెబుతోంది. చట్టంలో ఉన్న దుగరాజపట్నం పోర్టు ఏమైంది? కేంద్రం తీరుతో విజయవాడ మెట్రో మళ్లీ మొదటికొచ్చింది. ఢిల్లీ, ముంబైకి కేంద్రం నిధులు ఏపీకి ఏడీబీ రుణం ఇస్తారా? ఏపీకి ఒక రూల్. వేరే రాష్ట్రాలకు మరో రూలా? నాకు 5 కోట్ల మంది ప్రజలే హైకమాండ్. నీతివంతమైన పాలన ఇవ్వడం తప్ప మరొకటి తెలియదు అని చంద్రబాబు అన్నారు. ప్రత్యేకహోదాపై రాజీపడి తెలుగువారి ఆత్మగౌరవానికి తాకట్టు పెట్టాలా అంటూ కేంద్రాన్ని చంద్రబాబు నిలదీశారు. ఈఏపీ, పన్ను రాయితీలు ఇస్తామని ఎక్కడా చెప్పడం లేదన్నారు. తమను దెబ్బతీయాలనే దుర్బుద్ధి తప్ప మరోటి కనపడడం లేదని ఆయన దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా విషయం తేలాలని, స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా హోదా ద్వారా వచ్చే నిధులిచ్చి కేంద్రం చేతులు దులుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ప్రత్యేక హోదా కింద వచ్చే అన్ని రాయితీలు ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

సీఎంను ఆశీర్వదించిన ముస్లిం మతపెద్దలు



అమరావతి, సూర్య ప్రతినిధి : సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం పలువురు ముస్లిం పెద్దలు ఆశీర్వదించారు. బాగ్దాద్ నుంచి పెద్ద గురువు పంపిన చాదర్‌ను చంద్రబాబు ఈ సందర్భంగా స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన షాదర్ ను అజ్మీర్‌లో ఖాజా మొయినుద్దీన్ దర్గాకు బహూకరించిన చంద్రబాబు అజ్మీర్ లో ఉరుసుకు వెళుతున్న ముస్లిం మత పెద్దలు ముఖ్యమంత్రిని కలసి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలని ప్రార్ధించారు. మత పెద్దలు యజ్‌దాని తదితరులు ఇందులో పాల్గొన్నారు. చంద్రబాబుకు ముస్లింల సంపూర్ణ మద్దతు ఉంటుందని మైనారిటీ నేతలు ప్రకటించారు. కృష్ణా జిల్లా మైనారిటీల పక్షాన ముఖ్యమంత్రిని కలసిన వారిలో ఎం.హెచ్ రహమాన్, ఎస్.ఎం ఫైజాన్, ఎండీ బేగ్, ఎండీ సల్మాన్, ఎ. మబూద్, అస్గర్ షరీఫ్, ఎస్.కె అమానుల్లా, ఎస్.ఎం జావేద్ , కరీముల్లా, ముఫ్తి తదితరులు ఉన్నారు.

చిత్తశుద్ధి ఉంటే మోదీని నిలదీయండి



గుంటూరు, సూర్య ప్రతినిధి : రాష్ట్ర విభజన హామీల సాధనకు తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలుగుదేశం పార్టీ ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. పార్లమెంటు లోపల, బయటా టీడీపీ ఎంపీలం తా ఆందోళన కొనసాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడం విఫలమైన కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసానికి లోక్‌సభలో నోటీసులు ఇస్తున్నా సభాపతి సుమిత్రా మహాజన్ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థిక బిల్లులు వంటి కీలక బిల్లులను అరగంటలోనే ఆమోదించారని గుర్తు చేశారు. సభలో చూడలేను, వినలేనంటున్నారు, ఇకపై మాట్లాడలేనంటారేమో అని సభాపతి వైఖరిపై స్పందించారు. స్వతంత్రంగా వ్యవహరించకుండా సభాపతి కేంద్రం చెప్పినట్టే చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా లేవని సభాపతి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జనసేన, వైసీపీ నేతలు టీడీపీని రాజకీయ లబ్దికోసమే నిందిస్తున్నాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో వాస్తవంగా పోరాటం చేస్తున్నదెవరో ప్రజలు చూస్తున్నారని గల్లా తెలిపారు. జనసేన, వైసీపీ నేతలకు రాష్ట్ర ప్రయోజనాల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సూచించారు. ప్రత్యేక హోదా ఇవ్వొద్దని ఆర్థిక సంఘం నివేదికలో ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. ఈ సమావేశాల్లో కేంద్రం స్పందించకపోతే న్యాయ మార్గాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

సర్వాంగ సుందరంగా వేములవాడ

పురపాలక శాఖ మంత్రి కెటి రామారావు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణలోని ప్రముఖ శైవ క్షేత్రం వేములవాడ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పురపాలక శాఖ మంత్రి కెటి రామారావు తెలిపారు. ఈరోజు హైదరాబాద్, అసెంబ్లీలోని కమిటీహాల్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థ సమీక్షా సమావేశాన్ని మంత్రి కెటీఆర్ నిర్వహించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా పట్టణాభివృద్ధిని సమగ్రంగా చేసేందుకు ఒక విజన్ తో ముందుకు పోవాలని అధికారులను అదేశించారు. అథారిటీల పరిధిలోకి పట్టణ పరిసర ప్రాంతాలను, ముంపు గ్రామాలను తీసుకుని వచ్చి, వాటిన్నంటిని వేములవాడ పట్టణ అభివృద్ధితో అనుసంధానం చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్లో 5,10,25 సంవత్సరాలకు అందుకోవాల్సిన లక్ష్యాలను నిర్ధేశించుకోవాలన్నారు. రాబోయే సంవత్సరాల్లో జరగాల్సిన అభివృాఎద్దికి, జనాభాకు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మౌళిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. దేవాలయ డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపిన మంత్రి, పట్టణంలో చేపట్టే సివిల్ వర్క్స్(భవనాలు, బ్రిడ్జీలు, రోడ్ల) లో చోళ-చాళుక్య శిల్ప కళా ఉట్టపడేలా చూడాలన్నారు. వేములవాడను ప్రణాళికా బద్దంగా అభివృాఎద్ది చేస్తామని, మాస్టర్ ప్లాను రూపోందించడంలో భవిష్యత్తు అవసరాలను పరిశీలించాలని డిటిసిపి అధికారులకు అదేశాలు జారీ చేశారు.

పట్టణంలో ప్రవేశించగానే ఒక టెంపుల్ టౌన్ కు వచ్చామనే భావన కలిగేలా సర్వంగా సుందరంగా తీర్చి దిద్ది అన్న రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ద వహించాలని అధికారులను అదేశించారు. పట్టణంలో విస్తరించనున్న రోడ్లలతోపాటు, పట్టణంలో గ్రీనరీ పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గుడిచెరువులోకి మురికి నీరు రాకుండ, ఒక నాలాను ఏర్పాటు చేయాలన్నారు. ఒక్క మురికినీటి చుక్క గుడి చెరువులోకి రావద్దని, ఈ యస్టీపి నిర్మాణానికి వేంటనే చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న బస్టాండ్ నుంచి దేవాలయం వరకు కేబుల్ కార్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలన్నారు. పట్టణంలో భక్తుల సౌకార్యార్ధం ఉచితంగా బస్సులు(సాద్యమైతే ఏలక్ట్రిక్ బస్సులను) ఏర్పాటు చేయాలని కోరారు. విటిడిఏ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తానని, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కూమార్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. త్వరలోనే వేములవాడలో పర్యటించి అక్కడి పనులను క్షేత్ర స్థాయితో పరిశీలిస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఇచ్చిన ప్రత్యేక నిధులతో పట్టణంలో ఇప్పటికే పలు అభివృాఎద్ది పనులు వేగంగా జరుగుతున్నాయని స్థానిక యంఏల్యే చెన్నమనేని రమేష్ మంత్రికి తెలిపారు. వీటితోపాటు పట్టణంలో అగ్నిమాపక స్టేషన్, నాంపల్లి గుట్ట అభివృద్ధి, శ్మశాన వాటిక పనులు మెదలయిన వాటికోసం సూమారు 43 కోట్ల నిధుల ప్రతిపాధనలను మంత్రి కెటియార్‌కు అందించారు. మంత్రిగారి సూచనల మేరకు విటిడిఏ పరిధిలోకి ముంపు గ్రామాలను తీసుకువస్తామన్నారు. నాంపల్లి గుట్ట వద్ద నూతనంగా మరో ఘాట్ రోడ్డు ఏర్పాటుతోపాటు గుట్టపైన నర్సింహ స్వామి దేవాలయ అభివృద్ధి వంటి పనులను ముందుకు తీసుకుపోతామని తెలిపారు.

ఈ సమావేశంలో విటిడిఏ అధికారులు, రాజన్న సిరిసిల్లా కలెక్టర్ క్రిష్ణ భాస్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీకీ ఏం చేశారో పార్లమెంట్‌లో చెప్పాలి

టీడీపీ ఎంపీ కొనకళ్ల నారాయణ



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : ఏపీ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీ కొనకళ్ల నారాయణ ఫైర్ అయ్యారు. శనివారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ఏపీ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కౌన్సిలర్‌గా కూడా గెలవలేరని, సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ పదవి టీడీపీ వల్లే వచ్చిందన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. అలాగే అమిత్‌షా అవగాహన లేకుండా అసంపూర్తిగా లేఖ రాశారని, అమిత్‌షా లేఖలో ఏపీ బీజేపీ నేతల మాటలే ఉన్నాయన్నారు. ఏపీకి ఏం చేశారో పార్లమెంట్‌లో చెప్పాలని, లేఖల్లో కాదని కొనకళ్ళ అన్నారు.

'అమ్మ' భాషకు అందలం

- తెలుగు భాష అమలు తప్పనిసరి బిల్‌కు ఆమోదం
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- శాసనసభలో బిల్‌కు ఏకగ్రీవ ఆమోదం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలుగు భాషను రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేసే బిల్‌ను నేడు శాసనసభ ఆమోదించింది. రానున్న విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ఇతర భాష పాఠశాలల్లో కూడా తెలుగు తప్పనిసరి అమలు చేయాలనే ఉద్దేశ్యంతో ఈ బిల్ ను ప్రవేశపెడుతున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. తెలుగు భాష గొప్పతనాన్ని నిలబెట్టేందుకు, తెలుగు భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు, తెలుగుకు పట్టం కట్టేందుకు ఈ బిల్ ను తీసుకొచ్చామని చెప్పారు. గత ప్రభుత్వాలు తెలుగు భాష పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయని, తెలంగాణ ప్రభుత్వం తెలుగు భాష అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

తెలుగు భాష తప్పనిసరి అమలు చేసేందుకు ప్రవేశపెట్టిన బిల్లుపై సభ్యులు జాఫర్ హుస్సేన్, కిషన్ రెడ్డి, ఆర్. కృష్ణయ్య, సున్నం రాజయ్యలు మాట్లాడారు. తెలుగును తప్పనిసరి చేస్తూ బిల్లు తీసుకురావడాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ బిల్లు అమలును శాసనసభ నుంచే అమలు చేయాలని, తెలుగు భాషలోనే శాసనసభ వ్యవహారాలు నడపాలని, ఉత్తర్వులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని సూచించారు. ఇతర ంరాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలలో మాతృభాష అమలు కోసం ఉద్యమాలు చేశారని,



చివరకు బస్సులపై పేర్లు కూడా మాతృభాషలోనే రాశారని, ఇక్కడ కూడా అలాగే అమలు చేయాలన్నారు. ఇతర భాషల పాఠశాలల్లో ఉత్తీర్ణత మార్కులను 20కే నిర్ణయించాలని, ఒకరిద్దరు విద్యార్థులున్న చోట కచ్చితంగా ఉపాధ్యాయులను నియమించాలనే దానికి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

అమ్మభాషకు అందలంః శ్రీహరి

తెలంగాణ రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి తెలుగు భాష తప్పనిసరిగా చదవాలనే మంచి ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసిఆర్ ఉన్నారని, అంతే కాకుండా తెలుగు భాష గొప్పతనాన్ని చాటేందుకు ఇటీవలే తెలుగు ప్రపంచమహాసభలు బ్రహ్మాండంగా నిర్వహించారని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. తెలంగాణలో తెలుగును అమలు చేయడం కోసం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ సిదారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ తమిళనాడు, పంజాబ్‌లలో పర్యటించి, అక్కడ మాతృాఏభాషను అమలు చేస్తున్న తీరును అధ్యయనం చేశారన్నారు. తమిళనాడు మోడల్ లో తెలుగు భాషను అమలు చేయాలని ఈ బిల్ తెచ్చామన్నారు.

తొలిదశలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, రాష్ట్ర, కేంద్ర, ఇతర భాషా ప్రాథమిక పాఠశాలల్లో మొదటి తరగతిలో తెలుగు భాషను ప్రవేశపెడుతున్నామ కడియం శ్రీహరి తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి తెలుగు భాషను ప్రవేశపెడుతున్నామన్నారు. ఆరో తరగతిలో ప్రవేశపెట్టే భాష చాలా సులభతరంగా ఉంటుందని చెప్పారు. తెలుగు భాషను తప్పనిసరి చేయడం కోసం రూపొందించే సిలబస్ బాధ్యతలు తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయంకు అప్పగించామన్నారు.అమ్మ ఒడి పలుకులు బడి పలుకులు కావాలనే లక్ష్యంతోనే తెలుగు తప్పనిసరి అమలు బిల్లును తీసుకొచ్చామని, దీనిని అందరూ స్వాగతించి ఆమోదించినందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

జైట్లీని సుజనాచౌదరి కలవలేదు

టీడీపీ ఎంపీ సీఎం రమేష్



అమరావతి, సూర్య ప్రతినిధి : రాజ్యసభ సభ్యుడిగా సీఎం రమేష్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి డిక్లరేషన్ తీసుకున్నారు. రెండోసారి తనను రాజ్యసభకు పంపినందుకు గాను సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా బీజేపీ అడ్డుకుంటోందని తెలిపారు. అన్నాడీఎంకే బీజేపీ చెప్పుచేతల్లో నడుస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం దిగివచ్చి సమస్యను పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. నాలుగేళ్లు తాము ప్రభుత్వంలో ఉన్నప్పుడు కనిపించని అవినీతి ఇప్పుడే కనిపిస్తుందా? అని ప్రశ్నించారు. సుజనా చౌదరి కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీని కలవలేదని, అదంతా తప్పుడు ప్రచారమేనన్నారు.

తమ ప్రభుత్వం అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. బీజేపీ ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలో సచివాలయ భవన ఆకృతుల ప్రదర్శన




వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సచివాలయ భవన నూతన ఆకృతులను స్పీకర్ కోడెల శివప్రసాద్ రావు, మంత్రులు, శాసనసభ్యులు పరిశీలించారు. లండన్‌కు చెందిన ఆర్కిటెక్ట్ నార్మన్ పోస్టర్ రూపొందించిన భవన ఆకృతులను పరిశీలించిన అనంతరం ఆకృతులు చూడ చక్కగా ఉన్నాయని, అయితే కార్యాలయ విధులకు అనుకూలంగా విశాలమైన స్థలం ఉండాలని ఆయన సూచించారు. రాజధాని ప్రాంతంలో ఈ తరహా భవన నిర్మాణం కారణంగా ఆర్థిక, సామాజిక, పాలనావ్యవహారాలకు విస్తృత అవకాశాలు ఏర్పడతాయని స్పీకర్ వ్యాఖ్యానించారు. అంతకుముందు శాసనసభ్యులు, మంత్రులు భవన నమూనాలను పరిశీలించి బాగున్నాయంటూ కితాబిచ్చారు.

ప్రత్యేక హోదా బీజేపీ ఎప్పటికి ఇవ్వదని అనిపిస్తోంది


- కేంద్ర ప్రభుత్వం ఎంత ఇచ్చిందో, ఏపీ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో లెక్కలు చెప్పాలి
- అధికారులతో కమిటీ వేసి లెక్కలు కట్టి ప్రజలకు తెలియచేయవచ్చుగా?
- ప్రత్యేక హోదాపై వామపక్షాలతో త్వరలో సమావేశం
- పోరాటంలో ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయిస్తాం
- జనసేన అధినేత పవన కల్యాణ్

హైదరాబాద్,సూర్యబ్యూరో: భారతీయ జనతా పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా శనివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి లేఖ రాయడం, దానికి ప్రతిగా చంద్రబాబు శాసనసభలో సుదీర్ఘంగా జవాబు ఇవ్వడం చూస్తుంటే ప్రత్యేక హోదా బీజేపీ ఎప్పటికీ ఇవ్వదని అనిపిస్తోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ అలాగే హోదాను సాధించే స్థితిలో తెలుగుదేశం పార్టీ ఏమాత్రం లేదన్న సంగతిని ప్రజలు మరింత అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. తాము వేలాది కోట్ల రూపాయలను ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చామని, వాటిని ఖర్చు చేయడంలో టీడీపీ విఫలమైందని పాడిన పాటనే అమిత్ షా మళ్లీ పాడారని అన్నారు. అదేమాదిరిగా ఎప్పటిలాగానే చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ కు ఎన్డీఏ ప్రభుత్వం అన్యాయం చేసిందని మరోసారి ఘోషించారని అన్నారు. ఎందుకీ దాగుడు మూతలు కేంద్ర ప్రభుత్వం ఎంత ఇచ్చిందో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో ఇరు ప్రభుత్వాలకు చెందిన అధికారులను కమిటీగా వేసి లెక్కలు కట్టి ప్రజలకు తెలియచేయవచ్చుగా? జనసేన చొరవతో ఏర్పాటైన



జాయింట్ ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ అధ్యయనంలో వెల్లడైన అంశాలను పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయవచ్చుగా ఎంతకాలం ఈ ముసుగులో గుద్దులాట విసిగి వేసారిన ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరవధిక ఆందోళనలకు దిగే పరిస్థితులను దయచేసి కల్పించ వద్దని జనసేన పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తోంది. ప్రత్యేక హోదా తప్ప మిగిలిన వాటి గురించి వినే స్థితిలో ప్రజలు లేరనే యదార్థాన్ని ప్రభుత్వాలు గుర్తిస్తే మంచిది. బీజేపీ, తెలుగుదేశం పార్టీల కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితిపై చర్చించడానికి త్వరలో వామపక్షాల నాయకులతో చర్చలు జరపనున్నాము. ప్రజల కోరికను నెరవేర్చడానికి ఏ విధంగా ముందుకు వెళ్లాలో ఈ సమావేశంలో నిర్ణయిస్తాము. ఆ తరువాత లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ వంటి అనుభవజ్ఞులతో పాటు సీనియర్ రాజకీయ నాయకులు, మేధావులతో కూడా సమాలోచనలు జరుపుతాము అని పవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణకు చెక్‌డ్యాంలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణకే చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా చెక్‌డ్యామ్‌ల నిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో మొత్తం 193 చెక్ డ్యాం - బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. రూ. 225 కోట్లతో 94 చెక్ డ్యాం - బ్రిడ్జిలను నిర్మించామని తెలిపారు. మిగతా 99 చెక్ డ్యాం - బ్రిడ్జిల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. వీలైనన్ని చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని మంత్రి గుర్తు చేశారు. 511 వంతెనల నిర్మాణం జరుగుతుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

23 పురపాలికలు నగర పంచాయతీల స్థాయి పెంపు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణలోని 23 నగర పంచాయితీలను మున్సిపాలిటీలుగా మారుస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బడంగ్‌పేట్, పెద్ద అంబర్‌పేట్, నర్సంపేట్, సత్తుపల్లి, మధిర, గజ్వేల్, వేములవాడ, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, హుజూర్‌నగర్, జమ్మిగుంట, నాగర్ కర్నూలు, పరకాల, హుస్నాబాద్, బాదేపల్లి, అచ్చంపేట, దేవరకొండ, కొల్లాపూర్, ఐజ, అందోల్-జోగిపేట, హుజూరాబాద్ నగరపంచాయితీలను పురపాలికలుగా మారుస్తూ పట్టణాభివృద్ధి, పురపాలనశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



కాళేశ్వరం ద్వారా 37 లక్షల ఎకరాలకు సాగునీరు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టు కింద 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు తెలిపారు. శాసనమండలిలో కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై లఘు చర్చ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. మూడు షిప్టుల్లో పనులు జరుగుతున్నాయని సభకు తెలిపారు. సీఎం కేసీఆర్ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టు వద్ద నీటి లభ్యత తక్కువగా ఉందన్న ఆయన, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర జలసంఘం రాష్ట్రానికి లేఖ రాసిందని పేర్కొన్నారు. తమ్మిడిహట్టి వద్ద మళ్లింపుకోగలిగే నీళ్లు 42 టీఎంసీలు మాత్రమే అని తెలిపారు. తమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేనందునే మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు చేపడుతున్నామన్నారు. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు చేపట్టకపోతే నీళ్లు లభించే పరిస్థితి లేదన్నారు. ఇక్కడ ప్రాజెక్టు చేపట్టడం వల్ల 200 టీఎంసీల నీటి లభ్యత ఉందని కేంద్ర జలవనరుల సంఘం చెప్పిందని హరీష్‌రావు సభ్యులకు తెలియజేశారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్ జిల్లా నీటి అవసరాలు తీరుతాయన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు కింద రిజర్వాయర్ల సామర్థ్యం 14 టీఎంసీలు మాత్రమేనని అన్నారు. 14 టీఎంసీలతో 16 లక్షల ఎకరాలకు నీరందించడం సాధ్యం కాదన్నారు. కేంద్ర జలవనరుల సంఘం సూచన మేరకు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని 141 టీఎంసీలకు పెంచుకున్నామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద 19 జిల్లాలకు లబ్ధి చేకూరుతుందని మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు కాళేశ్వరం నుంచి నీళ్లు వచ్చేలా చర్యలు చేపట్టనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నదిని సస్యశ్యామలం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి హరీష్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.

కాంగ్రెస్ గూటికి చేరనున్న 'నాగం'

- **నాగం చేరికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న డీకే అరుణ వర్గం**
- **గతంలోనే అధిష్టానానికి ఫిర్యాదు ... నాగం చేరికను అడ్డుకునే యత్నం**
- **జైపాల్ సహకారంతో కాంగ్రెస్‌లో చేరేందుకు పావులు కదుపుతున్న నాగం**





హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: బీజేపీకి గుడ్‌బై చెప్పిన సీనియర్‌నేత నాగం జనార్ధన్‌రెడ్డి, ఈనెలఖారులోగా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. నాగం చేరికను జిల్లాకు చెందిన మాజీ మంత్రి డీకే అరుణతోపాటు, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డిలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతంలోనే నాగం, కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయన్న ఊహగానాల నేపథ్యంలో డీకే అరుణ నేతృత్వంలో దామోదర్‌రెడ్డి, ఎంపీ నంది ఎల్లయ్యలు అధిష్టాన పెద్దలను కలిసి, నాగం చేరిక పట్ల తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నాగం ప్రస్తుతం బీజేపీకి రాజీనామా చేశారు. ఇంకా ఏ పార్టీలో చేరుతారన్నదానిపై స్పష్టత లేకపోయినా, ఆయన కాంగ్రెస్‌లోనే చేరే అవకాశాలున్నాయన్న ప్రచారం జరుగుతోంది. మాజీమంత్రి చిన్నారెడ్డి ఈ విషయాన్ని ధృవీకరించారు.కేంద్రమాజీమంత్రి జైపాల్‌రెడ్డి అండదండలతో కాంగ్రెస్‌లో చేరేందుకు నాగం జనార్దన్‌రెడ్డి పావులు కదుపుతున్నారు. నాగం చేరికకు జైపాల్‌రెడ్డి ఇప్పటికే దాదాపుగా లైన్‌క్లియర్ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నాగం కనుక కాంగ్రెస్‌లో చేరితే డీకే అరుణ ప్రతిస్పందన ఎలా ఉంటుందన్నదానిపై కాంగ్రెస్‌వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. నాగం జనార్దన్‌రెడ్డి చేరికను ఇప్పటి వరకు డీకే అరుణ బహాటంగా వ్యతిరేకించకపోయినా, దామోదర్‌రెడ్డి మాత్రం బహటంగానే వ్యతిరేకిస్తున్నారు. నాగంను పార్టీలో చేర్చుకోవాలనే ఆలోచనపై పార్టీ నాయకత్వం పునరాలోచన చేయాలని సూచిస్తున్నారు. రానున్నా ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ టికెట్‌ను నాగం జనార్దన్‌రెడ్డి ఆశిస్తున్నారు. తాను ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే చివరిసారని ఆయన ప్రకటించారు. అయితే అదే స్థానాన్ని దామోదర్‌రెడ్డి సైతం తన కుమారుడికి ఇప్పించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఆధిపత్యం కోసం జైపాల్‌రెడ్డి, డీకే అరుణల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. జైపాల్‌రెడ్డి తన బలాన్ని పెంచుకునేందుకే నాగం జనార్దన్‌రెడ్డిని పార్టీలోకి తీసుకువస్తున్నారని డీకే అరుణ వర్గీయులు అంటున్నారు. అందుకే ఆయన చేరికను ఆమె వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ వర్గ రాజకీయాల్లో నాగం జనార్దన్‌రెడ్డి ఎంతవరకు ఇమడగలరన్నది ప్రశ్నార్ధకంగా మారింది. స్వతహాగా కాంగ్రెస్‌పార్టీ వ్యతిరేకి అయినా ఆయన కాంగ్రెస్‌లో చేరినా, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయగలరా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. బీజేపీకి ఇప్పటికే గుడ్‌బై చెప్పిన నాగం, కాంగ్రెస్ మినహా మరో పార్టీలో చేరే అవకాశాలు లేవన్న వాదనలు వినిపిస్తున్నాయి. టీఆర్ఎస్ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించే ఆయన ఆపార్టీలో ఎంతమాత్రం చేరే అవకాశాలు లేవంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌ను గతంలో సిద్ధాంతపరంగా వ్యతిరేకించినా, ఇప్పుడు ఆపార్టీ నాయకత్వం సైతం బలమైన నేతల చేరికకు గ్రీన్‌సిగ్నలిచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరేందుకే నాగం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

'ప్రజల ఆరోగ్య పథకం కొనసాగుతుంది'



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకం కొనసాగుతుందని వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆరోగ్య పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. పరిపాలన సంబంధిత అంశాల్లో భాగంగానే సీఈవోను మార్చామని తెలిపారు. త్వరలో ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకానికి సీఈవోను నియమిస్తామని చెప్పారు. అదనంగా ఈవో గోపీనాథ్‌ను కూడా నియమిస్తున్నామని పేర్కొన్నారు. వెల్‌నెస్ కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయి.. ఆరోగ్యశ్రీలో కలపడం లేదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ, వెల్‌నెస్ కేంద్రాలు ప్రజారోగ్యంలో రెండు వేర్వేరు సేవా కేంద్రాలు అని మంత్రి తెలిపారు. వెల్‌నెస్ కేంద్రాల్లో మందుల కొరత త్వరలో తీరుతుందన్నారు. ఇప్పటి వరకు 4 వెల్‌నెస్ కేంద్రాలు పని చేస్తున్నాయని గుర్తు చేశారు. మరో 4 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. మిగతా చోట్ల కూడా వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

' ఏపీలో అవినీతి జనసేన అధినేత పవన్‌కు ఇప్పుడు కనపడుతోందా? '



అమరావతి,సూర్యప్రతినిధి: ఏపీలో అవినీతి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు ఇప్పుడు కొత్తగా కనపడుతోందా? అని హీరో శివాజీ ప్రశ్నించారు. శనివారం సినీ హీరో శివాజీ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇసుక, మట్టి విషయం లో జరుగుతున్న అవినీతి విషయమై తాను గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రజల్లోకి పవన్ కల్యాణ్ ఎన్నిసార్లు వచ్చారు? రోజూ ట్వీట్లు చేసే పవన్, ప్రభుత్వ అవినీతి గురించి ఇన్నాళ్లూ ఎందుకు ప్రశ్నించలేదు అన్నారు. లోకేశ్ అవినీతి చేశారని ఇప్పుడే ఎందుకు ప్రశ్నిస్తున్నారు? ఎమ్మార్వో వనజాక్షిపై ఎప్పుడో దాడి జరిగితే ఇప్పుడు ప్రశ్నిస్తున్నారేంటి ఆయన ఆరోపించారు. కరెక్టుగా లేరు నిజాయతీగా లేరు నిబద్ధతతో వ్యవహరించడం లేదు. ఏపీకి రావాల్సిన యాపిల్, చైనా కంపెనీలు రాకుండా తరలిపోయాయిఅన్నారు. ప్రధాని మోదీ తనకు చాలా క్లోజ్ అని పవన్ చెబుతున్నారు కదా మోదీతో పవన్ మాట్లాడి ఏపీకి రాకుండా పోయిన ఆ కంపెనీలను ఇక్కడికి రప్పించాలి అని పవన్ పై విమర్శలు గుప్పించారు.

ఏపీలో బాత్రూమ్‌లు కట్టకుండా వేల కోట్లు నొక్కేశారు



- **ప్రత్యేక హెూదా కింద 16 వేల కోట్లు ఇవ్వనున్నాం**
- **ఏపీలో అనివీతిని తవ్వేందుకు పలుగు చాలదు... బుల్డోజర్ కావాలి**
- **చెట్టు-నీరు పథకంలో మట్టి అమ్ముకున్నారు**
- **పట్టిసీమ ఎత్తిపోతలలో ఉన్న మెకానిజం ఏమిటి ?**
- **బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపణ**

విజయవాడ,సూర్య ప్రతినిధి: ఏపీలో బాత్రూమ్ లు కట్టకుండానే వేల కోట్లు నొక్కేశారని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపణలు గుప్పించారు. శనివారం విజయవాడలోబీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.27 వేల కోట్లు కేంద్రం నుంచి వచ్చాయని, చెట్టు-నీరు పథకంలో మట్టి అమ్మకున్నారని, పట్టిసీమ ఎత్తిపోతలలో ఉన్న మెకానిజం ఏంటి? స్పిల్ వేలో రూ.1400 కోట్ల ఖర్చు ఎందుకు అయిందో చెప్పాలని ప్రశ్నించారు. మట్టి తీయడానికే రూ.67 కోట్లు ఇచ్చారని, మెయిన్ కెనాల్ లో కలపడానికి పంపు సెట్లకే రూ.817 వెచ్చించారని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీపై ఆయన విమర్శలు గుప్పించారు. టీడీపీ అంటే తెలుగు డ్రామా పార్టీ అని అభివర్ణించారు. అవినీతిని కింది స్థాయి కి తీసుకెళ్లిన పార్టీ టీడీపీయేనని ఆరోపించారు. ఏపీలో పరిపాలన గాడి తప్పుతోందని, ఎమ్మెల్యేలను అదుపు చేసే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ఏపీలో అవినీతి పరాకాష్టకు చేరిందని, ప్రభుత్వ అవినీతిని తవ్వడానికి పలుగు సరిపోదని, బుల్డోజర్ కావాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అవినీతికి పట్టిసీమ పరాకాష్ట అని, రూ.1120 కోట్లతో పట్టిసీమ మొదలైందని, ఇప్పుడు రూ.1667 కోట్లకు వెళ్లిందని అన్నారు. పట్టిసీమలో ఏర్పాటు చేసిన మోటార్లు 30 అని చెప్పారని, కేవలం 24 మోటార్లు మాత్రమే పెట్టారని, పంపు సెట్ల ఖరీదులోనూ మతలబు ఉందని ఆరోపించారు. మంత్రి నారా లోకేశ్ కు 20 అవార్డులు వచ్చాయి కానీ, ఆయనకు సంబంధించిన శాఖలో అవినీతికి హద్దు లేదని అన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి పరిశుభ్రతకు రూ.40 లక్షలు కేటాయించడం అవసరమా? అని ప్రశ్నించిన ఆయన, ఉపాధి హామీ, సర్వశిక్ష అభియాన్ పై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వడానికి సిద్ధంగా ఉందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రకటించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక హోదా కింద రూ.16,000 కోట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చేందుకు అంగీకరించినట్టు ఆయన చెప్పారు. అయితే, ఈ నిధులు విడుదల చేసేందుకు గాను ఓ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు సోము వీర్రాజు చెప్పారు. లేకుంటే కేంద్ర ప్రభుత్వం నిధులను నేరుగా టీడీపీ ప్రభుత్వానికి ఇస్తే వాటిని దారి మళ్లించే ప్రమాదం ఉందన్నారు. ఓ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తే దానికి జవాబుదారీ ఉంటుందని అభిప్రాయపడ్డారు. కేంద్రం మట్టి, నీరు ఇచ్చిందని ఏపీ ప్రభుత్వం విమర్శిస్తోంది

మీరు మాత్రం హెలికాప్టర్ లో తిరిగి నీళ్లు చల్లి శుద్ధి చేస్తారా?రాజధాని డిజైన్లు ఇప్పటికీ ఖరారు చేయలేదుఏపీ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోంది ఏపీ రాజధాని వ్యవహారంలో టీడీపీ వైఖరిని బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు తప్పుబట్టారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏపీకి కేంద్ర ప్రభుత్వం మట్టి, నీరు ఇచ్చిందని విమర్శలు చేస్తున్నారని, మీరు మాత్రం హెలికాప్టర్ లో తిరిగి నీళ్లు చల్లి శుద్ధి చేస్తారా? అని ఏపీ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. నాలుగేళ్లవుతున్నా, రాజధాని డిజైన్లు ఇప్పటివరకు ఖరారు చేయలేదని విమర్శించారు. రాజధానిలో 1000 బిల్డింగ్ లు కట్టడానికి కేవలం రూ.2000 కోట్లు ఖర్చు అవుతుందని, ఏపీ సర్కార్ మాత్రం రూ.40 వేల కోట్లు ఖర్చవుతుందంటూ తప్పుడు లెక్కలు చెబుతోందని, అసెంబ్లీ భవనాల నిర్మాణానికి ఒక ఎస్ఎఫ్ టీ కి ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ తాత్కాలిక అసెంబ్లీలో టాయిలెట్లు లేవని, వెంటిలేషన్ కూడా సరిగా లేదని విష్ణుకుమార్ రాజు విమర్శించారు.

'ఏప్రిల్ 18 నుంచి సీపీఎం జాతీయ మహాసభలు : తమ్మినేని



హైదరాబాద్, మేజర్‌న్యూస్: వచ్చేనెల 18వ తేదీ నుంచి 22వరకు హైదరాబాద్‌లో సీపీఎం జాతీయ మహాసభలు జరగనున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ... సీపీఎం జాతీయ మహాసభల్లో బీజేపీని ఎదుర్కొనే అంశాలపై చర్చిస్తామన్నారు.

అలాగే తెలంగాణలో కేసీఆర్ కుటుంబం తప్ప ఎవరూ సంతోషంగా లేరని, ఉద్యమాలు జరగకూడద న్నట్టుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని తమ్మినేని విమర్శించారు. 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పోటీ చేస్తుందని తమ్మినేని తెలిపారు.

'చంద్రబాబు వెన్నుపోటు గురించి చాలానే మాట్లాడగలం'



అమరావతి,సూర్యబ్యూరో: టీడీపీ నేతలు నీచ రాజకీయాలు చేస్తున్నారని, తాము తలచుకుంటే చంద్రబాబు వెన్నుపోటు గురించి చాలానే మాట్లాడగలమని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ)కు వెళ్లడంపై చంద్రబాబు చేసిన విమర్శల నేపథ్యంలో మాధవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభ, లోక్ సభ సభ్యుడు ఎవరైనా ప్రధాన మంత్రి కార్యాలయానికి వెళ్లొచ్చని, ఈ విషయం చంద్రబాబు గమనించాలని అన్నారు.

ఏపీ అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ఆదుకుందని, ఏపీకి ఇప్పటివరకు ఏం చేశామో అమిత్ షా సవివరంగా వివరించారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం తామెప్పుడూ పాకులాడలేదని, ఇంతవరకూ నిధుల వినియోగానికి సంబంధించి వివరాలు ఇవ్వలేదని మాధవ్ విమర్శించారు.

తొలగించిన 26 బిసి కులాలకు న్యాయం చేయాలి

జూబ్లిహిల్స్, మేజర్‌న్యూస్ : వెనుకబడిన తరగతులకు చెందిన 26 కులాలను యధాతదంగా జిఓ నెంబర్ 3లో పొందుపరచాలని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ బి.యస్ రాములును కలిసి బడుగు నేతలు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు శనివారం నగరంలోని బీసి కమిషన్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, మాధవరం కృష్ణారావు, అరికిపూడి గాంధి, వివేక్ గౌడ్‌లు చైర్మన్ కలిసి బీసిల సమస్యలను విన్నవించారు.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మరియు ఇతర జిల్లాల నుంచి గత 30 సంవత్సరాల క్రితమే వలస వచ్చి హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో రోజువారీ కూలీలుగా భావన నిర్మాణం కూలీలుగా, పరిశ్రమలో కార్మికులుగా చిన్న చిన్న ఉద్యోగులుగా జీవిస్తున్నారని. కానీ ప్రభుత్వం జిఓ నెంబర్3 ద్వారా వెనుకబడిన కులాలను తొలగించడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. ముఖ్యంగా తూర్పు కావులు, కళింగ, కొప్పుల వెలమ, శెట్టి బలిజ, ఈడిగా, బండ్ల , కోర్చు, నక్కల, మందుల, పొందరా, మెహతా, సామంతుల, అరిచీకట్లవారు, జెద్ర, కుచ్చెటి, గవర, గవడ, గవడ, అతగారా, అగరు, చెక్కల, కద్ర, కోసి, పోలినాటి వెలమ, పాత్కామ్, కాత్రిల ఉద్యోగ విషయంలో రిజర్వేషన్ లేనందువల్ల ఆర్థికంగా సామాజికంగా ఇంకా ఇబ్బందులను ఎదుర్కుంటున్నారని వారు కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అందువల్ల యధావిధిగా ఈ పై తెలిపిన కులాలను వెనుకబడిన వర్గాల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని బి సి కమిషన్ చైర్మన్ బి.యస్ రాములుకు వినతి పత్రం అందించారు.



బిసి కమిషన్‌కు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యేలు మాధవరం, మాగంటి, గాంధి, వివేక్

ఎట్టకేలకు కారుణ్యం సింగరేణి ప్రధాన కార్యాలయం ఉత్తర్వు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : సింగరేణి యాజమాన్యం ఎట్టకేలకు కారుణ్యనియమకాల సర్క్యులర్‌ను జారీచేసింది. ఈ సర్క్యులర్‌లో గతంలో ఉన్న 5 జబ్బులకు తోడు మరో 11 జబ్బులను చేర్చి మొత్తం 16 రకాల జబ్బు లున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. 09.03.2018 నాటికి రెండు సంవత్సరాల సర్వీసు ఉన్నవారు అర్హులని తెలిపింది. దీంతో సింగరేణి వ్యాప్తంగా సుమారు 3,600 మందికి ఊరట కలగనుంది.

వీరు అర్హులు :1)పక్షవాతం, 2)మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులు, 3)కాలేయ సంబంధిత వ్యాధులు 4)కేన్సర్, 5)మానసిక వ్యాధులు, 6)మూర్ఛ, 7) గని ప్రమాదంలో అవయవాలు కోల్పోయిన వారు (ఉదాహరణకు కాళ్లు, చేతులు, కళ్లు ఇతర్రతా), 8)గుండె జబ్బులు, 9)టీబీ 10)హెచ్ఐవీ 11)కుష్టు వ్యాధి 12)కీళ్లవ్యాధి 13) దృష్టిలోపం, వినికిడిలోపం 14)మెదడు సంబంధిత వ్యాధులు 15) ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు 16) రోడ్డు, ఇతర ప్రమాదాలలో గాయపడి అంగవైకల్యం పొందిన వారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారి ఉద్యోగం పొందే వారసుడి వయసు 35 సంవత్సరాలు ఉండాలని నిబంధన విధించింది. అయితే గతంలో (2015) ఇచ్చిన వారసత్వ ఉద్యోగాల సర్క్యులర్‌లో సర్వీసు ఒక్క సంవత్సరం ఉన్నవారికి, వయోపరిమితి 40 సంవత్సరాలు ఉన్నవారికి అవకాశం కల్పించింది. యాజమాన్యం ఈ సర్క్యులర్‌లో 2 రెండు సంవత్సరాల సర్వీసుతోపాటు, వయోపరిమితిని 35 సంవత్సరాలకు కుదించింది. దీంతో చాలామంది ఉద్యోగ అవకాశాన్ని కోల్పోయే ప్రమాదముందని, యాజమాన్యం పునరాలోచించాలని పలు కార్మిక సంఘాల నాయకులు వేడుకుంటున్నారు.

సినీ హీరో శివాజీపై ఏపీ డీజీపీకి మాజీ మంత్రి మాణిక్యాలరావు ఫిర్యాదు



అమరావతి,సూర్యబ్యూరో: సినీనటుడు, ప్రత్యేక హోదా సాధన సమితి నేత శివాజీ ఇటీవల ఓ జాతీయ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. శనివారం మాజీ మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ దక్షిణాదిన ఓ జాతీయ పార్టీ కుట్ర పన్నిందని తెలుగు రాష్ట్రాల్లో ఆపరేషన్ ద్రవిడ పేరుతో ఇతర పార్టీలను బలహీనపరుస్తుందని ఆయన అన్నారు. ఆయన ఆరోపణలపై బీజేపీ నేత, ఏపీ మాజీ మంత్రి మాణిక్యాలరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. శివాజీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ డీజీపీ మాల కొండయ్యను కలిశారు. శివాజీ ఆపరేషన్ ద్రవిడ అంటూ ఓ వీడియో విడుదల చేశారని దాన్ని పరిశీలించి కేసు నమోదు చేయాలని డీజీపీని కోరారు.

ఓపెన్ టెండర్ల ద్వారానే విద్యుత్ కొనుగోలు

- **రైతులకు నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కృషి**
- **దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నాం**
- **శాసనసభలో మంత్రి జగదీశ్‌రెడ్డి వివరణ**




హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా విద్యుత్ అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఓపెన్ టెండర్ల ద్వారానే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీపీసీ ద్వారా విద్యుత్ కొనుగోలుకు ధర ఎక్కువ చెల్లిస్తున్నామని చెప్పారు. ఎన్టీపీసీ వెల్లూరు నుంచి కొనుగోలు చేస్తే రూ. 5.42 ధర, ఎన్టీపీసీ కొడ్గి నుంచి కొనుగోలు చేసినదానికి రూ. 5.46 ధర చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రయివేటు సంస్థల కంటే ఎన్టీపీసీ వద్ద కొనుగోలుకు ఎక్కువ ధర చెల్లిస్తున్నామని తెలిపారు. టెండర్ల ద్వారా వెళ్లినా ఈఆర్‌సీలే ధరలు నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వరంగ సంస్థ కూడంకుళం ఎన్టీపీసీని సంప్రదించామని చెప్పారు. ఎన్టీపీసీ కూడంకుళం నుంచి రూ. 10 చెల్లించాలని చెప్పింది. అలాగే మూడు నెలల అడ్వాన్స్ ఇవ్వాలని షరతు పెట్టిందన్నారు. దేశంలో 3 నెలల అడ్వాన్స్ ఇచ్చిన సందర్భాలు ఎక్కడా లేవు అని మంత్రి తెలిపారు. ప్రయివేటు విద్యుత్ సంస్థలు రూ. 4.6 ధరకు ముందుకు వచ్చాయన్నారు. విద్యుత్ కొనుగోలులో కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ముందుకు వెళ్తున్నామని మంత్రి చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. కొన్ని పరిశ్రమలకు ప్రభుత్వ బకాయిలు ఉన్నాయనేది వాస్తవమన్నారు. విద్యుత్ బిల్లు చెల్లించకపోతే ప్రభుత్వ కార్యాలయాలను జప్తు చేసిన సందర్భాలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించాలనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమన్నారు. ప్రతి రాష్ట్రం ఉత్పత్తి చేసేదాంట్లో నిర్ణీత శాతం సౌరవిద్యుత్ ఉండాలనేది నిబంధన అని మంత్రి తెలిపారు. ఉదయ్ పథకానికి సంబంధించి రాష్ట్రానికి ఎలాంటి లాభం లేదన్నారు. డిస్కమ్‌ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి
ఐజేయూ, టీయూడబ్ల్యూజే నేతల డిమాండ్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ : పాత్రికేయులు, విశాంత్ర పాత్రికేయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య పథకాన్ని ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చడం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే)లు డిమాండ్ చేశాయి. ఈ విషయంపై శనివారం బషీర్ భాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీయూడబ్ల్యూజే సలహాదారు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఇటీవలి కాలంలో పాత్రికేయుల ఆరోగ్య పథకాన్ని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చుతూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయని, ఆ వార్తలపై వెంటనే స్పందించిన అధికార టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం, అలాంటిదేమీ లేదని సీఎం చెప్పడం, అందుకు అనుగుణంగానే సీఎం కార్యాలయం నుంచి ఒక ప్రకటన కూడా వెలువరించడం వెంటవెంటనే జరిగిపోయాయని గుర్తు చేశారు. కానీ అందుకు విరుద్ధంగా ఉద్యోగులు, పాత్రికేయుల ఆరోగ్య పథకాల పర్యవేక్షణాధికారిగా విధులు నిర్వహిస్తున్న సీఈఓ పద్మను విధుల నుంచి తొలగించడంతో పాటు జర్నలిస్టు ఆరోగ్య పథకాన్ని ఆరోగ్య శ్రీ పథకంలో చేరుస్తున్నట్లు కొన్ని పత్రికల్లో వార్తలు రావడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను చూస్తుంటే... జర్నలిస్టు ఆరోగ్య పథకాన్ని ప్రభుత్వం పరోక్షంగా రద్దు చేసినట్లే భావించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సజావుగా సాగుతున్న పదవ తరగతి పరీక్షలు
విద్యా శాఖ కమిషనర్ కిషన్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: పదో తరగతి పరీక్షలు సజావుగా సాగుతున్నాయని విద్యా శాఖ కమిషనర్ కిషన్ తెలిపారు. అయితే పదో తరగతి పరీక్షలు ప్రారంభం అయినప్పటి నుంచి పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీస్ లాంటివి అంశాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కిషన్ మీడియాతో మాట్లాడుతూ పరీక్ష విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పదో తరగతి ప్రశ్న పత్రాలు వాట్సప్‌లో బయట కు పంపుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలే ఎక్కువగా అక్రమాలకు పాల్పడుతున్నాయని కిషన్ తెలియజేశారు. మాల్ ప్రాక్టీస్‌కు సహకరించిన 29 మంది ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. 29 మంది ఇన్విజిలేటర్లు, ఆరుగురు చీఫ్ సూపరింటెండెంట్‌లను, ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికారులను విధుల నుంచి తొలగించామన్నారు. మాల్ ప్రాక్టీస్ ఘటనలపై విశ్లేషణ కోసం కమిటీ వేస్తామన్న కిషన్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామన్నారు.

పరీక్ష మధ్యలో ప్రశ్నాపత్రం బయటకు వస్తే అది పేపర్ లీకేజీ కాదు, మాల్ ప్రాక్టీస్ మాత్రమే అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఏపీలో టీడీపీ సెల్ఫ్ గోల్ : మంత్రి తలసాని



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ సెల్ఫ్‌గోల్ చేసుకుం టుందని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. రిజర్వేషన్ల కోసం టీఆర్ఎస్ ఎంపీ లు చేస్తున్న పోరాటంలో న్యాయం ఉంది. ఈ విషయంలో టీఆర్ఎస్‌ను నిందించడం తగదన్నారు. అన్నాడీఎంకే కూడా ఆందో ళన చేస్తుంది. ఆ పార్టీ ఎంపీలతో టీడీపీ అవిశ్వాసం మీద మాట్లాడిందా? అని ప్రశ్నించారు. లోకసభలో బీజేపీకి 273 మంది ఎంపీల బలం ఉంది. అవిశ్వాస తీర్మానంతో వచ్చే ప్రయోజనమేమిటి? అని అడిగారు. ప్రత్యేక హోదా సాధించుకోవడానికి అనేక వేదికలు ఉన్నాయన్నారు.ఏపీ పార్టీలు అక్కడి ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాయి. అక్కడి ప్రజలను అమాయకులను చేసి ఆడుకుంటున్నాయి. తమ దిగజారుడు రాజకీయాలతో ప్రజలను పిచ్చి వాళ్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని మంత్రి తలసాని అభిప్రాయపడ్డారు. ఏపీలో ఉన్న మొత్తం 25 ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తే ఏదైనా ఫలితం ఉంటుందేమో అని అన్నారు. ప్రజలను గందరగోళ పరచడానికి ఏపీలోని పార్టీలు ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటున్నారని తలసాని ఎద్దేవా చేశారు.తెలంగాణ ఉద్యమ నేపథ్యం చూసైనా.. ఏపీ పార్టీలు పోరాడటం నేర్చుకుంటే మంచిదని సూచించారు. ఎన్డీఏ నుంచి వైదొలిగాక చంద్రబాబు అవిశ్వాసంపై అన్ని పార్టీలతో మాట్లాడారని మీడియాలో వార్తలు వచ్చాయి.

చంద్రబాబు తానెవరితో మాట్లాడలేదని ఆ తర్వాత వివరణ ఇచ్చారు. దీంతోనే అక్కడి రాజకీయాలు ఎలా ఉన్నాయో అర్థమవుతుందని మంత్రి అన్నారు. నాలుగేళ్లుగా చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం కేంద్రం మీద ఒత్తిడి పెంచకుండా ఏం చేశారు? అని ప్రశ్నించారు. ఏపీ పార్టీలకు ప్రణాళిక లోపించిందన్న మంత్రి తలసాని.. ఎంపీల రాజీనామాలతోనే ఆ రాష్ట్రం దేశ దృష్టిని ఆకర్షించగలదని పేర్కొన్నారు.

సంపాదకీయం

editpage@suryaa.com

“ ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధత ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా కీలక అంశం. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రం (ఇవిఎం)లే ముందుగా విమర్శలకు గురి కావడం పరిపాటిగా మారింది. ప్రజల మద్దతు పొందలేక పరాజయం పొందిన పార్టీలు ఇవిఎంలపైకి నిందను నెట్టేస్తున్నాయి. ఇవిఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని, వాటిలో ఒక పార్టీ అభ్యర్థి కోసం బటన్ నొక్కితే వోటు మరొక పార్టీ అభ్యర్థికి నమోదు అవుతోందని ఆ పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇవిఎంలపై ఆరోపణలు కొత్త కాకపోయినా క్రితం సంవ త్సరం కొన్ని రాష్ట్రాలలో శాసనసభల ఎన్నికల అనంతరం అవి మరింతగా పెరిగిపోయాయి. ఉత్తర ప్రదేశ్‌లో పరాజయం పొందిన బహుజన్ సమాజ్ పార్టీ, పంజాబ్‌లో ఓడిన ఆమ్ ఆద్మీ పార్టీ ఆ విషయంలో చేసిన ఆరోపణలు శ్రుతి మించిపోయాయి. ఆ రెండు పార్టీలు ఆయా రాష్ట్రాలలో అధికారంలోకి వస్తామని ఆశించాయి. కాని ఆ ఆశలకు గండి పడడమే కాకుండా ఎన్నికలలో మొదటి రెండు స్థానాలలో కూడా నిలవలేకపోవడం అవి మరింత ఆగ్రహంతో రగిలిపోయాయి. జాగరూకతకు, స్వతంత్రతకు ఎన్నికల కమిషన్ విస్తృత స్థాయిలో గౌరవాభిమానాలను పొందుతున్న సంస్థ. ”

మళ్లీ బ్యాలట్ పత్రాలా?

ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధత ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా కీలక అంశం. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రం (ఇవిఎం)లే ముందుగా విమర్శలకు గురి కావడం పరిపాటిగా మారింది. ప్రజల మద్దతు పొందలేక పరాజయం పొందిన పార్టీలు ఇవిఎంలపైకి నిందను నెట్టేస్తున్నాయి. ఇవిఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని, వాటిలో ఒక పార్టీ అభ్యర్థి కోసం బటన్ నొక్కితే వోటు మరొక పార్టీ అభ్యర్థికి నమోదు అవుతోందని ఆ పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇవిఎంలపై ఆరోపణలు కొత్త కాకపోయినా క్రితం సంవత్సరం కొన్ని రాష్ట్రాలలో శాసనసభల ఎన్నికల అనంతరం అవి మరింతగా పెరిగిపోయాయి. ఉత్తర ప్రదేశ్‌లో పరాజయం పొందిన బహుజన్ సమాజ్ పార్టీ, పంజాబ్‌లో ఓడిన ఆమ్ ఆద్మీ పార్టీ ఆ విషయంలో చేసిన ఆరోపణలు శ్రుతి మించిపోయాయి. ఆ రెండు పార్టీలు ఆయా రాష్ట్రాలలో అధికారంలోకి వస్తామని ఆశించాయి. కాని ఆ ఆశలకు గండి పడడమే కాకుండా ఎన్నికలలో మొదటి రెండు స్థానాలలో కూడా నిలవలేకపోవడం అవి మరింత ఆగ్రహంతో రగిలిపోయాయి. జాగరూకతకు, స్వతంత్రతకు ఎన్నికల కమిషన్ విస్తృత స్థాయిలో గౌరవాభిమానాలను పొందుతున్న సంస్థ. అటువంటి ఇసి విశ్వసనీయతను పరాజిత పార్టీలు సవాల్ చేస్తున్నాయి. ఇవిఎంల ట్యాంపరింగ్‌కు ఏమాత్రం అవకాశం లేదని ఎన్నికల కమిషన్ ఎంతగా స్పష్టం చేసినా అవి తలకెక్కించుకోలేదు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఏకంగా ఎన్నికల కమిషన్‌నే సవాల్ చేసే స్థితికి వెళ్లారు. ఐఐటి పట్టభద్రుడినైన తనకు ఇవిఎంలను హ్యాక్ చేయడం తెలుసునని అంటూ అందుకు సిద్ధం కావాలని ఆయన ఇసిని సవాల్ చేశారు. తాము ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో గెలిచినప్పుడు ఇవిఎంలనే ఉపయోగించారన్నది కేజ్రీవాల్ మరచిపోయినట్లు ఉన్నది. ఇవిఎంలను ట్యాంపర్ చేయవలసిందిగా ఎన్నికల కమిషన్ కూడా తన వంతుగా సవాల్ విసిరింది. ఇవిఎంల వివాదం చివరకు సుప్రీం కోర్టు దృష్టికి కూడా వెళ్లింది. ఇవిఎంలలో పడిన వోట్ల నిర్ధారణకు ఉపయోగించే వివిపాట్ మెషీన్‌లను వాడుతుంటే ఈ వివాదానికి తావు ఉండేది కాదు కదా అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. వాస్తవానికి ఇవిఎంలకు అనుసంధానంగా వివిపాట్‌లను ఇసి ప్రయోగాత్మకంగా కొన్ని ఎన్నికలలో వినియోగించింది. ఆమధ్య ఈశాన్య ప్రాంతంలో మూడు రాష్ట్రాలలో ఎన్నికల సమయంలో ఇవిఎంలకు అనుసంధానంగా వివిపాట్‌లను ఇసి వినియోగించింది. అయితే, దేశంలో అన్ని ఎన్నికలలో పూర్తి స్థాయిలో ఉపయోగించడానికి కావలసినన్ని వివిపాట్ మెషీన్‌లు అందుబాటులో లేవు. వాటిని సమకూర్చుకోవడానికి ఇసి కృషి చేస్తోంది. కాగా, దేశంలో నిర్వహించే ఎన్నికలలో బ్యాలట్ పత్రాలనే తిరిగి ఉపయోగించాలని కాంగ్రెస్ పార్టీ ఇటీవల డిమాండ్ చేసింది. ఆ పార్టీ డిమాండ్ ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రం (ఇవిఎం)లపైకి ప్రజల దృష్టిని తిరిగి కేంద్రీకరింపజేసింది. ఏదైనా ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీ అయినా పరాజయం పొందినప్పుడల్లా ఇవిఎంలపై సందేహాలను లేవనెత్తడం ఆ పార్టీలకు పరిపాటిగా మారింది. 2009 ఎన్నికలలో పరాజయం ఎదురైన అనంతరం భారతీయ జనతా పార్టీ బ్యాలట్ పత్రాల విధానాన్ని తిరిగి అనుసరించాలని కోరింది. క్రితం సంవత్సరం పంజాబ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికల అనంతరం అనేక ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ సహా అనేక రాజకీయ పార్టీలు నానా యాగీ చేసి ఆ డిమాండ్‌ను మరింత బాగా వినిపించాయి. ఇవిఎంల వ్యతిరేకుల అభిప్రాయం ప్రకారం ఆ యంత్రాలను చాలా తేలికగా తారుమారు చేయవచ్చు.

జపాన్, అమెరికా, జర్మనీ సహా అనేక దేశాలలో ఇవిఎంలకు స్వస్తి పలికి బ్యాలట్ పత్రాలనే వినియోగిస్తున్నారని ఆ పార్టీలు వాదిస్తున్నాయి. పాశ్చాత్య దేశాలు బ్యాలట్ పత్రాలపైనే ఆధారపడుతు న్నాయన్నది నిజమే. కాని అక్కడి పరిస్థితు లకు, మన దేశంలోని పరిస్థితులకు హస్తిమశకాంతరం ఉన్నది. ముందుగా మన దేశం బాగా పెద్దది. 2014లో ఎన్నికల కమిషన్ వెల్లడి చేసిన గణాంకాల ప్రకారం, దేశంలో నమోదైన వోటర్ల సంఖ్య 80 కోట్లు. రాను రాను ఆ సంఖ్య ఇంకా పెరగడమే తప్ప తగ్గదు కదా! అంత భారీ జనాభా వేసిన వోట్లను లెక్కించడం కష్టం. వోట్లు లెక్కిస్తున్న సమయంలో పొరపాట్లు జరిగే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం ఒడిశాలో పంచాయతీల ఎన్నికలలో బ్యాలట్ పత్రాలు ఉపయోగించారు. వోట్ల లెక్కింపులు పలు పొరపాట్లు జరిగినట్లు వార్తలు వచ్చాయి కూడా. వోట్లను తిరిగి లెక్కించిన తరువాత పలువురు అభ్యర్థులు గెలుపొందారు.

రెండవ కారణం – పోలింగ్ సమయంలో రిగ్గింగ్ ముప్పు కూడా ఎప్పుడూ ఉంటుంది. ఇరవై సంవత్సరాల క్రితం వరకు అనేక రాష్ట్రాలలో పోలింగ్ కేంద్రాల స్వాధీనం సంఘటనలు సర్వసాధారణంగా చోటు చేసుకుంటుండేవి. అయితే, ఇవిఎంలను ప్రవేశపెట్టడంతో అటువంటి సంఘటనలన్నీ వెనుకపట్టు పట్టాయి. ఇక మూడవ కారణం – ఇవిఎంల వాడకం వల్ల ఎన్నికల నిర్వహణ వ్యయం బాగా తగ్గిపోతుంది. 2014లో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం రూ. 3426 కోట్లు వ్యయం చేసినట్లు తెలియజేశారు. 2009 ఎన్నికల సమయంలో అయిన ఖర్చు కన్నా అది 131 శాతం పైగా అధికం. బ్యాలట్ పత్రాల విధానాన్నే కనుక తిరిగి ప్రవేశపెట్టిన పక్షంలో ఎన్నికల నిర్వహణ వ్యయం మరింత పెరగడమే జరుగుతుంది. అంతే కాదు. భారీ స్థాయిలో కాగితం వృథా అవుతుంది. ఇంకా నిర్వహణ ఏర్పాట్లు మరింత జటిలంగా ఉంటాయి. ఇవిఎంలను మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వాటిని సునాయాసంగా రవాణా చేయవచ్చు. అయితే, ఇవిఎంలను తారుమారు చేయడం ఏమాత్రం సాధ్యం కాదు అన్నది పూర్తిగా నిజం కాకపోవచ్చు. కాని ఎన్నికల నిర్వహణకు కావలసిన సిబ్బంది సంఖ్యను తగ్గించడం ద్వారా దేశానికి కోట్లాది రూపాయలను అవి ఆదా చేశాయన్నది నిర్వివాదాంశం. బ్యాలట్ పత్రాలను ఉపయోగించినప్పుడు వోట్ల లెక్కింపు పూర్తి కావడానికి చాలా సమయం పడుతుండేది. లెక్కింపు ప్రారంభించిన మరునాడు ఫలితాలు ప్రకటించిన సందర్భాలూ ఉన్నాయి. ఇవిఎంల వాడకం ప్రారంభమైన తరువాత ఫలితాలను చాలా త్వరితంగా ప్రకటించగలుగుతున్నారు. శాసనసభ ఎన్నికలలో అయితే మధ్యాహ్నానికే కొన్ని ఫలితాల ప్రకటన జరుగుతోంది కూడా. బ్యాలట్ పత్రాలనే తిరిగి ఉపయోగించినట్లయితే, పాత పరిస్థితులే తిరిగి నెలకొంటాయి. ఆ విధంగా కూడా ఇవిఎంలు ఎంతో మేలు చేస్తున్నాయనవచ్చు.

‘హోదా’ సెగలో బీజేపీ పతనం?

కునిరెడ్డి శ్రీనివాస్ - హైదరాబాద్

- ఆంధ్ర రాజకీయాల్లోత తీవ్రస్థాయికి హెూదా ఆందోళనలు
- బాబు, జగన్, పవన్ అందరిదీ హెూదా ఉద్యమమే
- అన్ని ప్రాంతాల్లో మేధావుల చర్చలు
- రాష్ట్ర పరిస్థితిపై కమలనాథుల నాథులలో కలవరం
- 2019లో హెూదా కల్పించే వారిదే పీఠం?



రాజకీయం ఇలా మాత్రమే చేయాలని ఎక్కడా రాయలేదు కాబట్టి ఎలా చేసినా అది రాజకీయం కిందే వస్తుందని జనసేనాని అభిప్రాయం కావచ్చు. అందులో మనం తప్పుపట్టడానికి ఏమీ లేదు. కానీ వ్యక్తుల ప్రయివేటు బ్రతుకులు వారి వారి సొంతం.. పబ్లిక్ లో నిలబడితే ఏమైనా అంటాం .. శ్రీశ్రీ గారు చెప్పారు. పవన్ లెక్కలో ఎంత వాస్తవముందో శ్రీశ్రీ ముక్కలో కూడా అంతే వాస్తవముంది. కొత్తగా రాజకీయం చేయడం అంటే ప్రత్యర్థులను పొగడటం కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. రాజకీయంగా తలపండిన చాలా మంది ఇదే మాటను నొక్కి వక్కాణించినా నాదారి రహదారి అంటూ ముందుకు దూసుకు వెళ్తానంటున్నాడు జనసేనాని. పైపెచ్చు నా రాజకీయం ఇప్పుడే మీకు అర్థంకాదనీ, నా మార్గానికి అడ్డుపడినా, నన్ను విమర్శించినా నేను తలదించుకుని ప్రజల సంక్షేమం కోసం పాటుపడతాననీ కూడా అన్నారు. ఇదంతా చూస్తూ సోషల్ మీడియా నుండి రకరకాల కామెంట్లు హల్‌చల్ చేస్తు న్నాయి. వాటిని పెద్దగా పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరం లేన్నట్టుగా పవన్ ప్రసంగాల నుంచి తెలుస్తున్నది. కొత్త తరహా రాజకీయాలకు తెరలేపిన పవన్ కల్యాణ్ జనసేన పార్టీతో తెలుగురాష్ట్రాల్లో పూర్తి స్థాయి రాజకీయ యాత్ర లకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రంలో కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని మూడు రోజులపాటు తెలంగాణ జిల్లాల్లో పర్యటించి చివరి రోజున కార్యకర్తల సమావేశముతో మొదటియాత్ర ముగిసిందనిపించారు.

2014 ఎన్నికలలో రాజకీయంగా పురుడు పోసుకున్న జనసేన కేవలం తెలుగుదేశం, బిజెపిలకు మద్దతుదారుగా మాత్రమే ప్రచారంలో పాల్గొన్నది. ప్రశ్నించడం కోసమే వచ్చాను అంటూ నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. అంతకుమించి ప్రత్యక్ష రాజకీయాల్లో ఎక్కడా పోటీ చేయలేదు. ఎన్నికల అనంతరం దాదాపు మూడేళ్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిశితంగా గమనించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికల వాగ్దానాలు అమలు పట్ల ప్రత్యక్ష యుద్ధానికి తలపడ్డట్టు అనిపించింది. ఆనేపథ్యంలోనే అనంతపురం నుండి కాకినాడ వరకూ కొన్ని ప్రశ్నలు వేయడం కోసం సమావేశాలు ఏర్పాటు చేసినట్టు గమనించాం. జనసేన పార్టీ ఈ సమావేశాల ద్వారా ఎంతవరకూ ఫలితాలను సాధించింది అంటే చెప్పడం కష్టం. సినిమా అభిమానులు, కొంతవరకూ తన సామాజిక కోణం వెరసి జనసేనానికి కలిసొచ్చే అంశాలు. దీంతోనే రాజకీయం చేయడం కష్టసాధ్యం. అది పవన్‌కు కూడా తెలిసినట్టుంది. అందుకే కావచ్చు అధికారం లక్ష్యం కాదు అనే నినాదంతోనే రాజకీయబరిలోనికి రావడం వెనుక ఆంతర్యం. రాజకీయఎంట్రీతోనే ముఖ్యమంత్రి పీఠం మీద కన్ను వేయడం ఆ తరువాత భంగపాటు ఇవన్నీ అనుభవంలో చూసిన పవన్ కొత్త నినాదం తెరపైకి తీసుకొచ్చినట్టుంది. ప్రజారాజ్యంలో చురుకుపాత్ర వహించిన పవన్‌కు ఆనాటి అనుభవాలు ఇప్పుడు ఉపయోగపడకపోవు.

ప్రశ్నించే జనసేనాని చుట్టూ అనేక ప్రశ్నలు సమాధానాలు కోసం కలియతిరుగుతున్నట్టు చూస్తున్నాము. విభజన తనను బాధపెట్టిందన్న పవన్, ఎన్నో నిదురలేని రాత్రులు, ఆహారంలేని పూటలు గడిపానని చెప్పుకున్నారు. సెంటిమెంటుతో ఏర్పడ్డ రాష్ట్రంలో యాత్రల వల్ల జనసేనను నమ్మే పరిస్థితులు తక్కువ. సినిమా గ్లామర్‌వల్ల కొంతవరకూ పవన్‌కు తెలంగాణలో జనసమీకరణ ఉండవచ్చు గాక అవి ఓట్లుగా మారే అవకాశాలు లేవని ప్రముఖ దళిత నాయకుడు విమర్శించాడు.

ఇంతటితో జనసేనపై దండయాత్ర ఆగదు. జనసేనానికి ఒక నిర్దిష్టమైన దృక్పథం ఉందా అనేది కొందరి ప్రశ్న. లేకుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఒకరకంగానూ, తెలంగాణాలో మరోరకంగానూ ప్రసంగాలను చూస్తే అలాగే అనిపిస్తుంది. ఇందులో జనసేనానికి కొంత రాజకీయపరిజ్ఞానం అవసర మనిపిస్తున్నది. సినిమాలకు శాశ్వతంగా సెలవు చెప్పి ఒక సుధీర్ఘరాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టబోతున్నట్టు ప్రకటించుకున్నారు జనసేనాని. చెప్పిందే తడవుగా చురుకుగా కార్యాచరణ ప్రారంభించినట్టు కనిపిస్తున్నది. మొదట్లో కాస్తంత అస్పష్టత కనిపించినా రానురాను పరిణితి చెందిన రాజకీయనాయకుడిగా ఎత్తులు వేస్తున్నట్టు అనిపిస్తున్నది. జనసేనాని మొదటినుంచీ కేంద్రీకరించిన అంశం ప్రత్యేకహోదా. విభజనాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదావల్ల మాత్రమే న్యాయం కలుగుతుంద నే విషయాన్ని ప్రగాఢంగా నమ్మాడు. ఆ నేపథ్యంలోనే ఇటీవల జెఎఫ్‌సి ని స్థాపించడం జరిగింది. జెఎఫ్‌సి నిర్మాణ సమయంలో కూడా ప్రధాన పార్టీలు బిజెపి, టిడిపి, వైసిపి పార్టీలను ఆహ్వానించనట్టుగా కనిపిస్తున్నది. వాటిని మినహాయించి మిగిలిన అన్ని పార్టీలవారిని ఆంధ్ర, తెలంగాణ మేధావులతో సమావేశం ఏర్పాటుచేయడం విశేషం. అధికార ప్రతిపక్ష నాయకుల సభ రసాభాస అయ్యే ప్రమాదముందనీ, కార్యాచరణలో ఆటంకం ఏర్పాడుతుందని మరికొంద రి వాదన. ఏదిఏమైనప్పటికీ లోక్‌సత్తా జయప్రకాష్‌నారాయణ, ఉండవల్లి అరుణ్‌కుమార్, ప్రొఫెసర్ నాగేశ్వర్, లాంటి మరి కొంత మేధావుల అభిప్రాయాలతో జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటుచేయడంతో పవన్‌కల్యాణ్‌కు భవిష్యత్తు ప్రణాళికపై కొంత అవగాహనతో వెళ్తున్నట్టుగా అనిపిస్తున్నదని కొందరి అభిప్రాయం. జనసేనాని పూర్తిస్థాయి రాజకీయాలతో ప్రత్యేక హోదా అంశం మరింత వివాదంగా తయారయ్యింది. ఇటు టిడిపి, అటు బిజెపి కూడా ఇబ్బందులకు గురౌతున్నట్టు కనిపిస్తున్నది. వేడెక్కిన రాజకీయాల్లో భాగంగా వైసిపి అధినేత జగన్ కూడా తమపార్టీ ఎంపిల రాజీనామా పర్వాన్ని తెరపైకి తీసుకురావడం, దాన్ని మరల కేంద్రంపై అవిశ్వాసం వైపు మరల్చడం మరో అసక్తికరమైన మలుపు. దీనిపై జనసేనాని, జగన్ ఒకరినొకరు సవాళ్లు సీకరించడం దాకా వెళ్లింది.

ఇప్పుడు ఆంధ్రాలో తాజా పరిస్థితులను గమనిస్తుంటే జనసేనాని ప్రయత్నానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బలం చేకూరుతున్నట్టు అనిపిస్తున్నది. ప్రత్యేకహోదా అనేది ఆంధ్రులకు సెంటిమెంటులా తయారయ్యింది. అందు లోనూ మీడియా దీనిపై దృష్టిసారించడంకూడా ఈనినాదానికి ఊపు వచ్చింది. ఈమధ్యకాలంలో ప్రాంతాలవారీగా ప్రత్యేకహోదాపై చర్చలు కొనసాగడం, నిరాహారదీక్షలు, ఆందోళనలు పెచ్చరిల్లడం చూస్తుంటే బిజెపి ఉనికికి ప్రమాదం వాటిల్లగలదని పరిశీలకుల అంచనా. ఒకర్ని చూసి ఇంకొకరు వారిని చూసి మరొకరు ఇలా ప్రత్యేక నినాదాన్ని భుజాన వేసుకోవడంతో టిడిపి ఇప్పటికే యూటర్న్ తీసుకున్నది. విభజన హామీలను నెరవేరేవరకూ మా పోరాటం కేంద్రంపై ఆగదని ప్రకటించింది. ఇందులో ఏమాత్రం రాజీలేదని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పడంతో రానున్న ఎన్నికలలో ప్రత్యేకహోదా సెంటిమెంటును గుర్తించినట్టున్నది. ఇప్పుడు బంతి బిజెపి ఫీల్డ్‌లో పడింది. ఆంధ్రలో బిజెపి శ్రేణులు ఈ విషయంలో గట్టిగా ఎదుర్కొన్నప్పటికీ పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 2014 కాంగ్రెస్ పరిస్థితిని 2019లో బిజెపి ఎదుర్కొనబోతున్నట్టు విశ్లేషకుల అభిప్రాయం. అదే సమయంలో కాంగ్రెస్ పుంజుకునే అవకాశాలు లేకపోలేదు.

ఎన్నికలముందు మోదీ,అమిత్‌షాలు ఆంధ్రలో తమ ఉనికిని కాపాడుకునేందుకు ఏవిధమైన పాచికలు వేయబోతున్నారనేది సర్వదా చర్చనీయాంశం. జనసేనాని రగిలించిన ఈవేడి జగన్‌కు ఉపయోగపడుతుందా..!లేక టిడిపికి మేలు జరుగుతుందా..!లేక జనసేనాని పొత్తుపెట్టుకునే పార్టీ విజయానికి కారణమౌతుందా అంటే ఇప్పట్లో చెప్పడం కష్టం. ఏమైనా రానున్న ఎన్నికలలో ఆంధ్ర రాజకీయాలలో ప్రత్యేకహోదా అంశం అనేక సంచనాలకు తెరతీయనున్నదని మాత్రం చెప్పవచ్చు.

రాహుల్‌లో నూతనోత్సాహం

ఎం.రామ్‌గోపాల్ – హైదరాబాద్, 9032340123

- బిజెపికి ఎదురుదెబ్బలతో కాంగ్రెస్‌లో విశ్వాసం
- వచ్చే ఎన్నికలకు పార్టీ సర్వసిద్ధానికి సన్నద్ధత
- కర్నాటకలో విజయానికి రంగంలోకి ప్రియాంక?
- సీనియర్లు స్వచ్ఛందంగా తప్పుకోవాలని విన్నపం
- యువ రక్తానికి ప్రాధాన్యత పెంచాలనే యోచన



ఇటీవల కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తనదైన శైలిలో యుద్ధం చేస్తునే ఉన్నారు. ముఖ్యంగా మరో ఏడాదిలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీని, బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అస్త్రశస్త్రాలన్నిటినీ సిద్ధం చేసుకుంటున్న ఆయన ఎన్నికలలో ప్రధాన ప్రత్యర్థిగా భారతీయ జనతాపార్టీకి గట్టి పోటీ ఇవ్వాలన్న పట్టుదల ఆయనలో కనిపిస్తోంది. అయితే ఆతని సన్నిహితులు సైతం ఇప్పటికప్పుడు ఏదో అద్భుతం జరిగితే తప్ప కేంద్రంలో రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారం అందుకోలేదన్న భావనలో ఉన్నారన్నది వాస్తవం. ప్రస్తుత ఎన్నికలకు కాకుండా 2024లో జరగబోయే ఎన్నికలే లక్ష్యంగా ఇప్పటి నుంచే తనటీంకు తగిన సూచనలు చేస్తున్నారాయన అని ఆయన సన్నిహితుల కథనం.

ఆయన 2024 నాటికి పార్టీ ఖచ్చితంగా బలోపేతమై అధికారంలోకి వచ్చి తీరుతుందన్న నమ్మకాన్ని సహచరుల వద్ద వ్యక్తం చేస్తున్న ఆయన అందుకు తగిన విధంగానే బృహత్ ప్రణాళికను రూపొందించుకుని దానిని అముల పరిచే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ పగ్గాలు అందుకోక ముందునేంచే పూర్తి ప్రక్షాళనకు తెరదీసారు. ఇప్పటికే ఆయన తన వ్యక్తిగత కార్యాచరణ బృందంలోయువకులను నింపే ప్రయత్నంలో ఉన్నారు. అలాగే రాజకీయ కొటారీలలో ఉన్న సీనియర్లకు, వృద్ధుల స్థానంలోనికి కూడా యువతరాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం ఈ క్రమంలోనే తనకు విధేయులైన యువ నాయకులను సమీకరించుకోవాలనేది ఆయన ప్రయత్నం. నిజానికి ఇప్పటికే పార్టీలో కొన్ని కొత్త ముఖాలు ప్రవేశిస్తున్నాయి. వారంతా రాహుల్‌కు నమ్మకస్తులే. అయితే, వారు పూర్తిస్థాయి నాయకులుగా తయారై, సరైన సమయంలో సరైన సహాయ సహకారాలు అందించడానికి ఎంత లేదన్నా కనీసం ఐదేళ్లు పడుతుందని అంచనా. ప్రస్తుతం వారికి అవసరమైనంత రాజకీయానుభవం లేని వారు. వీరిని సానబట్టాలంటే వచ్చే ఏడాది జరగబోయే ఎన్నికలలో వినూత్న ప్రచారం చేపట్టాలని భావిస్తున్నారు. ఈ ప్రచారం సీనియర్ నాయకుల శైలికి భిన్నంగా ఉండాలనేది ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటికే తన బృందంలో టెక్నాలజీ విభాగాన్ని రూపొందించి పలువురు యువకులకు స్థానం కల్పించిన ఆయన రానున్న ఎన్నికల నాటికి సలహా బృందంలోనూ యువతరం ఉండాలని ఆశిస్తున్నారు. ఇందుకు తన విధేయుల్లో ఐఏఎస్ నుంచి రాజీనామా చేసినవాళ్లు, టెక్కీలు, ఎంబీలను గుర్తించినట్లు సమాచారం. వీరంతా అనుభవ సంపాదించి, పార్టీలో అంతర్గతంగా సిద్ధం చేయడానికి, తాను సరైన వ్యూహాలను అనుసరించడానికి ఇంకా కొంత సమయం అవసరం అవుతుందని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తోంది. మరో అయిదారేళ్లు ఆగితే, తన తల్లి సోనియా గాంధీ కోటరీకి సంబంధించిన ఎనియర్ నాయకులు అహ్మద్ పటేల్, మోతీలాల్ వోరా, ఏకే ఆంటోనీ, చిదంబరం, దిగ్విజయ్ సింగ్ తదితర క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటారని, వారి స్థానాలలోకి యువ తరాన్ని తీసుకువచ్చి, తన అభీష్టం ప్రకారం పార్టీని పటిష్టం చేసుకుని, బీజేపీని ఢీకొట్ట వచ్చన్నది రాహుల్ ఆలోచనలుగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆయన పార్టీ సీనియర్లు తమకు తాముగా, హుందాగా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పు కోవాలని సూచించినట్లు సమాచారం. వారు తప్పుకునేలోగా సుమారు 20 మంది యువకులతో తన బృందాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాలు న్నాయి.

ఈ క్రమంలో రానున్న ఎన్నికలలోనూ బిజెపికి ధీటైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు తన నాయనమ్మ ఇందిరా గాంధీ తరహాలో, ప్రధాని నరేంద్ర మోదీలా యువతను ఆకర్షించేలా నినాదాలను సృష్టించేందుకు సాంకేతిక సలహాదారులకు సూచనలు ఇచ్చినట్లు సమాచారం. ఇందిర నినాదం రోటీ కపడా ఔర్ మకాన్, గరీబీ హటావోవంటి నినాదాల రూపకల్పన అవసరాన్ని రాహుల్‌కు పలువురు సలహాలిచ్చినట్లు కనిపిస్తోంది. అభివృద్ధి, అవినీతి, వారసత్వ రాజకీయాలు అంటూ ప్రధాని మోదీ ఎన్నికల రణరంగంలోకి దిగే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, అభివృద్ధిని ఊతంగా చేసుకుని నినాదాలను రూపొందించాల్సిన అవసరం ఉందని, ఇందిరా గాంధీ రూపొందించిన ఇరవై సూత్రాల కార్యక్రమం తరహాలో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి ఎన్నికల ప్రచారం ప్రారంభించే పనిలో కాంగ్రెస్ నేతలు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

ఇటీవల జరిగిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభల ఎన్నికల సమయంలో రాహుల్ వ్యవహారశైలి బాగా మెరుగుపడిందని, అందునా ప్రధాని మోదీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షాల జోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో కాషాయ జండా రెపరెపల్ని నిలువరించడంలో రాహుల్ తనదైన ప్రతిభ చూపడంతో పాటు చేసిన నినాదాలు ప్రజల మనసులకు హత్తుకు పోవటం వల్లే బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు అందుకోలేక పోయిందన్నది కాంగ్రెస్ శ్రేణుల వాదన. ఇది వాస్తవం కూడా ముఖ్యంగా గత కొంత కాలంగా దేశంలోని పలు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటమి రుచులు చూస్తున్నా గుజరాత్ ఎన్నికల నాటికి అది తగ్గిందనిపిస్తోంది. గుజరాత్‌లో కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడడం, ఆపై బిజెపికి బలమైన రాష్ట్రంగా ఉన్న రాజస్థాన్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి సొంత సీట్లలో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించడం కాంగ్రెస్ శ్రేణులలో కొండంత ధైర్యాన్ని నింపిందనే చెప్పారు. ఇందుకు అనుగుణంగానే తను ఏర్పాటు చేసుకున్న టీంలోకి సచిన్ పైలట్, జ్యోతిరాదిత్య సింధియా, అశోక్ గెహ్లాట్, కమల్నాథ్ వంటి యువ నాయకుల సహాయ సహకారం రాహుల్ గాంధీకి బాగా అంది వచ్చింది., నిన్నమొన్నటి వరకు పార్టీలోని కొందరు సీనియర్ నేతలపైనే ఆధారపడి, వారి సలహాలను పాటిస్తూ వస్తుండటం వల్లే పార్టీ పతనావస్థకి కారణమని భావిస్తున్న ఆయన తన యువ విధేయులతో మనసు విప్పి మాట్లాడుతున్నారు. తన రాజకీయ వ్యూహాలు, అంశాలపై పదే పదే చర్చిస్తు, కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత గురించే వ్యూహాలు రచిస్తునే ఉన్నారు. ప్రస్తుతం పాలక పార్టీగా ఉన్న బిజెపి జన వ్యతిరేకత ఎదుర్కొంటున్నా మరో నాలుగేళ్లలో మరింత బలహీనపడడం ఖాయమనీ, అది ఇప్పటికి ఇప్పటి స్థాయిని మించి కాంగ్రెస్ జనం మద్దతు అందుకుంటుందన్న భావనలో ఉన్నారాయన. రాహుల్ వామపక్ష సిద్ధాం తాల పట్ల అభిమానం ఉందని, ఈ క్రమంలోనే ఆయన సీతారాం ఏచూరి వంటి నాయకులను పలు విషయాలలో సంప్రదించి సలహాలు పొందుతుంటారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌తో కలసి పోరాదని సిపిఎం నిర్ణయించినా, ఎన్నికల అనంతరం తమతో కలసి వచ్చేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉంటారన్నది ఆయన తపిస్తున్నారు. 2024 నాటికి బిజెపి అధికారం నుంచి తొలగించడానికి ఆయన వామపక్షాలతో చేతులు కలిపే అవకాశం ఉందన్నది నిజమేనని పార్టీ వర్గాలు కూడా భావిస్తున్నాయి.

సోనియా కోటరీలో తనకు వ్యతిరేకులుగా ఉన్న వారిని ఇప్పటినుంచే తప్పించే పనిలో ఉన్న ఆయన కర్నాటక ఎన్నికలలో అధికారం కనుక అక్కడి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యవహారంలో కల్పించుకునేందుకు దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. కర్ణాటకలో అధికారం తిరిగి పొందితే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు కర్ణాట నుంచి కూడా వీలైనంత మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నదిరాహుల్ వ్యూహం. అయితే బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల కాంగ్రెస్‌లోతీవ్రస్థాయిలో విభేదాలు నెలకొని ఉండటంతో వాటిని పరిష్కరించడం మీద దృష్టి సారించారు. వాస్తవానికి గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి గణనీయంగా మెరుగుపడినప్పటికీ, 2019 ఎన్నికల్లో కేవలం ప్రత్యర్థుల బలహీనతలు, లోటుపాట్ల మీద ఆధారపడితే ప్రయోజనం లేదన్నదీ వాస్తవాన్ని గ్రహించాలి. ఇప్పటికే అవినీతి మచ్చపడిన కాంగ్రెస్ నాయకులను దూరం పెట్టడంతో పాటు కొత్త రక్తం ఎక్కించి జవసత్వాలు గలిగింగించేలా కనీసం ఏడాది పాటు పూర్తిగా పార్టీ ప్రక్షాళన కార్యక్రమం చేపడితే తప్ప పార్టీకి పూర్తి వైభవం అందించడం సాధ్యమయ్యే విషయం కాదు. ఇందుకు ఖచ్చితంగా రానున్న కర్ణాటక ఎన్నికలలో విజయం సాధించాల్సిన అవసరం గుర్తించి, అవసరైమైతే సోదరి ప్రియాంక గాంధీని కూడా రంగంలోకి దింపే ఆస్కారం ఉంది. కాగా ఈ ఏడాది చివరి నాటికి సోనియా గాంధీ రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెపుతుండటం గమనార్హం.

చరిత్రలో ఈరోజు

మార్చి 25

సంఘటనలు

1655 : శని గ్రహం యొక్క అతిపెద్ద ఉపగ్రహం అయిన టైటాన్ క్రిస్టియాన్ హైగెన్స్ కనుగొన్నాడు.

1992 : మిర్ అంతరిక్ష కేంద్రములో 10 నెలలు గడిపిన ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త సెర్గీ క్రికలేవ్ భూమి పైకి చేరారు.

జననాలు

1914: నార్మన్ బోర్లాగ్, అమెరికా వ్యవసాయ శాస్త్రవేత్త.

మరణాలు

1983: మానికొండ చలపతిరావు, సుప్రసిద్ధ పత్రికా రచయిత, సంపాదకుడు, గ్రంథకర్త, సాహితీవేత్త మరియు మానవతా వాది

మానికొండ చలపతిరావు

మానికొండ చలపతిరావు సుప్రసిద్ధ పత్రికా రచయిత, సంపాదకుడు, గ్రంథకర్త, సాహితీవేత్త మరియు మానవతావాది. వీరు 1908లో విశాఖపట్నంలో జన్మించి, 25 మార్చి 1983 తేదీన పరమ పదించారు. ఎం.ఏ., బి.ఎల్. పట్టాలను పొంది కొంతకాలం న్యాయ వాదిగా పనిచేశారు. వీరు విశాఖపట్నంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్ష తన ఎథేనియం అనే పేరుతో సాహిత్య సాంస్కృతిక సంస్థను నెలకొల్పి తాను కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత పీపుల్స్ వాయిస్, వీక్ ఎండ్ మరియు హిందూస్థాన్ టైమ్స్ పత్రికలలో వేర్వేరు కాలాలలో సహాయ సంపాదకులుగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ 1938లో లక్నో నుండి ప్రారంభించిన నేషనల్ హెరాల్డ్ దినపత్రికకు వీరిని సహాయ సంపాదకునిగా నియమించారు.

క్రిస్టియాన్ హైగెన్స్



క్రిస్టియాన్ హైగెన్స్ ఒక ప్రముఖ గణిత శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రవేత్త మరియు మొట్టమొదటి సైన్స్ ఫిక్షన్ రచయిత. ఇతడు 1678లో కాంతి ఒక తరంగం అని ప్రతిపాదించాడు. 1655లో శని గ్రహం చుట్టూ ఘన వలయం ఉందని ప్రకటించారు. అదే ఏడాది మార్చి 25న శని గ్రహం యొక్క అతిపెద్ద ఉపగ్రహం అయిన టైటాన్‌ను కనుగొన్నాడు. కాంతి తరంగ సిద్ధాంతాన్ని ఆవిష్కరించిన వ్యక్తిగా ప్రాచుర్యం పొందినా ఈయన ఎన్నో రంగాల్లో మేటి పరిశోధనలు చేశాడు. లోలకపు గడియారం, శని ఉపగ్రహమైన టైటాన్, అపకేంద్ర బలం లాంటివెన్నో కనిపెట్టాడు. హైగెన్స్ గౌరవార్థం ఎన్నో సంస్థలకు ఆయన పేరు పెట్టారు. ఎంతోమంది చిత్రకారులు హైగెన్స్ చిత్రం గీశారు. డచ్ ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం ఓ కరెన్సీనోట్ కూడా ముద్రించింది. అందులో ఆయనతోబాటు శనిగ్రహం చిత్రం కూడా ఉంటుంది.

నార్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్



నార్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్ హరిత విప్లవ పితామహుడు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత. ప్రపంచ వ్యాప్తంగా వందలాది కోట్లమందిని ఆకలి బాధలనుండి, పస్తులనుండి రక్షించిన వాడు. బోర్లాగ్ 1914, మార్చి 25న అమెరికాలోని అయోవాలో ఒక వ్యవసాయ కుటుంబములో పుట్టాడు. బోర్లాగ్ 2009, సెప్టెంబరు 12న తన 95వ ఏట మరణించాడు. మిన్నిసోటా విశ్వవిద్యాలయంలో చేరి అటవీశాస్త్రంలో పట్టాపొంది ఉద్యోగంలో చేరినాడు. తిరిగి అదే విశ్వవిద్యాలయం నుంచి ప్లాంట్ పాథాలజీ, జన్యు శాస్త్రల్లో పీహెచ్‌డీ చేశాడు. పరిశోధనల్లో ఆయన దృష్టి గోధుమ పంట మీద పడడం ప్రపంచానికి గొప్ప మేలు చేసింది. చీడపీడలను తట్టుకుంటూ అధిక దిగుబడినిచ్చే పొట్టిరకం గోధుమ వంగడాలను కనిపెట్టడం ద్వారా సంచలనం సృష్టించాడు. 1960 ప్రాంతంలో కరువుకాటకాలతో అల్లాడుతున్న ఇండియా, పాకిస్థాన్ దేశాల్లో ఆ వంగడాలను పరిచయం చేశాడు. బోర్లాగ్‌పై 2006లో 'ది మ్యాన్ హూ ఫెడ్ ద వరల్డ్' అనే పుస్తకం వచ్చింది. ఆహార పంటల కొరతను తీర్చినందుకు 1970లో బోర్లాగ్‌కు నోబెల్ శాంతి బహుమతి లభించింది.



విమానయాన సంస్థలకు వ్యతిరేకంగా కన్జూమర్ ఫోరం తీర్పు

న్యూఢిల్లీ: ప్రయాణికులకు అందించే సేవల్లో లోపాలకు అక్షింతలు వేస్తూ రెండు ప్రముఖ విమానయాన సంస్థలకు హైదరాబాద్ జిల్లా వినియోగదారుల సమస్యల పరిష్కార ఫోరం-3 సంచలన తీర్పు ఇచ్చింది. మొదటగా స్పైస్ జెట్ కేసు విషయానికొస్తే, నగరంలోని అమీర్‌పేటకి చెందిన 24 ఏళ్ల ప్రణయ్ పసరి నవంబరు 1, 2016న న్యూఢిల్లీ వెళ్లడానికి స్పైస్ జెట్ విమానం ఎక్కాడు. విమానం దిగిన తర్వాత తన లగేజీ కనిపించలేదు. లగేజీ కోసం శతవిధాలా అతను ప్రయత్నించాడు. ఇక లాభం లేదనుకుని మరుసటి ఏడాది జనవరి, 21న స్పైస్ జెట్ ఎయిర్‌లైన్ సంస్థకు ఓ లీగల్ నోటీసు పంపాడు. ఈ కేసు తీర్పు సందర్భంగా ఫోరం న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎయిర్ కోస్టా కేసును పరిశీలిస్తే... సీఎస్ రామచంద్రమూర్తి, సీ.విజయ లక్ష్మి అనే వృద్ధ జంట దాఖలు చేసిన ఫిర్యాదును ఫోరం విచారించింది. మే 15, 2016న ఆ జంట కోవై నుంచి హైదరాబాద్ బయలుదేరింది. అయితే ఎయిర్‌పోర్టులోనే తాము దాదావు పది గంటల పాటు పడిగావులు పడ్డామని ఆ జంట తమ ఫిర్యాదులో ఆరోపించింది. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సంబంధిత విమానయాన సంస్థ తమకు కనీసం దుప్పట్లను కూడా ఏర్పాటు చేయలేదని వారు పేర్కొన్నారు. వెన్నునొప్పితోనే తాను చాలాసేపు కూర్చోవాల్సి వచ్చిందని లక్ష్మి తెలిపింది. వారి వాదనతో ఏకీభవించిన ఫోరం నష్టపరిహారం కింద వారికి రూ.30 వేలు, ఖర్చుల కింద మరో రూ.10 వేలు చెల్లించాలని ఎయిర్ కోస్టా సంస్థను దిమ్మతిరిగే రీతిలో ఆదేశించింది.

ఫేస్‌బుక్‌ను వీడుతున్న టాప్ కంపెనీలు

● ఖాతాలను తొలగించుకున్న టెస్లా, స్పేస్ ఎక్స్ ● కోట్లాది మంది ఖాతాదారుల సమాచారం దుర్వినియోగం ● అసంతృప్తితో ఉన్న ఎంతో మంది ● చిక్కుల్లో పడ్డ ఫేస్‌బుక్ ● జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినా ఆగని ఉద్యమం ● శరవేగంగా తగ్గుతున్న ఫేస్‌బుక్ ఖాతాల సంఖ్య ● ఇకపై ఎటువంటి ఖాతాలూ పెట్టబోమన్న మొజిల్లా ● బ్రేక్ తీసుకుంటున్నామన్న స్పేస్ ఎక్స్

న్యూఢిల్లీ: కోట్లాది మంది ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమైందంటూ గత కొన్ని రోజులుగా ప్రముఖ సోషల్‌మీడియా సంస్థ ఫేస్‌బుక్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీంతో ఫేస్‌బుక్ చిక్కుల్లో పడింది. ఈ వ్యవహారంపై అసంతృప్తిగా ఉన్న యూజర్లు ఫేస్బుక్ ఖాతాలను తొలగించాలని సోషల్‌మీడియాలో పిలుపునిస్తున్నారు. హ్యాష్‌ట్యాగ్‌తో ఉద్యమం ప్రారంభించారు. తమవైపు నుంచి పొరబాటు జరిగిందని సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినప్పటికీ.. ఈ ఉద్యమం ఆగట్లేదు. తాజాగా మొజిల్లా, టెస్లా, స్పేస్‌ఎక్స్ లాంటి ప్రముఖ కంపెనీలు కూడా ఫేస్‌బుక్‌ను వీడుతున్నాయి. ఫేస్‌బుక్‌లో టెస్లా, స్పేస్‌ఎక్స్ కంపెనీల ఖాతాలను తొలగించినట్లు ఆ సంస్థల అధినేత ఎలన్ మస్క్ ప్రకటించారు. ఫేస్‌బుక్‌పై ఆరోపణలు వెల్లువెత్తగానే స్పేస్‌ఎక్స్, టెస్లా ఖాతాలను తొలగించాలంటూ ట్విటర్‌లో ఎలన్‌మస్క్‌ను ఆయన ఫాలోవర్లు కోరారు. దీంతో ఖాతాలను తీసేస్తున్నట్లు ఎలన్ తెలిపారు.

ఇక ప్రముఖ సెర్చ్ ఇంజిన్ మొజిల్లా ఫైర్‌ఫాక్స్ కూడా తాము ఫేస్‌బుక్ నుంచి తాత్కాలికంగా వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. అయితే మొజిల్లా తన ఖాతాను తొలగించనప్పటికీ.. ఇకపై ఈ ఖాతా నుంచి ఎలాంటి పోస్టులు చేయబోమని తెలిపింది. ఫేస్‌బుక్ నుంచి బ్రేక్ తీసుకుంటున్నాం. ఈ రోజు నుంచి ఈ ఖాతాలో ఎలాంటి పోస్టులు పెట్టబోం. ఫేస్‌బుక్ డేటాను ఇకపై మరింత భద్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని జుకర్‌బర్గ్ చెప్పారు. అలా ప్రైవసీ సెట్టింగ్స్‌ను మెరుగుపరిచిన తర్వాత మళ్లీ ఫేస్‌బుక్‌ను ఉపయోగిస్తాం అని మొజిల్లా చెప్పుకొచ్చింది. ఇప్పటికే వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రెయిన్ ఆక్టన్ కూడా ఇది ఫేస్‌బుక్‌ను డిలీట్ చేయాల్సిన సమయం అని ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ డిలీట్ ఫేస్‌బుక్ ఉద్యమం మరింత ఉద్ధృతంగా మారుతోంది. మరోవైపు యూజర్లను కోల్పోకుండా ఉండేందుకు అటు ఫేస్‌బుక్ కూడా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ కోసం పనిచేసిన కేంబ్రిడ్జ్ అనలిటికాకు 5కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం చిక్కిందని ఇటీవల వార్తలు వచ్చాయి. ఓ యాప్ ద్వారా ఈ సమాచారాన్ని ఆ సంస్థ సేకరించినట్లు తెలిసింది. దీంతో ఫేస్‌బుక్‌కు చిక్కులు ఎదురయ్యాయి.



భారీగా సంపద కోల్పోయిన జుకర్‌బర్గ్: ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ భారీగా తన సంపదను కోల్పోయారు. గత రెండు నెలల వ్యవధిలో 10.3 బిలియన్ డాలర్లను ఆయన కోల్పోయినట్టు తాజా రిపోర్టు రివీల్ చేసింది. అంతేకాక బ్లూమ్‌బర్గ్ బిలీనియర్స్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో జుకర్‌బర్గ్ 3 స్థానాలు కిందకి పడిపోయి, 7వ స్థానంలోకి వచ్చేశారు. మరోవైపు ఫేస్‌బుక్‌పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. యూజర్ల డేటాను ఇది అమ్మేస్తుందని ఆరోపణలు వస్తున్నాయి. దాదావు ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాల సమాచారం అమెరికా అధ్యక్ష ఎన్నికల కోసం పనిచేసే కేంబ్రిడ్జ్ అనలిటికాకు చిక్కినప్పటికీ ఆ సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. దీంతో ఫేస్‌బుక్ స్టాక్స్ కూడా 14 శాతం కిందకి పడిపోయాయి. వారం వ్యవధిలోనే 13 శాతం మేర కిందకి దిగజారి 160 డాలర్లకు చేరుకున్నాయి. ఈ వారంలోనే ఫేస్‌బుక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా 75 బిలియన్ డాలర్ల మేర క్షీణించింది. కొన్ని రోజుల క్రితమే కేంబ్రిడ్జ్ అనలిటికా స్కాంపై నోరువిప్పిన జుకర్‌బర్గ్ తాము తప్పు చేసినట్టు ఒప్పుకున్నారు. మీ డేటాను రక్షించే బాధ్యత తమదని, ఒకవేళ తాము అలా చేయలేకపోతే, మీకు సేవ చేసే అర్హత కలిగి ఉండమని తెలిపారు. ఇప్పుడు జరిగింది మరోసారి జరగదని హామీ ఇచ్చారు.

రూ. 28 లక్షల కోట్ల కుబేరుల సంపద హారతి



న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరులకు 2018 అంతగా కలిసొచ్చినట్లు లేదు. వరుస పరిణామాల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు కుదేలవడంతో సంపన్నుల లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైంది. ఈ ఏడాది జనవరి 26 నుంచి ఇప్పటివరకు టాప్ 500 ప్రపంచ కుబేరులు 436 బిలియన్ డాలర్లు నష్టపోయారు. అంటే భారత కరెన్సీలో దాదావు రూ. 28.33లక్షల కోట్లకు పైమాటే. ఒక్క ఈ వారంలోనే ఆ 500మంది 181 బిలియన్ డాలర్ల నష్టాలను చవిచూశారు.

ఇందులో ఎక్కువగా సోషల్‌మీడియా సంస్థ ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ నష్టపోయారు. జనవరి 26 నుంచి జుకర్‌బర్గ్ 10.3 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. దీంతో బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీలో జుకర్‌బర్గ్ 4వ స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోయారు. ఇక ఒరాకిల్ కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ 7 బిలియన్ డాలర్లు నష్టపోయారు. బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్ వారెన్ బఫెట్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఆల్ఫాబెట్ సీఈవో ల్యారీ పేజ్ సంయుక్తంగా 17 బిలియన్ డాలర్లు కోల్పోయారు. దీంతో బ్లూమ్‌బర్గ్ సూచీ ప్రకారం 500 ప్రపంచ కుబేరుల మొత్తం సంపద 5.2 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఏడాది ఆరంభం నుంచి అమెరికా మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఫిబ్రవరిలో క్రెడిట్ రేటింగ్ పెంచడంతో అమెరికా మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఇక గత కొన్ని రోజులుగా ఫేస్‌బుక్ డేటా దుర్వినియోగం ఆరోపణల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. దీంతో ఆ సంస్థ షేర్లు 14శాతం మేర నష్టపోయాయి.

జియో కస్టమర్ల సంఖ్య 16.84 కోట్లు

● అయినా నంబర్ 1 ఎయిర్ టెల్ ● జనవరి నాటికి ఎయిర్‌టెల్ కస్టమర్ల సంఖ్య 29.16 కోట్లు ● రెండో స్థానంలో వొడాఫోన్... 21.38 కోట్ల మంది కస్టమర్లు ● మూడో స్థానంలో ఐడియా, నాలుగో స్థానంలో జియో

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి నాటికి రిలయన్స్ జియో కస్టమర్ల సంఖ్య 16.84 కోట్లకు చేరింది. అయినప్పటికీ 29.16 కోట్ల మందితో భారతీ ఎయిర్ టెల్ సంస్థ అత్యధిక కస్టమర్లను కలిగిన సంస్థగా నంబర్ 1 స్థానంలో నిలిచింది. వొడాఫోన్ సంస్థ 21.38 కోట్ల కస్టమర్లతో రెండో స్థానంలో ఉండగా, ఐడియా 19.76 కోట్ల కస్టమర్లతో మూడో స్థానంలో ఉంది. ఇక బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు 10.38 కోట్లకు చేరారు. జూన్ నాటికి ఐడియా, వొడాఫోన్ విలీనమై ఒకే సంస్థగా ఏర్పడనున్నాయి. దీంతో ఉమ్మడి సంస్థ సుమారు 41 కోట్ల కస్టమర్లతో పరిశ్రమలో నంబర్ 1 స్థానానికి చేరే అవకాశం ఉంటుంది. ఇక జనవరి నెలలో కొత్త కస్టమర్లను ఎక్కువ మందిని సంపాదించింది మాత్రం రిలయన్స్ జియోనే. 83 లక్షల మంది జియో నెట్ వర్క్ లో చేరారు. ఎయిర్ టెల్ కు 15 లక్షలు, వొడాఫోన్ కు 13 లక్షలు, ఐడియాకు 11 లక్షలు, బీఎస్ఎన్ఎల్ కు 3.96 లక్షల మంది కస్టమర్లు జతయ్యారు. రిలయన్స్ కమ్యూనికేషన్స్, టాటా టెలీ సర్వీసెస్, ఎయిర్ సెల్, టెలినార్ చాలా వరకు కస్టమర్లను కోల్పోయాయి. టెలినార్ సంస్థను ఎయిర్ టెల్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే టెలినార్ ఎయిర్ టెల్ లో విలీనమవుతుంది. అలాగే టాటా టెలీసర్వీసెస్ (డొకోమో సైతం) కూడా ఎయిర్ టెల్ లో కలసిపోనుంది. ఇక ఆర్ కామ్ సేవలను నిలిపివేయగా, ఎయిర్ సెల్ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. ఈ సంస్థ సర్వీసుల నుంచి తప్పుకునేందుకు సిద్ధమైంది.

భారతీయుల్లో డాటా అక్షరాస్యత అధికం

హైదరాబాద్: డాటా అనలటిక్స్‌లో ప్రపంచ లీడర్ అయిన క్లిక్ తాజాగా ఆసియా పసిఫిక్ డాటా లిటరసీ సర్వే ఫలితాను విడుదల చేసింది. దీని ప్రకారం భారత్‌లో వెయ్యిమంది ఫుల్‌టైమ్ ఉద్యోగులను సర్వే చేయగా వారిలో సగంమంది డాటా నైపుణ్యాలు కలిగిఉన్నారని వెల్లడైంది. దేశంలోని నూతన తరం ఎకానమీ దిశగా భారత ఆర్థికాభివృద్ధి సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్నదని తేలింది. అలాగే వీరు మరింత వ్యూహాత్మక సమాచారం పొంది, వ్యాపార నిర్ణయాలు తీసుకోవడానికి ఈ డేటాను వినియోగిస్తున్నారని వెల్లడైంది. ఈ సందర్భంగా డాటా లిటరసీ ఎవాంజలిస్ట్ పాలీ మక్లీన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వేగవంతమైన టెక్నాలజీ కారణంగా, భారతదేశం మిగిలిన దేశాలకన్నా అత్యంత వేగంగా డాటాను ఉత్పత్తి చేస్తున్నదని తేలింది. దేశంలోని డాటా ఎనలిస్టులు బాగా పనిచేస్తున్నారు. అయితే దేశంలో మరింత డాటా అక్షరాశ్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

డిజిటల్ చెల్లింపులకు రీటైల్ ప్యాడ్ కృషి



హైదరబాద్: చిన్న, పెద్ద వ్యాపారులను డిజిటల్ కార్యకలాపాల దిశగా ప్రోత్సహించేందుకు రీటైల్ ప్యాడ్ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా దేశంలో 50 వేల మంది భారతీయ వ్యాపారులను భాగస్వాములను చేసింది. రీటైల్ ఐ ప్యాడ్ అనేది సురక్షితమైన, భద్రతో కూడిన నగదు రహిత, సంప్రదింపు రహిత విధానాన్ని సౌండ్ ద్వారా కేటాయిస్తుంది. దీనికి స్మార్ట్ ఫోన్, యాప్, క్యూఆర్ కోడ్, ఇంటర్నెట్ అవసరం లేదు. ఈ సందర్భంగా టొన్ ట్యాగ్ సీఈవో, సహ వ్యవస్థాపకులు కుమార్ అభిషేక్ మాట్లాడుతూ సాంకేతికత అనేది జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది. ఇది సమస్యలను అత్యంత వేగంగా పరిష్కరించడంలో సహాయపడుతుందని తెలిపారు.

టీ- హబ్ ఆధ్వర్యంలో టీ స్కిల్స్

హైదరాబాద్: టి-హబ్, పీడబ్ల్యుసీ, కో క్రియేషన్ కన్సల్టింగ్ సహకారంతో టీ స్కిల్స్ అనే శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిద్వారా అంకుర సంస్థలు మార్కెటింగ్ కార్యకలాపాలను విస్తరించేందుకు తగిన ప్రోత్సాహం అందుతుంది. ఈ టీ- స్కిల్స్ ప్రోగ్రాంలో ఇప్పటివరకూ 70కిపైగా స్టార్టప్‌లు భాగస్వాములుగా మారాయి. ఈ సందర్భంగా టీ- హబ్ సీఈవో జై కిషన్ మాట్లాడుతూ ఇప్పటివరకూ ఎన్నో అంకుర సంస్థలు కేవలం పారిశ్రామిక స్వభావం కారణంగానే కాకుండా పనితీరులో వేగం, నైపుణ్యం సంబంధిత లోపాల కారణంగా అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే వాటిని మరింత బలోపేతం చేసేందుకు అంకుర సంస్థలకు విజయవంతమైన మార్గదర్శనం చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

అమెరికా చైనా సుంకాల యుద్ధం

● చైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువ్వు పై యుఎస్ 60 బిలియన్ డాలర్ల సుంకాలు ● అమెరికా ఉత్పత్తులపై చైనా 3 బిలియన్ డాలర్ల సుంకాలు ● చైనాకు అమెరికా ఎగుమతుల విలువ 130 బిలియన్ డాలర్లు ● అమెరికా చేసుకునే దిగుమతుల విలువ 506 బిలియన్ డాలర్లు ● అమెరికా ఉత్పత్తు పై చైనా దిగుమతి సుంకాలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య పరంగా తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నాయి. తాజాగా చైనా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 60 బిలియన్ డాలర్ల సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన చైనా అమెరికా ఉత్పత్తులపై 3 బిలియన్ డాలర్ల సుంకాలను విధించింది. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం నెలకొన్నట్లయ్యింది. చైనాకు అమెరికా ఎగుమతుల విలువ 130 బిలియన్ డాలర్లు, ఇక చైనా నుంచి అమెరికా చేసుకునే దిగుమతుల విలువ 506 బిలియన్ డాలర్లు. చైనాతో అమెరికా వాణిజ్యలోటు 375 బిలియన్ డాలర్లు దాటిపోయింది. వాణిజ్యలోటు ఇంత భారీ స్థాయిలో ఉండటం సమంజసం కాదని ట్రంప్ వాదిస్తున్నారు. ట్రంప్ చర్యలకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు విధించింది. మొత్తం 128 వస్తువులపై 300 కోట్ల డాలర్ల విలువైన సుంకాలను వడ్డించింది. కాకపోతే బిగ్ టికెట్ ఐటమ్స్‌ను మినహాయించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు తెగిపోకుండా ఉండాలంటే అమెరికా వివేకంతో నిర్ణయాలు తీసుకోవాలని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ చైనా చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలకు భంగం కలిగితే చూస్తూ ఊరుకోమని మంత్రిత్వ శాఖ ప్రతినిధి హు చన్‌యింగ్ అన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. చైనా సుంకం విధించిన అమెరికన్ వస్తువుల జాబితాలో పంది మాంసం, పళ్లు, వైన్, సీమ్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, రీసైకిల్డ్ అల్యూమినియం కూడా ఉన్నాయి. అమెరికాతో వాణిజ్య యుద్ధానికి ఏమాత్రం భయపడేది లేదని డ్రాగన్ స్పష్టం చేసింది. చైనా నుంచి దిగుమతులపై 60బిలియన్ డాలర్ల వార్షిక సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం కార్యనిర్వహక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాము కూడా అమెరికాపై వాణిజ్య ఆంక్షలు విధిస్తామని డ్రాగన్ హెచ్చరించింది.

ఈ క్రమంలో అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై తాము కూడా సుంకాలను పెంచుతామని వెల్లడించడమే కాకుండా సుంకాలు పెంచాలనుకుంటున్న పలు అమెరికా వస్తువుల జాబితాను కూడా చైనా విడుదల చేసినట్లు తెలుస్తుంది. తాజా పండ్లు, పంది మాంసం దగ్గరి నుంచి వైన్ వరకు పలు వస్తువులు ఆ జాబితాలో ఉన్నాయి. అయితే ఈ విషయంపై అమెరికాతో చర్చించి నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వివాదాన్ని చర్చలతో పరిష్కరించుకోవడానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. చైనా దిగుమతుల పై సుంకాలను విధించిన అమెరికా,ఏ వస్తువు మీద ఎంత సుంకం విధించాలి అనేది మరో పదిహేను రోజుల్లో నిర్ణయిస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా దానికి ప్రతిగా అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువుల పై సుంకాలు విధించాడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అలానే ట్రంప్ సర్కారు వాణిజ్య యుద్ధం మొదలుపెడితే తాము వెనక్కి తగ్గేదే లేదని చైనా స్పష్టం చేసింది. అయితే తాము వాణిజ్య యుద్ధంలో పోరాడాలని అనుకోవట్లేదు..కానీ దాని గురించి ఏమాత్రం భయపడట్లేదని చైనా వాణిజ్య శాఖ వెల్లడించింది.

నీరవ్ మోడీ ఇళ్లలో ఈడీ మళ్లీ సోదాలు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో ప్రధాన నిందితుడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఇళ్లలో ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మళ్లీ సోదాలు ప్రారంభించింది. ముంబైలోని నీరవ్ మోదీ సముద్ర మహల్ లగ్జరీ రెసిడెన్షియల్ ఫ్లాట్‌లో జరిగిన తాజా సోదాల్లో వజ్రాభరణాలు, ఖరీదైన వాచీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.15 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.1.4 కోట్ల విలువ చేసే ఖరీదైన వాచీలు, రూ.10 కోట్ల విలువ చేసే ఒక వజ్రవుటుంగరాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. వీటితో పాటు ప్రముఖ చిత్రకారులు గీసిన ఖరీదైన చిత్రపటాలను ఈడీ అధికారులు గుర్తించారు. అమృాఎత షేర్ గిల్, ఎంఎఫ్ హుస్సేన్ గీసిన ఈ చిత్రపటాల ఖరీదు సుమారు రూ.26 కోట్ల వరకు ఉండొచ్చని అధికారుల అంచనా. కాగా, ఈ నెల 22 నుంచి మోదీ ఇళ్లలో ఈడీ, సీబీఐ అధికారులు మళ్లీ సోదాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు నీరవ్ మోదీకి సంబంధించి రూ.7638 కోట్ల విలువ చేసే వజ్రాలు, ఖరీదైన రాళ్లు, ఆస్తులను అటాచ్ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నీరవ్ మోదీ ప్రస్తుతం విదేశాల్లో తలదాచుకుంటున్నారు.

ఎస్‌బీఐకి కుచ్చుటోపీ పెట్టిన నాదెళ్ల సంపత్ జ్యుయెలరీ

న్యూఢిల్లీ: చెన్నైలోని నాదెళ్ల సంపత్ జ్యూయలరీ సంస్థ నకిలీ దస్తావేజులతో ఎస్‌బీఐ నుండి రూ.250 కోట్ల రుణం తీసుకుని మోసం చేసింది. అయితే 2010 నుంచి జ్యూయలరీ సంస్థ రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు చేసింది. గత సంవత్సరం నవంబర్ నుంచి దాదావు 21వేల కన్నా ఎక్కువ మంది 75 కోట్ల రూపాయల వరకు బంగారం కొనుగోలు కోసం నెలవారీ వాయిదాల రూపంలో ఆ సంస్థకు చెల్లిస్తున్నారు. దాదావు వేయి కన్నా ఎక్కువ మంది కస్టమర్ లు ఆ సంస్థపై ఫిర్యాదులు చేశారు. దీంతో పోలీసులు జ్యూయలరీ సంస్థ బోర్డు మెంబర్స్ ఎండీ. రంగనాథ గుప్తాపైన, ఆయన కుమారులపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, చెన్నై సహా పలు ప్రాంతాల్లో శాఖలున్న నాదెళ్ల సంపత్ జ్యూయలరీ సంస్థ 2017 అక్టోబరులోనే దివాలా తీసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భారత్‌లో యూట్యూబ్ హవా

న్యూఢిల్లీ: భారత్ లో యూ ట్యూబ్ దూసుకుపోతోంది. నెట్ యూజర్లలో 80 శాతం మంది యూ ట్యూబ్ చూసేవారేనట. పెరుగుతున్న స్మార్ట్ ఫోన్ యూజర్లు, అందుబాటు ధరలకే డేటా యూట్యూబ్ ప్రగతికి కారణమని గూగుల్ ఇండియా సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ 80 శాతం మందిలో అన్ని రకాల వయసుల వారు ఉండడం గమనార్హం. యూ ట్యూబ్ గూగుల్ అనుబంధ సంస్థ అని తెలిసిందే. 2017 డిసెంబర్ నాటి కామ్ స్కోర్ వీడియో మెట్రిక్స్ మల్టీ ప్లాట్ ఫామ్ నివేదిక ప్రకారం ఇంటర్నెట్ యూజర్లలో 18 ఏళ్లు అంతకంటే పైన వయసు ఉండి ఎక్కువగా వినియోగించే యూజర్లలో 85 శాతం మందికి యూట్యూబ్ చేరువ అయింది అని గూగుల్ దక్షిణాసియా వైస్ ప్రెసిడెంట్ రాజన్ ఆనందన్ తెలిపారు. నేటి తరం చిన్నారులు సైతం మొబైల్ ఫోన్లలో యూట్యూబ్ చూస్తున్న విషయం తెలిసిందే. కేవలం మొబైల్ నుంచే ప్రతీ నెలా 22.5 కోట్ల మంది యూట్యూబ్ ను యాక్సెస్ చేస్తున్నారట. అత్యంత వేగంగా యూట్యూబ్ వినియోగం పెరుగుతున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని గూగుల్ తెలిపింది.

ఎంసీఎక్స్‌లో 12 నెలల కనిష్ఠానికి బంగారం వాటా విలువ



ముంబై: గడచిన కొద్ది సంవత్సరాలుగా బంగారం ధరలు స్థిరత్వం దిశగా కొనసాగడం లేదని మల్టీ కమెడిటీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా(ఎంసీఎక్స్) తెలిపింది. బంగారం డైలీ యావరేజ్ టర్నోవర్(డీఎటీ) 2018లో ఇప్పటివరకూ 25 బిలియన్లుగా ఉంది. ఇది 12 నెలల కనిష్టంగా నమోదైంది. 2004, 2005 సంవత్సరాల్లో ఇదే విధమైన ఫలితాలు కనిపించాయి. ఈ విధమైన పతనం బంగారం ధరలపై ప్రభావం చూపిస్తుంది. కాగా ఎంసీఎక్స్ 2011లో బంగారం టర్నోవర్ మొత్తంగా రూ. 102.2 బిలియన్లుగా నమోదు చేసింది. కాగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మే 21, 2014న బంగారం దిగుమతుల పై నిబంధనలను 20:80 పద్ధతి కింద సరళతరం చేసింది. ఈ 20:80 పద్ధతిలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డి.జి.ఎఫ్.టి) చేత నామినేటెడ్ ఏజెన్సీలుగా రిజిస్టర్ అయిన స్టార్ ట్రేడింగ్ హౌసెస్, ప్రీమియర్ ట్రేడింగ్ హౌసెస్ బంగారం దిగుమతులను చేసుకోవచ్చు.

కార్తీ చిదంబరానికి మరో ఊరట

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఊరట లభించిన కార్తీ చిదంబరానికి, ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో కూడా మరో ఊరట లభించింది. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో ఏప్రిల్ 16 వరకు ఆయనను అరెస్ట్ చేయకుండా.. స్పెషల్ కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. స్పెషల్ సీబీఐ జడ్జి ఓపీ సైని, షరత్తులతో కూడిన ఈ ముందస్తు బెయిల్‌ను మంజూరు చేశారు. ఈ కేసులో ఎప్పుడు సమన్లు జారీచేస్తే అప్పుడు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ముందు హాజరు కావాలని జడ్జి తెలిపారు. కార్తీ చిదంబరం ముందస్తు బెయిల్ ఫిర్యాదులపై మూడు వారాల్లోగా స్పందించాలని సీబీఐ, ఈడీని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. 2006లో ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందానికి విదేశీ పెట్టుబడుల ప్రమోషన్ బోర్డు అనుమతి ఇవ్వడానికి సంబంధించి జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ కేసు నమోదైంది. ఎఫ్ఐపీబీ అనుమతి కోసం కార్తీ చిదంబరం రూ.26 లక్షలను పుచ్చుకున్నట్టు ఈడీ ఆరోపిస్తోంది. నేడు గంట పాటు జరిగిన ఈ విచారణలో కార్తీ తరుపున వాదించిన కపిల్ సిబాల్... ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో కార్తీకి వ్యతిరేకంగా



ఎలాంటి ఆరోపణలు నమోదు కాలేదని పేర్కొన్నారు. ఎఫ్ఐపీబీ అధికారులు ఆయనకు తెలుసన్న రుజువులేమీ లేవన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో శుక్రవారమే కార్తీకి బెయిల్ మంజూరైంది.

తాగొచ్చిన పైలట్లపై జెట్ ఎయిర్ వేస్ వేటు

న్యూఢిల్లీ: తాగి టూ వీలర్ నడిపే వారి గురించి, కారు నడిపేవారి గురించి విన్నాం... కానీ, విమాన పైలట్లు కూడా ఇందుకు అతీతం కాదని రుజువైంది. వందల సంఖ్యలో ప్రయాణికుల ప్రాణాలు గాల్లో ప్రశ్నార్థకం చేసేలా వ్యవహరిస్తూ జెట్‌ఎయిర్ వేస్ సంస్థకు చెందిన ఇద్దరు పైలట్లు తాగి డ్యూటీకి వచ్చారు. ఇది బయటపడడంతో వారిద్దరిపై సంస్థ వేటు వేసింది. బోయింగ్ 737 విమాన పైలట్, కో పైలట్ ను రాజీనామా చేయాలని ఆదేశించింది. డైరక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నిబంధనలకు అనుగుణంగా ఆ ఇద్దరి లైసెన్స్ లను మూడు నెలల పాటు సస్పెండ్ చేసింది. విమానం నడిపే ముందు పైలట్లకు విధిగా శ్వాస విశ్లేషణ పరీక్ష నిర్వహిస్తారు.


త్వరలో బీఎస్ఎన్ఎల్ 5జీ సర్వీసులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు శుభవార్త. వచ్చే ఏడాది 5జీ సేవలను దేశ వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ అనుపమ్ శ్రీవాస్తవ తెలిపారు. ఇందుకోసం నోకియా, జడ్‌టీఈ, ఎన్‌టీటీ వంటి సంస్థలతో ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. అలాగే ఒక లక్ష వరకు వైఫై హాట్ స్పాట్లను ఏర్పాటు చేసి సంస్థ యొక్క రెవెన్యూ రూ.200-250 కోట్ల వరకు ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కాగా ఇప్పటివరకు దేశంలో బీఎస్ఎన్ఎల్ కి 3జీ సేవలు మాత్రమే ఉన్నాయి. కానీ ఈ ఏడాది చివరినాటికి ఢిల్లీ, ముంబై తప్ప దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ 4జీ సేవలను ప్రారంభిస్తామని సంస్థ ఛైర్మన్ శ్రీవాస్తవ తెలిపారు.

కాంగ్రెస్‌కు తగ్గిన స్థానాలు

- తాజా సంఖ్యా బలాలు ఇవీ
- 11 స్థానాలు పెరిగి 69కి చేరిన బీజేపీ బలం
- నాలుగు స్థానాలు చేజార్చుకుని 50కి పరిమితమైన కాంగ్రెస్
- పెద్దల సభలో ఇక బీజేపీ ఆధిపత్యం

న్యూఢిల్లీ : 58 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ప్రధాన జాతీయ పార్టీల సంఖ్యా బలంలో మార్పులు చోటు చేసుకున్నాయి. బీజేపీ బలం పెరగగా, కాంగ్రెస్ బలం తగ్గింది. మొత్తం మీద కాంగ్రెస్‌కు నాలుగు స్థానాలు తగ్గిపోయాయి. తాజా ఎన్నికల అనంతరం 245 స్థానాలు కలిగిన పెద్దల సభలో బీజేపీ సభ్యుల సంఖ్య 58 నుంచి 69కు చేరుకుంది. కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 54 నుంచి 50కు తగ్గింది. బీజేపీ 11 స్థానాలను పెంచుకుని మెజారిటీకి చేరింది. తద్వారా పెద్దల సభలో ఇంత కాలం కాంగ్రెస్, ప్రతిపక్షాలదే పైచేయిగా ఉండగా, ఇప్పుడు బీజేపీ బలం కాంగ్రెస్‌ను మించిపోయింది. అయితే, ఇంత కాలం పెద్దల సభలో టీడీపీకి ఉన్న ఆరుగురు సభ్యులు ఎన్డీయేకు తోడుగా ఉండగా ఇటీవల దూరమైన విషయం తెలిసిందే. దీంతో బీజేపీ స్వీయ బలం 11 సీట్లు పెరిగినప్పటికీ టీడీపీ రూపంలో ఆరు స్థానాల బలం తగ్గినట్టుగానే భావించాల్సి ఉంటుంది. అయితే, టీఆర్ఎస్ తాజాగా మూడు స్థానాలు గెలవడం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరోక్ష మద్దతుతో ఎన్డీయే బలంగానే ఉందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా.



నీతిమంతుడా...అవినీతిపరుడా !


- జనసేన అధినేత పవన్ కింకర్తవ్యం
- పవన్ లెక్కలు తీసే పనిలో తెలుగు తమ్ముళ్లు
- పవన్ స్పీచ్‌లో అసలైన క్లైమాక్స్ సీన్ ఇదేనా ?
- సీఎం ఎంటర్ అయ్యాక సీన్ మారిందట

(అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : నవ్యాంధ్ర రాజకీయాలు రోజురోజుకు రసకందాయంలో పడుతున్నాయి. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఆయన తనయుడు లోకేష్‌పై బహిరంగంగా చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. దీంతో పవన్‌కళ్యాణ్ అసలు నీతిమంతుడా ? అవినీతిపరుడా ? అని తేల్చే పనిలో వారు నిమగ్నమయ్యారు. సినిమాలకు తీసుకుంటున్న పారితోషకంతోపాటు ఆయన కడుతున్న ఐటి లెక్కలను తీసే పనిలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వంలో లెక్కలు చెప్పాలని ప్రశ్నిస్తున్న పవన్‌ను ఆయన లెక్కలు తీసేందుకు తెర వెనుక అధికార తెలుగుదేశం పార్టీ పెద్ద మంత్రాంగం చేస్తున్నట్లు తెలిసింది...'

తాను కొన్న కారుకు ఈఎంఐ కూడా కట్టలేని పరిస్థితుల్లో పార్టీని ఎలా నడుపుతానంటూ గతంలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తుతం టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. రాజకీయాల్లో రాణించాలంటే డబ్బు అవసరం చాలా ఉందని, అది తన వద్ద లేదన్న పవన్ కళ్యాణ్ అకస్మాత్తుగా నాలుగేళ్లు అధికార పార్టీలో అంటకాగి ప్రస్తుతం బహిరంగంగా ప్రభుత్వంపై, మంత్రులపై చేస్తున్న వ్యాఖ్యలపై అధికార పార్టీలో అంతర్మధనం మొదలైంది. ఇప్పటి నుంచే ఆ వ్యాఖ్యలపై దృష్టి సారించి చెక్ పెట్టకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయన్న ఆలోచనతో పవన్‌కళ్యాణ్ అసలు రాజకీయాల్లో ఏం సాధించేందుకు ముందుకు వచ్చారు ? ఆయన వెనుక కథ ఎవరు నడుపుతున్నారని ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. ఆయన స్వంతంగా మంగళగిరిలో రెండు ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద భవనానికి శంకుస్థాపన చేయడంతో ఆ భవన నిర్మాణానికి ఎవరు నిధులు సమకూర్చారు ? మంగళగిరిలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభకు ఎంత ఖర్చు చేశారు ? పవన్ వ్యాఖ్యల వెనుక అసలు కథ ఏంటన్న విషయం తెలుసుకుని ఆయన వ్యక్తిగత అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సమాచారం. సినిమాలకు తీసుకున్న పారితోషకంతోపాటు ఆయన గతంలో నిర్మాతలకు డబ్బులు ఎగ్గొట్టినట్లు వచ్చిన వార్తల వివరాలను బహిరంగపరిచేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

టీడీపీ టార్గెట్‌గా పవన్

జనసేన నాల్గవ ఆవిర్భావ సభలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం ఇంకా అంతులేని కథగానే ఉంది. తన ప్రసంగంలో ఆయన కామా మాత్రమే పెట్టారని, ఫుల్‌స్టాప్ వరకు వెళ్లలేదని జన సైనికులు అంటున్నారు. ఆయన ప్రసంగంలో మిగిలిపోయిన అంశాలు ఏమిటనేది ఆసక్తికర అంశంగా మారింది. జనసేన నాలుగవ ఆవిర్భావ సభ అంగరంగ వైభవంగా జరిగింది. సహజంగానే పవన్ కల్యాణ్ ప్రసంగాలపై జనానికి ఆసక్తి ఎక్కువ. దీంతో సభలో ఆయన ఏమి మాట్లాడతారో అని అందరూ చెవి ఒగ్గారు. తొలుత ప్రత్యేకహోదా అంశాన్ని ప్రస్తావించిన పవన్ కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీపై విరుచుకుపడ్డారు. ఆ తర్వాత అకస్మాత్తుగా స్వరం మార్చారు. చంద్రబాబు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. టీడీపీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన పవన్ చివర్లో ఓ ట్విస్ట్ ఇచ్చారు. ఇంత మాట్లాడిన తర్వాత కూడా నేను చంద్రబాబు వైపు ఉన్నానని మీరు అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. దీనిపై తెలుగు తమ్ముళ్లు స్పందిస్తూ తన రాజకీయ ఉనికి చాటుకునేందుకే పవన్ టీడీపీని టార్గెట్ చేశారని అంటున్నారు. ఏపీలో భూకబ్జాలు, ఇసుక మాఫియా, అవినీతి వంటి అంశాలెన్నో పవన్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. సీఎం తనయుడు, రాష్ట్రమంత్రి లోకేశ్‌పై వ్యాఖ్యలుచేస్తూ ఆయన అవినీతికి పాల్పడ్డారని ఎవరో అనుకుంటున్నారు అన్నడం ద్వారా తమ మాటల్లో విశ్వసనీయతని ఆయనే దెబ్బతీసుకున్నారు. పవన్ ప్రసంగం సుమారు ఒక గంటా 20 నిముషాల సేపు సాగింది. కానీ ఆయన అభిమానులు ఈ దఫా ఎందుకో మనసుపెట్టి పూర్తి ప్రసంగాన్ని విన్నట్టు అనిపించలేదు. అయితే ఇక్కడ మరో ఆసక్తికర కోణం ఉందని సమాచారం. పవన్ తన వెంట తెచ్చుకున్న ప్రసంగ పాఠంలో మరికొన్ని అంశాలు ఉన్నాయని జనసేన వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యతను రాష్ట్రప్రభుత్వం ఎందుకు తీసుకుందని ప్రశ్నించడంతో పాటు అందులో అవినీతి జరిగిందని కొంతమంది మాజీ ఐఏఎస్‌లు పవన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశం కేంద్రప్రభుత్వంతో ముడిపడి ఉండటం, నవయుగ రంగంలోకి దిగిన తర్వాత పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో వేగం వచ్చిందని పవన్‌కు సమాచారం అందడంతో ఆయన తన ప్రసంగంలో పోలవరం అంశాన్ని ప్రస్తావించలేదట. రాజధానిలో కోర్ క్యాపిటల్ అభివృద్ధి కాంట్రాక్టును స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో ఎంపికచేయడాన్ని కూడా ప్రశ్నించాలని కొంతమంది మాజీ అధికారులు పవన్‌కి సూచించారట. ఈ అంశాన్ని కూడా పవన్ వదిలిపెట్టినట్టు తెలుస్తోంది. స్విస్ ఛాలెంజ్‌పై రాష్ట్రప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్ కృష్ణారావు హైకోర్టు గడప తొక్కిన సంగతి తెలిసిందే. దీనిపై కోర్టు స్పందిస్తూ మీరు ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో ఈ ఫైల్‌ను ఎందుకు ఆపివేయలేదని ప్రశ్నించిన సంగతి పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది. సదరు వార్తలను చూసిన పవన్ స్విజ్ ఛాలెంజ్ అంశం జోలికి కూడా వెళ్లలేదని అంటున్నారు. పవన్ కల్యాణ్ మరికొన్ని విషయాలను కూడా మాట్లాడలేదట. ఏపీ సీఎం పేషీలో పారదర్శకత లోపించిందనీ, సమాంతర ప్రభుత్వం నడుస్తోందని ఆయనకి సమాచారం వచ్చిందట. అయితే పేషీలో సీనియర్ అధికారులు ఉంటారు, వారు ప్రభుత్వ ఆదేశాలను అమలుచేస్తారని తెలుసుకున్న పవన్ ఆ విషయాలను నేరుగా ప్రస్తావించలేదట. ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు తాము కొన్ని ఫైళ్లపై సంతకాలు చేయాల్సి వస్తుందని అధికారులు తనతో చెప్పారంటూ పవన్ చేసిన ప్రసంగం ప్రస్తుతం ఏపీ అధికార వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. పవన్‌కు సన్నిహితంగా ఉన్న అధికారులు ఎవరనే విషయమై ఏపీలో కొంతమంది సీనియర్ అధికారులు ఆరాతీస్తున్నారు. ఇలాంటి వారు ప్రభుత్వ అధికారిక రహస్యాలను బయటకు చేరవేస్తున్నారేమో అన్న సందేహాలు ఉన్నతాధికారుల్లో వ్యక్తమవుతున్నాయి. పవన్ తన ప్రసంగ పాఠాన్ని పూర్తిగా



వల్లెలేసి ఉంటే ఈ మూడు అంశాలు కూడా రాష్ట్రంలో చర్చకు దారితీసేవని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

పవన్ ఆరోపణలపై రంగంలోకి చంద్రబాబు

ముఖ్యమంత్రి ఎంటరయ్యే వరకు సీను మారలేదు. మంత్రులు, ఎమ్మెల్యేల వివరణలు అంతగా జనంలోకి వెళ్లలేదు. వేగంగా మారుతున్న పరిణామాలు టీడీపీలో కొంతమంది నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరికొంత మంది నేతలు భవిష్యత్తు ఎలా ఉంటుందోనని భయపడి పెదవి విప్పడంలేదు. ప్రభుత్వాధినేత, ఆయన కుమారుడి పై వచ్చిన ఆరోపణలను మంత్రులు సమర్ధంగా తిప్పి కొట్టలేకపోయారు. సీఎం రంగంలోకి దిగాక సీను మారింది. ముప్పేట దాడి ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తుంది. ఏదో కుట్ర జరుగుతుందనే అనుమానాన్ని తటస్థుల్లో రేకెత్తిస్తోంది. జనసేన పార్టీ నాలుగో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేసిన ప్రసంగం ఏపీలో రాజకీయంగా సంచలనం సృష్టించింది. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌ను టార్గెట్ చేయడం తెలుగుదేశంపార్టీలో కలకలం పుట్టించింది. మంత్రులు పవన్‌కల్యాణ్ ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టలేకపోయారు. కొంతమంది మంత్రులు అయితే ఇవాల్టి వరకు పవన్ ఆరోపణలపై నోరు కూడా విప్పలేదు. అధినేతపై ఆయన కుమారుడు లోకేశ్‌పై ఎవరో ఏదో అనుకుంటున్నారంటూ పవన్ చేసిన ఆరోపణలపై కూడా టీడీపీలోని కొంతమంది మంత్రులు పెదవి విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వారి కదలికలపై కూడా పార్టీ ఓ కన్నేసిందని ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశంపార్టీ నేతలు, శాసనసభ్యులు, మంత్రుల కంటే బీజేపీ శాసనసభపక్ష నేత విష్ణుకుమార్‌రాజే ఘాటుగా స్పందించారు. లోకేశ్‌పై పవన్ చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని, అలా ఒక మంత్రిపై ఎవరో అనుకుంటున్నారని ఏదో అనేస్తే ఎలా అని విష్ణుకుమార్‌రాజు నిలదీయడం లోకేశ్‌కు కొంత స్వాంతన కలిగించింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి శాసనసభ, శాసనమండలిలో చేసిన ప్రసంగం పవన్‌కు కౌంటర్ ఇచ్చినట్లయ్యింది. చంద్రబాబు ప్రసంగం తర్వాత పవన్‌కల్యాణ్ కూడా తన వ్యాఖ్యలను సరిచేసుకునే ప్రయత్నం చేశారు. ఎవరో అనుకుంటున్నారని తాను అన్నానని, సరి చేసుకుంటే మంచిదని సూచించానే తప్ప మరో ఉద్దేశం లేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

మొదటి పేజీ తరువాయి

దాణా కుంభకోణం


లాలూకు 14 ఏళ్ల జైలు శిక్ష ఖరారు



రాంచీ : దాణా కుంభకోణానికి సంబంధించిన నాలుగవ కేసులో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు పద్నాలుగేళ్ల జైలు శిక్షను రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శనివారం ఖరారు చేసింది. లాలూకు జైలు శిక్షతో పాటు రూ. 60 లక్షల జరిమానా కూడా కోర్టు విధించింది. ఈ కేసుకు సంబంధించి గత సోమవారం తీర్పు వెలువరించింది. దుమ్కా కోశాగారం నుంచి అక్రమంగా రూ. 3.13 కోట్లు తీసుకున్నారనే ఆరోపణలపై లాలూతో పాటు మరికొందరిపై ఈ కేసు నమోదు చేశారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాను నిర్దోషిగా కోర్టు ప్రకటించింది. కాగా, ఇదే కుంభకోణానికి సంబంధించి మిగతా మూడు కేసుల్లోనూ లాలూకు శిక్ష పడిన విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్ 23 నుంచి రాంచీలోని బిర్సా ముండా జైలులో లాలూ శిక్ష అనుభవిస్తున్నారు.

మీ నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది

ఏపీకి ఇచ్చిన హామీలను కేంద్రం పూర్తిస్థాయిలో నెరవేర్చింది



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ నుంచి బయటకు వస్తూ చంద్రబాబు రాసిన లేఖకు అమిత్‌షా సమాధానమిచ్చారు. టీడీపీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నా అని లేఖలో పేర్కొన్నారు. మీరు తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున చేపట్టిన అనేక కార్యక్రమాలను, ఏపీకి ఇచ్చిన ప్రాజెక్టుల వివరాలను 9 పేజీల లేఖలో అమిత్‌షా ప్రస్తావించారు. అభివృద్ధి కంటే రాజకీయపరమైన అంశాల కారణంగానే టీడీపీ బయటకు వెళ్లినట్లు అనిపిస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఏపీకి సంబంధించి ఏ చిన్న విషయంలోనూ వెనకడుగు వేయలేదని వివరించారు. ఏపీ అభివృద్ధికి నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందించిందని తెలిపారు. గతంలో టీడీపీకి లోక్‌సభలోగానీ, రాజ్యసభలోగానీ సరైన ప్రాతినిధ్యం లేనప్పుడు బీజేపీనే అజెండా తయారుచేసిందని గుర్తుచేశారు. బీజేపీనే ఏపీ తరపున వాదనలు వినిపించిందని చెప్పారు. ఏపీకి ఇచ్చిన హామీలను కేంద్రం పూర్తిస్థాయిలో నెరవేర్చిందని వెల్లడించారు. తెలుగుదేశానికి, ఏపీ ప్రజలకు బీజేపీనే నిజమైన మిత్రుడని పేర్కొన్నారు. ఏపీకి ఇచ్చిన కేంద్ర విద్యాసంస్థలు, ఎయిమ్స్, ఇతరత్రా అంశాలు, విభజనచట్టంలోని అంశాలను అమిత్‌షా లేఖలో ప్రస్తావించారు. మూడు ఎయిర్‌పోర్టులను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా మార్చినట్లు పేర్కొన్నారు. అమరావతిలో రైల్‌రోడ్ నిర్మాణానికి, 180 కి.మీ రింగ్‌రోడ్డుకు నిధుల విషయాన్ని ప్రస్తావించారు. కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి



టీఎస్‌టీతో బాబు దోపిడీ


విషయంలో తెలుగుదేశం సర్వీస్ ట్యాక్స్ (టీఎస్టీ) కట్టాల్సిన పరిస్థితి నెలకొందిఅని వైసీపీ అధ్యక్షుడు, ప్రతి పక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. టీడీపీ అవినీతిపై మండిపడ్డారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా గుంటూరు జిల్లా నర్సారావుపేట పట్టణంలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో వైఎస్ జగన్ ప్రసంగించారు. అశేషంగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి వైఎస్ జగన్ మాట్లాడుతూ.. టీఎస్టీతోపాటు నర్సాపేట నియోజకవర్గంలో కేఎస్టీ ట్యాక్స్ కూడా కట్టాల్సిన పరిస్థితి నెలకొందని, రైల్వే కాంట్రాక్టుల నుంచి విద్యుత్ ప్రాజెక్టులు వరకు, కొటప్పకొండ కాంట్రాక్టు నుంచి మద్యం కాంట్రాక్టుల వరకు, కొత్త సినిమా రిలీజైనా ఆఖరికీ ఆటోలు, తోపుడు బండ్ల నుంచి కేఎస్టీ వసూలు చేస్తున్నారని నర్సారావుపేట టీడీపీ ఎమ్మెల్యేపై ధ్వజమెత్తారు. ఇలా టీఎస్టీ, కేఎస్టీ పేరుతో ప్రజల్ని దోచుకుంటున్నారని, ఎక్కడచూసినా లంచం, లంచం, లంచం ఇదే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని, చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధిలో పురోగతి సాధించిందో లేదో తెలియదుకానీ, అవినీతిలో మాత్రం దేశంలోనే నంబర్‌వన్ పురోగతి సాధించిందని దుయ్యబట్టారు. నర్సారావు పేట నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుచేయాలని అన్నారు. నర్సారావు నుంచి చీరాల వరకు రోడ్డును నాలుగులైన్లుగా విస్తరించాలని, పెరుగుతున్న అవసరాల మేరకు నర్సారావుపేటలో మరో మంచినీటి రిజర్వాయర్ ఏర్పాటుచేయాలని ప్రజలు అడుగడుగునా తనను కలిసి అర్జీలు సమర్పిస్తున్నారని వైఎస్ జగన్ తెలిపారు. ఈ సమస్యలను టీడీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకునే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా ఒక్క ఏడాది కూడా వరి వేసుకునే పరిస్థితి లేదని రైతులు నాకు చెప్పారు .నాగార్జున సాగర్ కుడి కాల్వలో నీళ్లు ఉన్నా.. రైతులు వరి పంట పండించలేకపోతున్నారన్నారు. నాగార్జున సాగర్ పూర్తి నిల్వ సామర్థ్యం 310 టీఎంసీలు నవంబర్ 1, 2017 నాటికి సాగర్‌లో 274 టీఎంసీల నీళ్లు ఉన్నా.. రైతులకు వరి పంట వేసుకునేందుకు నీళ్లు ఇవ్వలేదు, నాగార్జున సాగర్ ఎడుమకాలువ ద్వారా తెలంగాణలోని రైతులు ప్రతి సంవత్సరం వరి పండిస్తున్నారని, కేసీఆర్ ఎడుమ కాలువలో వరి పండిస్తున్నారని తెలిపారు. ఇక్కడ చంద్రబాబుమాత్రంసాగర్ కుడికాలువ ద్వారా వరికి నీళ్లు ఇవ్వడం లేదుమరి కేసీఆర్‌కు ఉన్నదేమిటి?చంద్రబాబుకు లేనిదేమిటి? అన్నారు. చంద్రబాబుకులేనిదేమిటో..కేసీఆర్‌కు ఉన్నదేమిటో తెలుసా.. ఓటుకు కోట్లు కేసుఅడ్డగోలు అవినీతి సంపాదనతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి..చంద్రబాబు ఆడియోటేపులు, వీడియోటేపులతో దొరికిపోయాడు. ఆధారాలన్నీ కేసీఆర్ దగ్గర ఉన్నాయని తెలిపారు. అందుకే కేసీఆర్‌ను నీళ్లు అడిగే ధైర్యం చంద్రబాబు చేయలేకపోతున్నారని విమర్శించారు. ఈ నాలుగేళ్లో చంద్రబాబు ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పించలేదువరి మొదలు కందులు, పెసలు, పత్తి, మిర్చి, ఇలా ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లేదు అన్నారు. ఆఖరికీ మార్కెట్‌యార్డుల్ని కూడా అవినీతి కేంద్రాలుగా మార్చారురైతన్న మార్కెట్‌యార్డుకు వెళితే ఏ పార్టీ అని అడుగుతున్నారు పరిస్థితి సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు తీసుకోవాలంటే లంచాలు ఇవ్వాల్సిందే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతన్న పరిస్థితిదయనీయంగా ఉందిచంద్రబాబు నాలుగేళ్ల పాలన చూశాంఈ నాలుగేళ్లపాలనలోఏ ఒక్కరు కూడా సంతోషంగా లేరు, రైతులు, మహిళలు, నిరుద్యోగులసహా అందరినీ చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు.

ఏపీ రాజధాని వ్యవహారంలో టీడీపీ వైఖరిని బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు తప్పుబట్టారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏపీకి కేంద్ర ప్రభుత్వం మట్టి, నీరు ఇచ్చిందని విమర్శలు చేస్తున్నారని, మీరు మాత్రం హెలికాప్టర్ లో తిరిగి నీళ్లు చల్లి శుద్ధి చేస్తారా? అని ఏపీ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

నాలుగేళ్లవుతున్నా, రాజధాని డిజైన్లు ఇప్పటివరకు ఖరారు చేయలేదని విమర్శించారు. రాజధానిలో 1000 బిల్డింగ్ లు కట్టడానికి కేవలం రూ.2000 కోట్లు ఖర్చు అవుతుందని, ఏపీ సర్కార్ మాత్రం రూ.40 వేల కోట్లు ఖర్చవుతుందంటూ తప్పుడు లెక్కలు చెబుతోందని, అసెంబ్లీ భవనాల నిర్మాణానికి ఒక ఎస్ఎఫ్ టీ కి ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ తాత్కాలిక అసెంబ్లీలో టాయిలెట్లు లేవని, వెంటిలేషన్ కూడా సరిగా లేదని విష్ణుకుమార్ రాజు విమర్శించారు.

బీసీలే లక్ష్యం




అభివృద్ధి పథకాలతో దేశం ముందుకు సాగుతోందని తెలుగు రాష్ట్రాల్లోని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తూ బడు గులకు గాలం వేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే బీసీల కోసమని, ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, తమ పార్టీ అధికారంలోకి వస్తే బడుగులకు పెద్ద పీట వేస్తామని ఆ పార్టీ నేతలు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీసీల బతుకుల్లో మార్పును తెచ్చిన ఘనత తమదేనని టీఆర్ఎస్ నేతలు చెబుతూనే..మరో వైపు ముస్లింలను ఆకర్షించేలా వారికి రిజర్వేషన్లు పెంచిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల విద్యాలయాల ఏర్పాటు, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్, ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు ఇలా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాలను మెప్పింపజేసేలా కేసీఆర్ వరాలు కురిపించడం తెలిసిందే. దీంతో బీసీలతో పాటు మైనార్టీ వర్గాల ఓట్లను కొల్లగొట్టేందుకు టీఆర్ఎస్ ఇప్పటికే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో అవినీతి బాగా పెరిగిపోయిందని, బీసీల సంక్షేమాన్ని విస్మరించిన అధికార పార్టీలకు బుద్ధిచెప్పాలని, తమ పార్టీ అధికారంలోకి వస్తే బడుగులకు పెద్దపీట వేస్తామని కాంగ్రెస్ నేతల ప్రచారం కొనసాగుతోంది. కాగా.. దేశంలోని అత్యధిక జనాభా కలిగిన బడుగు, బలహీన వర్గాలను విస్మరిస్తే అధికారం చేజార్చుకోవాల్సిందేనని ఇటీవల వెలువడిన పలు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. బడుగుల అండతోనే దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ అత్యధిక సీట్లు గెలిచి బంపర్ మెజార్టీ సాధించింది. అలాగే మణిపూర్, గోవా రాష్ట్రాల్లో కూడా అధికారాన్ని దక్కించుకుంది.

బడుగుల సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్రాలల్లో అధికార పార్టీలకు పరాజయం తప్పలేదు. తమ సామాజిక వర్గ సంక్షేమాన్ని విస్మరించిన ఆయా పార్టీల అధికారాన్ని దించడంలో బడుగులు పై చేయి సాధించారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం బడుగుల అండతోనే విజయ ఢంకా మోగించామని ప్రకటించడం గమనార్హం. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీలో అంతర్గత కుమ్ములాటలు, వర్గపోరు పేరు ఏదైనా.. అధికారం మాత్రం బడుగులదేనని చెప్పక తప్పదు. జనాభాలో అధిక శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలతో పాటు ముస్లిం మైనార్టీలు బీజేపీకి అధికారం కట్టబెట్టారు.

ఒక వైపు ఆయా రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో అంతర్గత కుమ్ములాటలు, మరో వైపు డీమానిటైజేషన్ ప్రభావం ఓటర్లపై లేకపోవడం బీజే పీకి కలిసివచ్చింది. దీనికి తోడు ప్రభుత్వ వ్యతిరేకతను మోదీ హామీల రూపంలో ఓటుగా మలచుకున్నారు. కాగా... తెలుగు రాష్ట్రాల్లో రాజ్యాధికారం కోసం పోరాటం చేసే దిశగా బడుగుల అడుగులు ముందుకు సాగుతున్నాయి. జనాభాలో అత్యధిక శాతం ఉన్న తమ సామాజిక వర్గానికి దక్కాల్సిన హక్కులను కాలరాస్తున్న తెలుగు ప్రభుత్వాలపై బడుగు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో 56శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు పెద్ద పీట వేస్తామని ఎన్నికల సందర్భంగా ఇటు తెలంగాణలో , అటు ఏపీలో అనేక వాగ్దానాలు గుప్పించి, తీరా అధికారం చేపట్టి, నాలుగేళ్లు కావస్తున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని బీసీ నేతలు ఆగ్రహం వక్యం చేస్తున్నారు. ఇకపై ఓటు బ్యాంకు రాజకీయాలను సహించేది లేదని బీసీ నేతలు హెచ్చరిస్తున్నారు.

అవగాహన లేని అమిత్



సీఎం చంద్రబాబు తీసుకెళ్లారని చెప్పారు. త్వరలోనే పూర్తిస్థాయి ఆధారాలతో అమిత్‌షాకు సీఎం లేఖ రూపంలో సమాధానమిస్తారని లోకేశ్ వెల్లడించారు. ఎన్డీయే నుంచి బయటకు వస్తూ చంద్రబాబు రాసిన లేఖకు అమిత్‌షా శనివారం సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున చేపట్టిన అనేక కార్యక్రమాలను, ఏపీకి ఇచ్చిన ప్రాజెక్టుల వివరాలను 9 పేజీల లేఖలో అమిత్‌షా ప్రస్తావించారు.

తప్పులుంటే చెప్పండి సరిచేసుకుంటా...

ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపణలపై మంత్రి లోకేష్ స్పందించారు. నీళ్ల టాంకర్ల విషయంలో అవినీతి జరిగిందని, సోము వీర్రాజు ఆరోపణలు చేయడం సరికాదని హితవుపలికారు. వాటర్ ట్యాంకర్ల విషయంలో అవినితి జరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఏం జరిగినా నా డ్యాష్ బోర్డులో కనిపిస్తాయి. ఉపాధి హామీ నిధుల్లో అవినీతి జరిగితే 20 అవార్డులు ఎందుకు వస్తాయి? బీజేపీ పాలిత రాష్ట్రాలలో అవార్డులు ఎందుకు రాలేదు? రోజుకు 15గంటలు కష్టపడుతున్నా. అవినీతి ఆరోపణలు బాధ కలిగిస్తున్నాయి. ప్రతి చిన్న విషయానికీ అవినీతి అనడం సరికాదు. తప్పులుంటే బీజేపీ నేతలు చెప్పండి. సరిచేసుకుంటా అని లోకేశ్ కోరారు.


ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య అధికం...

రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య అధికంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నామని, ఏపీలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యమన్నారు. ప్రతి కుటుంబానికి మంచినీరు అందిస్తామన్నారు. పల్లెల్లో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, డ్యాష్ బోర్డులో అన్ని వివరాలు పెడుతున్నామని, 2019 మార్చి నాటికి ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేస్తామన్నారు.

రేణిగుంటలో సైబర్‌సెక్యూరిటీ స్కూల్...

రేణిగుంటలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ భవనంలో మంత్రి లోకేష్ శనివారం సాయంత్రం స్కూల్ ఆఫ్ బిజినెస్ అనలిటిక్స్, స్కూల్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీలను ప్రారంభించారు. అలాగే ఐఐడిటి హాస్టల్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు.

నీ లేఖ తప్పుల తడక



కాపాడేందుకు తాను చేస్తోన్న ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. న్యాయం జరిగే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోరాటం చేస్తామన్నారు. హోదా కలిగిర రాష్ట్రాలకు ఇచ్చిన పారిశ్రామిక రాయితీలు, ప్రభుత్వ పథకాలకు ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టంలో పేర్కొన్న అంశాలను అడుగుతుంటే తమపైనే ఎదురుదాడికి దిగుతున్నారని చంద్రబాబు అన్నారు. 2016-17 సంవత్సరానికి రూ.6600 కోట్లు ఆర్థిక లోటు ఉన్నట్టు ఆర్థిక సంఘం చెప్పిందని తెలిపారు. నిధులు విడుదల చేయాలని నీతిఆయోగ్ సిఫారసు చేశాక కూడా మళ్లీ ఆ డబ్బులు తీసుకోవడం బాధాకరమన్నారు.

అన్నీ వక్రీకరణలే...రాష్ట్రానికి చేసిందేమిటి?...

అమిత్‌షా ఈ లేఖలో తనపై నిందలు వేయాలని చూశారన్నారు. అందులో పేర్కొన్నవన్నీ వక్రీకరణలేనని, ప్రతిచోటా ప్రభుత్వాన్ని తప్పుపట్టడానికే అమిత్‌షా ప్రయత్నించారని సీఎం మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చేసిందేమిటి? ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని నిలదీశారు. ప్రత్యేక హోదా అడిగితే అందుకు సమానమైన నిధులు, సాయం చేస్తామంటూ అర్ధరాత్రి ప్రకటన చేశారని సీఎం ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మిత్రధర్మానికి దెబ్బకొట్టింది మీరే...

తెలంగాణలో ఎవరిని అడిగి టీడీపీతో బీజేపీ తెగతెంపులు చేసుకుందని చంద్రబాబు ప్రశ్నించారు. మిత్ర ధర్మానికి దెబ్బకొట్టింది బీజేపీయేనన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెండు రాజ్యసభ స్థానాలు మిత్రధర్మం మేరకే ఇచ్చామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాంటిది తాను మిత్రధర్మం విషయంలో తొందరపడ్డానని అమిత్‌షా అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో తొందరపడింది బీజేపీనే అన్నారు. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రం వద్దకు తానేనాడూ వెళ్లలేదన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవమంటే లెక్కలేదా?...

తెలుగువారి ఆత్మగౌరవం అంటే కేంద్ర ప్రభుత్వానికి లెక్కలేదా? అని ప్రశ్నించారు. మిగతా రాష్ట్రాల వారికి ఆత్మగౌరవం ఉంటుంది గానీ, తెలుగువారికి ఉండదా? అన్నారు. హోదాతో సమానంగా ఇస్తామన్న ప్యాకేజీ ఏమైందని, చట్టంలో పెట్టిన అంశాలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తుంటే గుర్తించరా? అన్నారు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా లెక్కలేనితనంగా బీజేపీ వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలకు హోదా ఇచ్చినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. తొలి రోజునుంచీ ఏపీ పట్ల దురుద్దేశంతోనే ఉన్నారని, రాష్ట్రానికి మంచి చేయాలని ఒక్కరోజైనా కేంద్రం ఆలోచించలేదన్నారు. కేంద్రమే తమ వద్ద పన్నులు వసూలు చేసుకుంటోందని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని విభజించిన150 ఏళ్ల చరిత్ర కల్గిన కాంగ్రెస్‌కు రాష్ట్రంలో ఒక్కసీటు కూడా రాకుండా ప్రజలు ఓడించారనే విషయాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు.



శ్రీవారి ఆలయంలో నేడు శ్రీరామనవమి ఆస్థానం, రేపు శ్రీరామపట్టాభిషేకం

తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని తిరుమల శ్రీవారి ఆలయంలో నేడు శ్రీరామనవమి ఆస్థానం, రేపు శ్రీరామ పట్టాభిషేకం అత్యంత వైభవంగా టిటిడి నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ మరియు అర్చనను ఏకాంతంగా నిర్వహిస్తారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఉదయం 9.00 నుండి 11.00 గంటల వరకు శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసువు, చందనంలతో అభిషేకం చేస్తారు.కాగా రాత్రి 7.00 నుండి 9.00 గంటల నడుమ శ్రీ మలయప్పస్వామివారు హనుమద్వాహనంపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం రాత్రి 10.00 నుండి 11.00 గంటల నడుమ బంగారువాకిలి చెంత శ్రీ రామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. మార్చి 26వ తేదీ సోమవారంనాడు రాత్రి 8.00 గంటలకు బంగారువాకిలి చెంత ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో స్రైపర్వంగా నిర్వహించే ఈ రెండు కార్యక్రమాలలో టిటిడి ఉన్నతాధికారులు పాల్గొంటారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించే వసంతోత్సవం మరియు సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. అదేవిధంగా మార్చి 26వ తేదీ శ్రీరామపట్టాభిషేక మహోత్సవం కారణంగా వసంతోత్సవ సేవను టిటిడి రద్దు చేసింది.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో డిజిటల్ తరగతులు

- మధ్యతరగతి ప్రజలు బాగా చదువుకుని మంచి స్థితిలో ఉండాలనేదే తమ ఉద్దేశ్యం
- డిజిటల్ తరగతులను ప్రారంభించిన భువనేశ్వరి

చల్లపల్లి, మేజర్‌న్యూస్ : కంప్యూటర్ టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు చాలా అవకాశాలు వస్తున్నాయనీ, టెక్నాలజీ ద్వారా బలహీనులు బలవంతులు అవుతున్నారని, అందుకోసం కంప్యూటర్ విధ్యను ఉపయోగించుకోవాలని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం పాగోలు గ్రామంలో గల ఎన్టిఆర్ మోడల్ స్కూల్ నందు జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె విద్యార్థులను ఉద్దేశ్యంచి మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్‌లో ఉండాలి అంటే వారికి ముందుగా ఉండాల్సింది క్రమశిక్షణ, నడవడిక అని ఆమె సూచించారు. విద్యార్థులకు ప్రతి నిమిషం విలువైంది కాబట్టి ఆనిమిషాన్ని విద్యార్థులు వృధా చేయకుండా బాగా చదువుకోవాలన్నారు. మన నాలుకకు గాయమైతే మందు వేస్తే తగ్గిపోతుంది, కానీ అదే నాలుక ద్వారా మాట తేడా వస్తే ఎప్పటికీ ఆమచ్చ అలానే ఉంటుందన్నారు. మధ్యతరగతి ప్రజలలోని పిల్లలు మెడిసిన్, ఇంజనీరింగ్ చదవాలంటే చాలా డబ్బుతో కూడుకున్నందున, అలాంటి మధ్యతరగతి ప్రజలు బాగా చదువుకుని మంచి స్థితిలో ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఎన్టీఆర్ ట్రస్టును స్థాపించటం జరిగిందన్నారు. ముందుగా ఆమె కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆతరువాత విద్యార్థులు వేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ తిల కించి విద్యార్థులను అభినందించారు. బుద్ధవిహారలో బుద్ధవిగ్రహాన్నికి పూజలు చేశారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ జన్మస్థలం యైన నిమ్మకూరు ప్రాంతానికి దగ్గరలో ఉన్న చల్లపల్లి లో ఎన్టీఆర్ట్రస్టు ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదివే విద్యార్థులు అందరూ ఎన్టీఆర్ అంతటి గొప్పవారు కావాలని ఆకాంక్షిం చారు. ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూదివిసీమ ప్రాంతంలోని చల్లపల్లిలో ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఏర్పాటుచేసినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్టీఆర్ ట్రస్టు రూపకర్త నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భారత్‌దేశంలో అత్యున్నతమైన ట్రస్టు ఎన్టీఆర్ ట్రస్టుని కొనియాడారు. ట్రస్టులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.తెలుగు మహాసభలు జరిపించటంలో ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తి ఎన్టీరామారావు అని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ బి. లక్ష్మికాంతం మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అనేక సంక్షేమ పథకాలు తీసుకుని రావటం హర్షణీయమన్నారు. ప్రతి విద్యార్థి కూడా శ్రీరాముని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

చదువుకునే విద్యార్థులకు ప్రతినిమిషం విలువైంది కాబట్టి ఆనిమిషం వృధా చేయకుండా బాగా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు విద్యాతోపాటు నైపుణ్యాభివృద్ధి సాధించాలన్నారు. ముందుగా ఎన్టీఆర్ మోడల్‌ట్రస్టీ



నారా భవనేశ్వరీని ట్రస్టు ప్రతినిధులు ఉపసభాపతి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు సీఓఓ మోహనరావు, సీఇఓ విష్ణువర్ధన్, కువావే సంస్థ చైర్మన్ భావనసింగ్, డిఇఓ రాజ్యలక్ష్మి, రామ్మోహన రావు, రామారావులతోపాటు తది తరులు పాల్గొన్నారు.

'వైజ్ఞానికంగా సృజనాత్మకత అవసరం'



విజయవాడ, సూర్య బ్యూరో : వైజ్ఞానికంగా సృజనాత్మకత నేటి విద్యార్థులలో అవసరమని నల్లాని సూర్యారావు అన్నారు. నగరంలోని శ్రీ గౌతమ్ హైస్కూల్‌లో శనివారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో స్కూల్ కరస్పాండెంట్, డైరెక్టర్ నల్లాని సూర్యారావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన పిల్లలో దాగి వున్న సృజనాత్మకత బయటపడుతుందని, కొత్త ఆలోచనలతో పిల్లలు భవిష్యత్‌లో మంచి ఆలోచనలతో కూడిన విద్యార్థులుగా తయారవుతారని, శాస్త్ర విజ్ఞానం పెంపొందించుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలచే తయారు చేయబడిన నమూనాలు డైజెస్టివ్ సిస్టమ్, విజయవాడ సిటీ పార్కు, అమరావతి సిటీ, ఇండస్ట్రీ, థర్మల్ పవర్ ప్లాంట్ తదితర వైజ్ఞానిక నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తులసి, ఉపాధ్యాయులు రమాదేవి, రాంబాబు, భాషా, వెంకటేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశోధనలే దేశాభ్యున్నతికి మూలకారణం



విజయవాడ, సూర్య బ్యూరో : బాల్యం నుంచి సైన్స్ పరిశోధనల పట్ల ఆసక్తి కల్పించాలని, దానివలన నేటి విద్యార్థులే రేపటి పరిశోధకులు అవుతారని, పరి శోధనలే దేశాభ్యు న్నతికి మూలకారణం అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ జనాబ్ సికిందర్‌ఖాన్ అన్నారు. శనివారం రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ ఇన్నోవేషన్స్ అవార్డు ఫంక్షన్ డైరెక్టర్ ఎన్.వి.రావు అధ్యక్షతన జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసు నుండి పరిశోధపట్ల ఆసక్తి, ఉన్నత విద్యాలో పరిశోధనకు దోహదపడుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో భార తీయ కీర్తి ప్రతిష్టలు పెరగాలంటే పరిశోధనలే ముందుండాలని అబ్దుల్‌కలాం, ఎంఎస్. స్వామి నాథన్ లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సున్నా విలువ కనుగొన్నది భారతీయులే నని గత వైభవం తిరిగి నిలబెట్టాలన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, సాధికా, లక్ష్మి, రమేష్, ప్రదీప్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆటవిడుపుగా క్రీడలలో భాగస్వామ్యం కావాలి

స్పీకర్ కోడెల శివప్రసాదరావు

విజయవాడ, సూర్య బ్యూరో : నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఒత్తిడికి గురయ్యే ప్రజాప్రతినిధులకు ఆటవిడుపుగా ఇటువంటి క్రీడలలో భాగస్వామ్యం కావాలనే ఆలోచనతో క్రీడలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నామని శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. విజయవాడలో శనివారం ఏపీ లేజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్2018 క్రీడల్లో భాగంగా స్పీకర్ లెవన్ వెర్సెస్ సిఎం లెవెన్ క్రికెట్ క్రీడా పోటీలు స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో తొలిసారిగా ఏపీ లేజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్2018 శాసనసభ్యులకు, శాసనమండలి సభ్యుల మధ్య క్రీడా పోటీలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఇటువంటి క్రీడా పోటీలలో భాగస్వామ్యం కావడం ద్వారా మానసిక ఉల్లాసం కలగడంతో పాటు మరింతగా ప్రజాసేవ చేయడానికి ఒత్తిడి నుంచి దూరంకాగలుగుతామన్నారు. క్రీడా శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వివిధ విభాగాలలో క్రీడా పోటీలు మార్చి 24, 26 తేదిలలోను నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా 27వ తేదిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ మహిళా సభ్యులు కూడా క్రీడాంశాలలో పాల్గొనడం వారికోసం ప్రత్యేకంగా పోటీలను నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందిస్తున్నానన్నారు. సి.ఎం క్రికెట్ టీమ్‌కు కెప్టెన్‌గా కొల్లురవీంద్ర వ్యవహరించారు. ఈ బృందంలో కిదారి సర్వేశ్వరరావు, (అరకు), ఏలూరి సాంబశివరావు (పర్చూరు), గద్దె శ్రీనివాసుల నాయుడు (ఎమ్మెల్సీ), బచ్చుల అర్జునుడు (ఎమ్మెల్సీ), కత్తి నరసింహారెడ్డి (ఎమ్మెల్సీ), ద్వారపూడి జగదీశ్వర రావు, బి.ఎన్ రాజసింహులు, పి.జి.వి.ఆర్ నాయుడు (వైజాగ్ వెస్ట్), ఎ రాధాకృష్ణ (తణుకు), రామసుబ్బారెడ్డి (ఎమ్మెల్సీ), శివరామచంద్రరావు. బోడే ప్రసాద్ (పెనమలూరు), గద్దె రామ్మోహన్‌రావు (విజయవాడ తూర్పు). స్పీకర్ క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా వి.ప్రభాకర చౌదరి (అనంతపురం), ఐతబత్తుల ఆనందరావు (అమలాపురం), పాసిమ్ సునీల్ కుమార్ (గూడూరు), ఆత్తర్ చంద్ బాషా (కదిరి), గోనుగుంట్ల సత్యనారాయణ, మంతెన సత్యనారాయణ రాజు, శ్రీరామ్ రాజగోపాల్ (జగ్గయ్యపేట), ఎఎస్ రామకృష్ణ (ఎమ్మెల్సీ), పి.వి.ఎన్. మాధవ్ (ఎమ్మెల్సీ), పొంగూరు నారాయణ (మంత్రి), చిక్కాల రామచంద్ర రావు, పల్లా శ్రీనివాసరావు (గాజువాక, విశాఖపట్నం) ఎం.శ్రీనివాస్. క్రికెట్ పోటీలో భాగంగా టాస్ గెలిచి స్పీకర్ టీమ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 6 ఒవర్లలో 2 వికెట్లు కోల్పోయి 42 పరుగులు సాధించింది. అనంతరం విజయలక్ష్యం కోసం బ్యాటింగ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి లెవన్ టీమ్ 4.5 ఒవర్లలో 2 వికెట్లు కోల్పోయి 43 పరుగులను సాధించి 8 వికెట్ల తేడాతో స్పీకర్ లెవన్ పై గెలుపొందింది.



ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థ



సూర్యాపేట, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వాటి పరి తీరు అమలుపై తెలంగాణ ఎక్స్‌లేన్సీ 2018 అవార్డ్ క్రింద సూర్యాపేట జిల్లా నుండి అంగన్వాడీ ఆధునీకరణ , కేసీఆర్ కిట్, అదే విధంగా రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన జనహిత కార్యక్రమాలు అవార్డుకు తుది జాబితాలో చేర్చడం జరిగింది. ఇందులో భాగంగా పథకాల అమలుపై సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్ సంస్థ బృంద సభ్యులు జిల్లాలో పర్యటించారు. ఈ సంద ర్భంగా కలెక్టరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన జనహిత ను సెంట్రల్ టీమ్ బృందం సీనియర్ నాలెడ్జ్ మేనేజర్ ఆర్ కరుణాకర్ రెడ్డి బృంద సభ్యురాలు శ్రీజ సంద ర్శించారు. పరిశీలనలో భాగంగా జనహిత వాట్సఫ్, కాల్ సెంటర్, ఈ మెయిల్ ద్వారా ప్రజలు అర్జి పెట్టుకునే విధానం వృదా కాకుండా ఎలా లబ్ది పొందారు. అనే అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రజల యొక్క మనోగతాలని అడిగి తెలుసుకున్నారు. అనంతరము జిల్లా కలెక్టర్ కె. సురేంద్ర మోహన్ జనహిత కార్యక్రమం జిల్లాలో అమలు చేస్తున్న విదానం పరితీరుపై సెంటర్ ఫర్‌గుడ్ గవర్నెన్స్ సంస్థ బృంద సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనహిత ప్రాజెక్టు మేనేజర్ దాసరి అండ్రూ జేమ్స్, ఆరోగ్య శ్రీ అధికారి తారక్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2018 ప్రారంభం

విజయవాడ, సూర్య బ్యూరో : ఏ.పీ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్2018 పోటీలను మార్చి 24, 26 తేదిలలో నిర్వహించడం జరుగుతుంది. క్రీడాంశాలలో భాగంగా 24న పురుషుల విభాగంలో సి.యం లెవన్ వర్సెస్ స్పీకర్ లెవన్‌కు మధ్య పోటీ నిర్వహించడం జరిగింది. అదే విధంగా 24న బాడ్మింటెన్ సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీలను నిర్వహించడం జరుగుతోంది. 26వ తేదిన టెన్నిస్ (డబుల్స్), వాలీబాల్ సి.యం టీమ్ వర్సెన్ స్పీకర్ టీమ్‌కు , అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, షాట్‌పుట్ త్రో విభాగాలలో, టగ్ ఆఫ్ వార్ విభాగంలో నిర్వహించడం జరుగుతుంది. అదే విధంగా మహిళల విభాగంలో 24న బాడ్మింటన్ సింగిల్స్ మరియు డబుల్స్ విభాగంలోను, టెన్నిస్ కాయిట్ డబుల్స్ విభాగంలోను నిర్వహించడం జరిగింది. 26వ తేదిన సి.యం టీమ్ వర్సెస్ స్పీకర్ టీమ్ విభాగంలో త్రో బాల్ పోటీలను అథ్లెటిక్స్ విభాగంలో 50 మీటర్ల పరుగు, 200 మీటర్ల నడక, షాట్‌పుట్ త్రో పాటు టగ్ ఆఫ్ వార్ విభాగంలో పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఆయా విభాగాలలో పాల్గొననున్న క్రీడాకారుల వివరాలు. బాడ్మింటన్ (మహిళలు)పీతల సుజాత, ఉపలేటి కల్పన, టెన్నికోట్‌పమిడి సమ్మంతకమణి, పీతల సుజాత, ఉపలేటి కల్పన, యామిని బాలా, త్రో బాల్‌పమిడి సమ్మంతకమణి, పీతల సుజాత, ఉపలేటి కల్పన, టెన్నిస్ గద్దె శ్రీనివాసుల నాయుడు, డా.ఎ.ఎస్ రామకృష్ణ, కత్తి నరసింహా రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, పాసిమ్ సునీల్ కుమార్, బాడ్మింటన్(పురుషులు)పాలా శ్రీనివాసరావు, కిదారి సర్వేశ్వరరావు, గని వీరాంజనేయులు, ఎం.శ్రీనివాసరావు, బోడే ప్రసాద్, ఏలూరి సాంబశివరావు, బి.జయ నాగేశ్వర రెడ్డి, ద్వారపూడి జగదీశ్వరరావు, కొండపల్లి అప్పల నాయుడు, బొబ్బిలి చిరంజీవులు, పల్లె రఘునాథరెడ్డి, ఎం. వేణుగోపాలరెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పి.రామసుబ్బారెడ్డి, శ్రీరామ్ రాజ గోపాల్, గద్దె రామ్మోహన్, గద్దె శ్రీనివాసుల నాయుడు, వై శ్రీనివాసుల రెడ్డి, పి.మాణిక్యాలరావు, డా.ఎ.ఎస్ రామకృష్ణ, బండారు మాధవనాయుడు, బురుగుపల్లి శేషారావు, పి.వి.ఎన్ మాధవ్, కొండపల్లి అప్పలనాయుడు, వి. రామకృష్ణబాబు, పి.జి.వి.ఆర్ నాయుడు.అథ్లెటిక్స్ (పురుషులు) శ్రీరాం రాజగోపాల్, గద్దె రామ్మోహన్, గద్దె శ్రీనివాసుల నాయుడు, ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి (100 మీటర్లు), ఎం.వి మల్లికార్జునరెడ్డి (100 మీటర్లు), బి.సి జానార్ధనరెడ్డి (100 మీటర్లు), జి. శ్రీనివాసులు, కామినేని శ్రీనివాస్, కత్తి నరసింహారెడ్డి, జి.వి ఆంజనేయులు, బండారు మాధవనాయుడు, పి.వి.ఎన్ మాధవ్ (షాట్‌పుట్), జి.దీపక్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, బోడే ప్రసాద్. వాలీబాల్ (పురుషులు) పాలా శ్రీనివాస రావు, కిదారి సర్వేశ్వరరావు, పి.నారాయణమూర్తి, ఐతబత్తుల ఆనంద రావు, ఎం.శ్రీనివాసరావు, ఎలూరి సాంబశివరావు, పాసిమ్ సునీల్‌కుమార్, బి.జయ నాగేశ్వరరెడ్డి, ఆత్తార్ చాంద్‌బాషా, గద్దె శ్రీనివాసులు నాయుడు, బొబ్బిలి చిరంజీవులు, పల్లె రఘునాథరెడ్డి, మంతెన వెంకట సత్యనారాయణ రాజు, శ్రీరామ్ రాజగోపాల్, గద్దె రామ్మోహన్, కత్తి నరసింహారెడ్డి, టగ్ ఆఫ్ వార్ (పురుషులు) ఐతబత్తిన ఆనందరావు, గని వీరాంజనేయులు, ఎం. శ్రీనివాస రావు, బోడే ప్రసాద్, ఎలూరి సాంబశివరావు, కొమ్మలపాటి శ్రీధర్, గద్దె శ్రీనివాసుల నాయుడు, జి.శ్రీనివాసులు, ఎ.ఎస్. రామకృష్ణ, కత్తి నరసింహారెడ్డి, జి.వి.ఆంజనేయులు, ఫిలిప్ సి టోచర్, బురుగుపల్లి శేషారావు, పి.వి.ఎన్ మాధవ్, జి.దీపక్ రెడ్డి, బి.ఎన్ రాజసింహు లు. టగ్ ఆఫ్ వార్‌పీతల సుజాత, ఉపలేటి కల్పన, డి.ఎ సత్యప్రభ, కిమిడి మృణాళిని, కొల్లా లలీతా కుమారి, పిల్లా అనంతలకీ, గుండా లకీదేవి, తంగిరాల సౌమ్య, మీసాలా గీతా, బి. యామిని బా. అథ్లెటిక్స్ జి.సంధ్యారాణి, (షార్ట్‌పుట్), పీతల సుజాత, ఉపలేటి కల్పన, తంగిరాల సౌమ్య, (షాట్‌పుట్), మీసాలా గీతా (200 మీటర్ల వాక్), బి.యామిని బా (200 మీటర్ల వాక్) తదితరులు పాల్గొన్నారు.



ఐదు పద్దులకు ఏకగ్రీవ ఆమోదం



వెలగపూడి, సూర్య ప్రతినిధి : వార్షిక బడ్జెట్‌కు సంబంధించి పలు శాఖలకు చెందిన ఐదు పద్దు లకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. 2018 - 19 సంవత్సరానికి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల నిర్వహణకు రూ. 3,200 కోట్లు కేటాయించా లని కోరుతూ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ప్రవేశపెట్టిన పద్దును సభ ఏకగ్రీవంగా ఆమో దించింది. ఆబ్కారీ శాఖ నిర్వహణకు రూ. 450 కోట్లు కేటాయించాలని కోరుతూ ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్, హోం, విపత్తుల నిర్వహణకు రూ.6,226 కోట్లు కేటాయించాలని కోరుతూ మంత్రి చినరాజప్ప వేర్వేరుగా ప్రతిపాదించిన పద్దులకు సభ ఆమోదముద్ర వేసింది. అదేవిధంగా వాణిజ్య పన్నులశాఖ, రవాణాశాఖ ప్రవేశపెట్టిన మరో రెండు పద్దులపై చర్చ అనంతరం సంబంధిత మంత్రులు చేసిన ప్రతిపాదనలను సభ ఏకగ్రీవంగా ఆమోదిం చింది. ఎమ్మెల్యేలు రామానాయుడు, సూర్యారావు, రాధాకృష్ణ, చాంద్ బాషా, జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యాపారాల్లో రాణించాలి



సూర్యాపేట అర్బన్, మేజర్‌న్యూస్: నిరుద్యోగ యువత వ్యాపార రంగాల్లో రాణించాలని మార్కెట్ కమిటి చైర్మెన్ వె. వెంకటేశ్వర్లు, టిఆర్ఎస్ జిల్ల నాయకులు గండూరి ప్రకాష్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంజీ రోడ్డులో గల బ్రాండెడ్ డెనిమ్స్ షాపును ప్రారంబించి మాట్లాడారు. దిన దిన అభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రంలో అనేక వ్యాపార సంస్థలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చల్లమల్ల నర్సింహా, నాయకులు గొడ్డేటి సైదులు, రౌతు నర్సింహారావు, వెంకన్న నాయక్, నాగు నాయక్, రవీందర్, లచ్చిరాం నాయక్, చందూనాయక్, షాపు యజమాని భాస్కర్‌నాయక్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

సూర్యాపేట, మేజర్‌న్యూస్: జిల్లాలో పదోతరగతి పరీక్షలలో భాగంగా శనివారం నిర్వహించిన బయోలజీ పేపర్ పరీక్షకు 14733 మంది విద్యార్థులకు గాను 14582 మంది విద్యార్థులు హాజరుకాగా 151 మంది విద్యార్థులకు గాను 14582 మంది విద్యార్థులు హాజరుకాగా 151 మంది విద్యార్థులు గైరాజరైనారని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజెట్లీ ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు రోజులనుండి ఎండలు ఎక్కువగా వున్నందున పరీక్షలకు వచ్చే విధ్యార్థుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ సూచించారని అన్నారు.

తుంబురుతీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల జెఈఓ కె.ఎస్. శ్రీనివాసరాజు

తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : పాల్గుణ మాస మున ఉత్తరఫల్గుణీ నమక్షంతో కూడిన పూర్ణిమినాడు ఈ నెల 31న తిరుమలలోని వివిధ ప్రముఖ తీర్థాల్లో ఒకటైన తుంబురు తీర్థ ముక్కోటి జరుగనున్న నేపథ్యంలో అందుకు విశేష సంఖ్యలో విచ్చేసే భక్తులకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుమల జెఈవో కె.ఎస్. శ్రీనివాసరాజు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సాయంత్రం తుంబురు తీర్థ ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈవో మాట్లా డుతూ తుంబురు తీర్థ ముక్కోటికి ఈనెల 30వ తేదీ ఉదయం నుండి భక్తు లను అనుమతించనున్నట్లు తెలిపారు. అంతకుముందు భక్తులను అనుమతించరని వివరించారు. గత ఏడాది దాదాపు 30 వేల మందికి పైగా భక్తులు విచ్చేసా రన్నారు. ఈ ఏడాది కూడా విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నం దున టిటిడి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికా రులను ఆదేశించారు. అందులో భాగంగా భక్తులందరికి రెండు లక్షల తాగునీరు ప్యాకెట్లు, 50వేల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. టిటిడి అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో 30వ తేది ఉదయం 10.00 గంటల నుండి భక్తులకు పులిహోరా, పెరుగన్నం ప్యాకెట్లు భక్తులకు అందించాలని అన్నప్రసాదం అధికారులను ఆదేశించారు. ముందుగానే ఈమేరకు ఒక భక్తుడికి రెండు పులిహోరా ప్యాకెట్లు, ఒకపెరుగన్నం ప్యాకెట్టు, నాలుగు త్రాగునీరు ప్యాకెట్లు, రెండు మజ్జిగ ప్యాకెట్లు ఒక సంచిలో వేసి అందివ్వాలని ఆయన సూచించారు. భక్తులు భోజనం చేసేందుకు వీలు గా అవసరమైన షెడ్లు, మార్గమధ్యలో నిచ్చెనలు, పాపావినా శనం నుండి 4 కిలోమిటర్ల వరకు త్రాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారుల ఆదేశించారు. అదేవిధంగా భక్తులకు ఇబ్బంది లేకుండా అవసరమైన సమాచార బొర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా టిటిడి రేడియో అండ్ బ్రాడ్ కాస్టింగ్ ద్వారా ఎటువంటి వంట సామగ్రిని అనుమతించరని తెలియచేసేందుకు ఏర్పాట్లు చేయాలని, మార్గ మధ్యలో భక్తులకు ఇబ్బంది లేకుండా సోలార్ లైట్లు, రోప్‌లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మామండూరు, కుక్కల దొడ్డి మార్గాల నుండి వచ్చే భక్తులు ఎటు వంటి వంట సామగ్రి అనుమతించరాదని పోలీసు శాఖ, అటవీశాఖ అధికా రులకు సూచించారు. తుంబురు తీర్థం వద్ద పారిశుద్ధ్యానికి ప్రాముఖ్యం ఇవ్వాలని అందుకు అనుగుణంగా అదనపు సిబ్బందిని ఏర్పాటు చెయ్యాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పోలీసుశాఖ, అటవీశాఖ మరియు టిటిడి విజిలెన్స్ సమన్వయంతో పాపవినాశనం నుండి తుంబురు తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు అందు బాటులో ఉండేందుకు వీలుగా రెండు అంబులెన్స్‌లను, పారా మెడికల్ సిబ్బందిని అవసరమైన మందులు అందు బాటులో ఉంచు కోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని విభాగాలవారు సమన్వయంతో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. 26న అన్ని విభాగాలతో కూడిన అధికారుల బృందం తుంబురు తీర్థాన్ని పర్యటించి ముందస్తుగా చేయవలసిన ఏర్పాట్లును చూసుకోవాలని సూచించారు.

31న తుంబురు తీర్థ ముక్కోటిలో పాల్గొనడానికి ఒకరోజు ముందే భక్తులు తీర్థాన్ని చేరుకొనే అవకాశం ఉంది కనుక ఈ ఏర్పాట్లన్నీ 29 కల్లా పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు. తుంబురు తీర్థ ముక్కోటికి విచ్చేసే భక్తులు అటవీ ప్రాంతాన్ని కాపాడాలని జెఈవో విజ్ఞప్తి చేశారు. అనంతరం జెఈవో సమయ నిర్దేశిత సర్వదర్శనంపై ఐటి, టిసిఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.ఇ.2 రామచంద్రారెడ్డి, జియం ట్రాన్స్‌పోర్టు శేషా రెడ్డి, విఎస్‌వో రవీంధ్రరెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఆరోగ్య విభాగం అధికారిణి శర్మిష్ఠ, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి వేణుగోపాల్, క్యాటరింగ్ అధికారి శాస్త్రీ, ఇతర విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

విషపు కోరల్లో వస్రాం తండా



సూర్యాపేట కలెక్టరేట్, మేజర్‌న్యూస్: సువెన్ లైఫ్ సైన్స్‌స్ పరిశ్రమ విస్తరణ కోసం 22 గురువారం నాడు శాంతి నగర్ వద్ద నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ పూర్తా అసంబద్ధంగా జరిగినదని పరిశ్రమ విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ విషయమై గ్రామస్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వ కుండా నిర్వహించే ప్రయత్నం చేశారు. ఇట్టి విషయం గ్రామస్తులకు తెలిసి అక్కడివారిని పోలీసులు అరెస్టు చేసి ఇతం పోలీసు స్టేషన్లకు తరలించారు. శాంతియుతంగా జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణలో భారీగా పోలీసు బలగాలు మోహరించి గ్రామస్తులను బయ భ్రాంతులకు గురిచేసి. సూర్యాపేట డియస్‌పీ ఆధ్వర్యంలో 4 సర్కిల్ ఇన్సస్పెక్టర్లు, జిల్లాలోని 10 మంది సబ్ ఇన్స్‌పెక్టర్లు, స్పెషల్ పార్టీ పోలీసులతో సుమారుగా ప్రతి నలుగురికి ఒక పోలీసు చొప్పున మోహరించి ఒక బహిరంగ సభను తలపించే విధంగా గ్రామస్తుల అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించకుండా ముందస్తు అరెస్టులు చేయడంతో పాటు అక్కడికి వచ్చిన వారినికూడా మాట్లాడకుండా పోలీసులు వత్తిడి చేస్తూ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడించనీయలేదు. దీనితో భయ కంపితులై గ్రామానికి చెందిన అనేక మంది అభిప్రాయం చెప్పకుండానే భయంతో వెనుదిరిగి పోయారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ. జగన్‌లాల్ ప్రజాభి ప్రాయ సేకరణ ప్రారంబించగానే పరిశ్రమకు అనుకూలంగా ఉండే వారు ప్రారంభించారు. భయానికి గురైన గ్రామస్తులు మాట్లాడాటానికి వెనుకంజ వేయగా పరిశ్రమ వారు జెసి పిసిబిఇఇ పరిశ్రమ ఉద్యోగులు అభిప్రాయాలు చెప్పవద్దని పదే పదే చెప్పినప్పటికి దాసాయి గూడెం గ్రామంతో సంబందం లేని ఇతర ప్రాంతాల నుండి తీసుకొచ్చిన వారి నుండి పరిశ్రమ ఉద్యోగలు నుండి అభిప్రాయాలు చెప్పించి ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో సిరి కొండ నాగరాజు, సిహెచ్ సునిల్ రెడ్డి, బి. మహేష్, దాసాయి గూడెం, వస్రాం తండా గ్రామస్తులు పాల్గొని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

వేడుకగా శ్రీ కోదండరాముడి చక్రస్నానం

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తిరుపతి, సూర్యప్రతినిధి : తిరుపతిలోని శ్రీ కోదండ రామస్వామివారి వార్షిక వసంతోత్సవ బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నానం (అవభృథోత్సవం) నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ముందుగా ఉదయం 7 గంటలకు లక్ష్మణ సమేత సీతా రాముల వారు పల్లకిలో కపిలతీర్థానికి వేంచేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వేణుగోపాలస్వామివారి ఆలయ మండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, నెయ్యి, పండ్ల రసాలతో అభిషేకాలు అందుకుని ప్రసన్నులయ్యారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు స్వామివారు శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలోని పి.ఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం 4 గంటలకు అక్కడినుండి బయలుదేరి తీర్థకట్ట వీధి, కోటకొమ్మల వీధి, కొత్తవీధి మీదుగా శ్రీకోదండరామాలయానికి చేరుకున్నారు. మధ్యలో శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం, శ్రీవైఖాన సాచార్యుల ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7.30 నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

సాంస్కృతిక కార్యక్రమాలు : తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ఉదయం 6 నుండి 7 గంటల వరకు ఎస్.వి.సంగీత, నృత్య కళాశాల వారిచే మంగళధ్వని, ఉదయం 7 నుండి 8 గంటల వరకు ధర్మగిరి వేద పాఠశాల ఆధ్వర్యంలో వేదపారాయణం నిర్వహించారు.



2020 కల్లా క్షయ నిర్మూలన

- వ్యాధిగ్రస్థులకు నెలనెలా రూ. 500
- పర్యవేక్షణ కోసం సూపర్‌వైజర్లకు 725 ట్యాబ్‌లు
- వ్యాధి నివారణకు బెడాక్విలైన్ మెడిసిన్ పంపిణీ
- అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

వెలగపూడి, సూర్య సచివాలయ ప్రతినిధి : 2020 కల్లా క్షయను రాష్ట్రం నుంచి క్షయను తరిమికొట్టేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శనివారం శ్రీకారం చుట్టారు. వ్యాధి నిర్మూలనకు, రోగులకు అత్యుత్తమ చికిత్సకు సంబంధించి వివిధ పథకాలను ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రతి క్షయ వ్యాధిగ్రస్తునికి పోషకాహారం కోసం డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) కింద ఇక నుంచి నెలనెలా రూ. 500 అందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

ఒక్కో రోగికి రూ. 15 లక్షలు ఖర్చు

మొండి వ్యాధిని కూడా నయం చేసే బెడాక్విలైన్ మెడిసన్ ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇందుకోసం ఒక్కో రోగికి రూ. 15 లక్షల వరకు ఖర్చు భరించనుంది. వ్యాధిగ్రస్తులకు పూర్తిగా నయమయ్యేవరకు వారి ట్రాక్ పరిశీలనకు రాష్ట్ర వ్యాప్తంగా 725 మంది ఫీల్డ్ సూపర్‌వైజర్లకు ట్యాబ్‌లు అందిస్తోంది. మొత్తం మీద రాష్ట్రంలో క్షయ నివారణకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 78 కోట్లు ఖర్చు చేయనుంది.

ప్రతీ గ్రామంలో ట్రీట్మెంట్ సపోర్ట్ సెంటర్

ఎండ్ టీబీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో టీబీ వ్యాధిగ్రస్తుల కోసం ట్రీట్మెంట్ సపోర్ట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించడం, చికిత్స అందేలా చూడటం ఈ సెంటర్ల విధిగా పేర్కొన్నారు. అలాగే 234 సీహెచ్‌సీల్లో టీబీ యూనిట్లు సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని మొత్తం 610 సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులలో కఫం తనిఖీ కేంద్రాలు నెలకొల్పుతున్నామని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. క్షయను గుర్తించే అత్యాధునిక వ్యాధి నిర్ధారణ (సీపీ న్యాట్) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో 65వేల మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నట్టు గుర్తించి, చికిత్స అందిస్తున్నామని, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందేవారితో కలుపుకుంటే ఈ సంఖ్య లక్ష వరకు ఉండవచ్చని అన్నారు. వీరందరిని నిక్షయ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తామని చెప్పారు.


ప్రైవేట్ ఆస్పత్రిలోనైనా నమోదు తప్పనిసరి

ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందే వారి వివరాలను సైతం తప్పనిసరిగా ప్రభుత్వానికి తెలియజేసేలా ఆదేశాలు జారీచేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. దీంతో వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా టీబీ మందులు విక్రయించకుండా చూడాలని చెప్పారు.



ప్రభుత్వం తీసుకున్న తాజా చర్యలతో ఈ ఏడాదిలో 30శాతం నుంచి 40 శాతం వ్యాధిగ్రస్తులకు పూర్తిగా నయం చేయ గలుగుతామని ముఖ్యమంత్రితో అధికారులు అన్నారు. క్షయ వ్యాధి నివారణపై ప్రజా చైతన్యానికి రూపొందించిన కరపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ సమయంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ ఎస్ అరుణ కుమారి, రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ అధికారి టి రామారావు ఉన్నారు.


సీఎం చంద్రబాబుకు అమిత్ షా 9 పేజీల లేఖ



అమరావతి, సూర్య ప్రతినిధి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన ఆయా ప్రాజెక్టుల వివరాలను మొత్తం 9 పేజీల్లో ఓ లేఖ రూపంలో బీజేపీ జాతీయ అధ్య క్షుడు అమిత్‌షా ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కు పంపారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సాయం చేసిందని ఆ లేఖలో అమిత్‌షా పేర్కొన్నారు. అలాగే ఏపీకి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామని, 3 ఎయిర్‌పోర్టులను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా మార్చామన్నారు. కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు కేటాయించామని, ఏపీకి కేంద్ర విద్యాసంస్థలు, ఎయిమ్స్ నెలకొల్పామని ఆ లేఖలో అమిత్‌షా వివరించారు. అంతేగాక మెట్రో రైల్ నిర్మాణానికి సూత్రప్రాయంగా కేంద్రం అంగీకారం తెలిపిందని కూడా అమిత్‌షా తెలిపారు. ఇదిలా ఉండగా ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు రావడం ఏకపక్షంగా నిర్ణయంగా భావిస్తున్నానని, అలాగే మీరు తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగించిందంటూ ఆ లేఖలో చంద్రబాబునుద్దేశించి అమిత్ షా పేర్కొన్నారు. కాగా ఎన్డీయే నుంచి బయటికి వస్తూ కేంద్రానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఓ లేఖ రాశారు. ఆ లేఖకు ఇప్పుడు అమిత్ షా 9పేజీల ప్రతిలేఖను పంపారు.

బడ్జెట్‌పై చర్చించకుండా ఆమోదించడం ఇదే ప్రథమం

మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్



గుంటూరు, సూర్య ప్రతినిధి : బడ్జెట్‌పై చర్చ జరపకుండా ఆమోదించడం ఇదే ప్రథమమని శాసనసభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంపై చర్చకు అంగీకరిస్తే తమ ఎంపీలు కూడా ప్రశ్నిస్తారని బీజేపీ పెద్దలు భయపడుతున్నారని, అందుకే అవిశ్వాస తీర్మానంపై చర్చకు అంగీకరించడం లేదన్నారు. అలాగే పార్లమెంటరీ వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగజారుస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ ప్రారంభించిన లోకేష్



తిరుపతి, సూర్య ప్రతిధి : ఐఐడిటి గ్రాడ్యుయేషన్ డే, ఏపిఐటిఏ మెగా జాబ్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో శనివారం ఏపీ ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. తిరుపతి, విశాఖపట్నం లో మార్చ్ నెలలో ఏపిఐటిఏ ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబ్ ఫెయిర్ లో 23,259 విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీలో 15,770 మంది ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఇందులో 2209 మంది విద్యార్థులు షార్ట్ లిస్ట్ అయ్యారు. వారిలో 2037 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. 816 మందికి ఐటీ ఉద్యోగాలు, 1221 మందికి ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్ ఉద్యోగాలు లభించనున్నాయి. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఆఫర్ లెటర్స్‌ను మంత్రి నారా లోకేష్ అందించారు. ఏపిఐటిఏ రూపొందించిన లీప్ (లుక్ ఫర్ ఎంప్లాయిస్ ఇన్ ఆంధ్రప్రదేశ్) బ్రోచర్ ను ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. సమక్షంలో ఉద్యోగాల కల్పన కోసం ఏపిఐటిఏ,వీఎం వేర్,యూత్ ఫర్ జాబ్స్ కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. సైబర్ సెక్యూరిటీ పై హ్యాకథాన్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు.

లాలూచీ రాజకీయాలు తెలియవు




- ఇంకా రెండు రోజులే సభ
- పోరాటం ఉద్ధృతం చేయాలి
- ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : విజయసాయిరెడ్డి పీఎంవోలో చేసిందేమిటి?, మీడియా కంటబడకుండా ఎందుకు దాక్కున్నారు? మీలాగా మాకు లాలూచీ రాజకీయాలు తెలియదు. కేసుల మాఫీ అవసరం మీ కుంది గాని మాకు లేదని వైసీపీ నేతలనుద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అభివృద్ధి చెందే రాష్ట్రాలను బలహీనపరచ రాదని, పీఎంవో చుట్టూ విజయసాయిరెడ్డి ప్రదక్షిణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సుజనా చౌదరిపై దుష్ప్రచారం చేస్తున్నా రన్నారు. నిన్నటిదాకా మిత్రపక్షంగా ఉన్నామని, అయినా కేంద్రప్రభుత్వం న్యాయం చేయలేదని, అందుకే విభేదించి బయటకు వచ్చామని, ప్రజల తరసున పోరాడుతున్నామని చంద్రబాబు అన్నారు. పార్లమెంట్‌లో జరుగు తున్న పరిణామాలపై ఢిల్లీలో ఉన్న ఎంపీ లతో సీఎం చంద్రబాబునాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా రెండు రోజులే సభ జరిగే అవకాశముందని, ఈ నేపథ్యంలో మన పోరాటం మరింత ఉధృతం చేయాలని ఎంపీలకు సూచిం చారు. అలాగే ఏపీ ప్రయోజనాలు కాపాడాలని, ప్రజల హక్కు లు పరిరక్షించాలన్నారు. సభ లేనప్పుడు ఎక్కడికక్కడ ప్రజల్లోకి వెళ్ళాలన్నారు. అలాగే రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి చెప్పాలన్నారు.

ఆపరేషన్ ద్రవిడపై చర్యలు తీసుకోండి

డీజీపీకి మాజీ మంత్రి మాణిక్యాలరావు ఫిర్యాదు



అమరావతి, సూర్య ప్రతినిధి : సినీనటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని మాజీ దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కోరారు. ఈమేరకు ఆయన రాష్ట్ర డీజీపీని కలిశారు. ఈ సందర్భంగా శివాజీ రిలీజ్ చేసిన ఆపరేషన్ ద్రవిడ వీడియోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ మాలకొండయ్యకు వినతిపత్రం ఇచ్చారు. అంతేగాక శివాజీ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఆయన డీజీపీని కోరారు.

దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల భేటీకి యనమల



అమరావతి, సూర్య ప్రతినిధి : దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల భేటీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వివరించారు. ఈ భేటీకి వెళ్లేందుకు ఆయన సీఎం అనుమతి కోరారు. దీనికి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే కేరళ రాష్ట్ర ఆర్థికమంత్రి ఫోన్ చేయడాన్ని కూడా సీఎంకు యనమల వివరించారు. పథకాలకు కేంద్ర నిధుల మంజూరులో 2011 జనాభా ప్రామాణికతపై తీవ్ర వ్యతిరేకత వస్తోందని, 2011 జనాభాకు 10శాతం వెయిటేజీ ఇవ్వడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని, కుటుంబ నియంత్రణ పాటించినందుకు గతంలో ప్రోత్సాహకాలుండేవని, జనాభా నియంత్రణలేని రాష్ట్రాలకిప్పుడు అధిక నిధులిస్తున్నారని సీఎంతో యనమల పేర్కొన్నారు.

అవినీతికి పట్టిసీమ పరాకాష్ట

బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు



అమరావతి, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతికి పట్టిసీమ ప్రాజెక్టు పరాకాష్ట అని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ జన్మభూమి కమిటీలన్నీ అవినీతిమయమై పోయాయన్నారు. 27 మండలాల్లో బాత్ రూములు కట్టకుండా కట్టినట్లు చూపారని, నరేగా నిధులు కూడా పక్కదారి పడుతున్నాయని వీర్రాజు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో పాలన గాడి తప్పుతోందని, ఎమ్మెల్యేలను అదుపులో పెట్టే పరిస్థితి కూడా లేదన్నారు.

టీడీపీ అంటే తెలుగు డ్రామా పార్టీ

తెలుగుదేశం పార్టీపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన అమరావతిలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అంటే తెలుగు డ్రామా పార్టీ... అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేగాక అవినీతిని కిందిస్థాయికి తీసుకెళ్లిన పార్టీ టీడీపీ ఒక్కటేనన్నారు. నీరు-చెట్టు పథకంలో మట్టిని అమ్ముకున్నారు..., రాష్ట్రంలో పాలన గాడి తప్పుతోంది..., ఎమ్మెల్యేలను అదుపులో పెట్టే పరిస్థితి కూడా లేదు.. అని వీర్రాజు అన్నారు. అలాగే పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో ఉన్న మెకానిజం ఏంటి అని, స్పిల్ వే పనులకు రూ.1400కోట్లు ఎందుకు ఖర్చు అయిందో చెప్పాలన్నారు. మట్టి తీయడానికే రూ.67కోట్లు ఇచ్చారని, మెయిన్ కెనాల్‌లో కలపడానికి పంపుసెట్లకే రూ.817కోట్లు వెచ్చించారని వీర్రాజు పేర్కొన్నారు.

రూ. 25 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి



గుంటూరు, సూర్య ప్రతినిధి : కొమ్మమూరు కాలువపై చేబ్రోలు మండల పరిధిలో శిథిలమైన వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గుంటూరు - బాపట్ల- చీరాల రహదారిపై 15/8 కి.మీ. వద్ద ఉన్న ఈ వంతెనకు ఒక వైపున ఐరన్ గడ్డర్స్ తుప్పుపట్టి కూలిపోయాయి. దాంతో గత ఏడాది బ్రిడ్జిపై వన్‌వే ట్రాఫిక్‌ని అమలుచేశారు. ఆ తర్వాత స్వల్పంగా మరమ్మతులు నిర్వహించి వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. ఇది ఎప్పటికైనా కూలిపోయే వంతెన కావడంతో ప్రస్తుత వేసవి సీజన్‌లోనే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం రోడ్లు, భవనాల శాఖని ఆదేశించింది. ఇందుకు కోర్ నెట్ ప్లాన్ స్కీం కింద రూ.25 కోట్లకు పరిపాలన అనుమతి ఇచ్చింది. ఆర్‌అండ్‌బీ అధికారులు త్వరలోనే టెండర్లు నిర్వహించి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతారు. ఐడబ్ల్యూఏఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నాలుగు వరసలు, సెంట్రల్ డివైడర్‌తో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తారు. జలరవాణా ప్రాజెక్టులో కొమ్మమూరు కాలువ ఉన్న దృష్ట్యా కాలువ ఎఫ్‌ఎస్‌ఎల్ నుంచి ఎనిమిది మీటర్ల ఎత్తులో నిర్మిస్తారు. దీనివల్ల భవిష్యత్తులో పడవల రాకపోకలకు ఇబ్బంది ఉండదు.

కౌలు రైతులను ఆదుకోవాలి

- అన్నదాతల ఆత్మహత్యలను నివారించాలి
- రైతుల కుటుంబాలకు అండగా నిలవాలి
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్



అమరావతి, సూర్య ప్రతినిధి : జిల్లాలో కౌలు రైతులను అన్నీ విధాలుగా ఆదుకోని, రైతుల ఆత్మహత్యలను నివారించాలని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా గత మూడేళ్ల నుంచి రైతన్నలు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రుణ సదుపాయం సక్రమంగా అందడం లేదన్నారు. దీంతో అధిక పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసి నష్టాలు మూటగట్టుకున్నారన్నారు. ప్రభుత్వ గణంకాల ప్రకారం ఈ మూడేళ్ల కాలంలో ప్రకాశం జిల్లాలో 39 మంది రైతులు మృతి చెందినట్లు తెలిపారు. జిల్లాలో కౌలు, చిన్న, సన్నకారు రైతుల బాధలు వర్ణనాతీతం. జిల్లాలో సుమారు లక్షా 50 వేలు కౌలు రైతులు ఉంటే, 20 వేలు మందికే గుర్తింపు కార్డులు ఇచ్చారన్నారు. మిగిలిన వారికి గుర్తింపు కార్డులు ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతో రుణ సదుపాయం, ఇన్‌పుట్ రుణాలు, ప్రభుత్వ రాయితీలు ఆ రైతన్నలకు అందని పరిస్థితి. ప్రకృతి విపత్తులు సంభవించినట్లు ప్రభుత్వ నుంచి అందాల్సిన నష్టపరిహారం కూడా అందడం లేదన్నారు. దీంతో అధిక వడ్డీలు తీసుకోని సాగు చేసి తీవ్ర నష్టాలు మూటగట్టుకున్నారన్నారు. దీంతో ఆర్థిక పరిస్థితులు తట్టుకోక అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతన్నల వివరాలను కూడా ప్రభుత్వం సేకరించలేకపోతోందన్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో సుమారు జిల్లాలో 119 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ప్రభుత్వం మాత్రం 39 మంది చనిపోయినట్లు ప్రకటించారు. చనిపోయిన రైతులను గుర్తింపులో కూడా నిర్లక్ష్యం ప్రదర్శించడం దారుణమన్నారు. చనిపోయిన రైతులకు జీవో 62 ప్రకారం రూ 5 లక్షలు నష్టపరిహారం ఇస్తున్నారన్నారు.

కానీ రైతు ఆత్మహత్య చేసుకుంటే త్రీ మ్యాన్ కమిటి పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలి. ఆర్డీవో కాని, డీఎస్పీ, జిల్లా స్థాయి అధికారి, వ్యవసాయ శాఖ ఏడిలు పర్యవేక్షించాలి. కాని అలా కాకుండా ఎస్ఐ స్థాయి వారి నుంచి నివేదిక తీసుకోవడం వలన రైతులు చనిపోయినా గుర్తింపు లేకుండా పోతోందన్నారు. చనిపోయిన రైతుల కుటుంబాలను కూడా ప్రభుత్వం అన్నీ విధాలుగా ఆదుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అసెంబ్లీలో రైతన్నల సమస్యలు ప్రస్తావించారు.

ఏవోబీలో మావోయిస్టుల బహిరంగసభ



విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : ఆంధ్రా - ఒడిశా సరిహద్దులో నిషిద్ధ మావోయిస్టులు బహిరంగ సభను నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సభకు సరిహద్దులోని దాదాపు 20 గ్రామాలకు చెందిన గిరిజనులు హాజరైనట్లు సమాచారం. ఈ సందర్భంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 87వ వర్ధంతి సందర్భంగా వారికి మావోయిస్టు నేతలు ఘనంగా నివాళి అర్పించినట్లు తెలుస్తోంది. కాగా... ఈ బహిరంగసభకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన సభ్యులు హాజరైనట్లు తెలుస్తుండగా సభకు హాజరైన గిరిజనులకు మావోయిస్టులు పలురకాల సామాగ్రిని పంపిణీ చేసినట్లు సమాచారం.

బీజేపీ అంటే భారతీయ జోకర్ల పార్టీ


టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



వెలగపూడి, సూర్య ప్రతినిధి : బీజేపీ అంటే భారతీయ జోకర్ల పార్టీ అని టీడీపీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్రయాదవ్ పేర్కొన్నారు. శనివారం అమరావతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలిలో పట్టిసీమపై చర్చ జరిగిన సమయంలో సోము వీర్రాజు ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. ఆయనకు దమ్ముంటే టీడీపీ వల్ల వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి మాట్లాడాలని రవిచంద్ర అన్నారు. బీజేపీ- టీడీపీకి గ్యాప్ రావడానికి సోము వీర్రాజే కారణమని, రాష్ట్ర ప్రభుత్వం మీద నిత్యం కేంద్రానికి ఫిర్యాదు చేస్తూ సోము వీర్రాజు నిధులు రాకుండా చేసాడన్నారు. వైసీపీతో వీర్రాజు చేతులు కలిపి ఏపీకి అన్యాయం చేస్తున్నారని, పట్టిసీమలో అవినీతి జరిగింది అంటే రైతులే బీజేపీని ఉరి తీస్తారని రవిచంద్ర పేర్కొన్నారు. నిరవ్‌మోడీ, లలిత్‌మోడీ, విజయ్ మాల్యా కుంభకోణాలపై విచార ణకు కేంద్రం సిద్ధమా అంటూ ప్రశ్నించారు.

బీజేపీ అంటే బ్రేక్ జనతా ప్రామిసెస్

సోము వీర్రాజుపై టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఫైర్



అమరావతి, సూర్య ప్రతినిధి : బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఫైర్ అయ్యారు. శనివారం అమరావతిలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అంటే బ్రేక్ జనతా ప్రామిసెస్ అన్నారు. సోము వీర్రాజు మా వల్ల గెలిచి మా పార్టీ పైనే విషం చిమ్ముతున్నారని, మా వల్ల గెలిచిన ఎమ్మెల్సీ పదవిలో ఎందుకు కొనసాగుతున్నారని వెంకన్న అన్నారు. పట్టిసీమ మోడల్‌ను దేశమంతా అధ్యయనం చేస్తోందని, కాంట్రాక్టర్లను సోము వీర్రాజు బెదిరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. లోకసభకు సోము వీర్రాజు పోటీచేస్తే 10లక్షల ఓట్లలో 7250 ఓట్లు వచ్చాయని అది గుర్తుంచుకోవాలని బుద్ధా వెంకన్న అన్నారు.

వైభవంగా ఒంటిమిట్ట కోదండరామస్వామివారి

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


తిరుపతి, సూర్య ప్రతినిధి : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 25 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగనుంది. ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 4 నుండి 6 గంటల వరకు మూలవర్లకు న్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. రాత్రి 8 నుండి 10 గంటల వరకు అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహిస్తారు.

మార్చి 25న ధ్వజారోహణం :

మార్చి 25న ధ్వజారోహణంతో ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.03 గంటలకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది. సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం, రాత్రి 8 నుండి 9.30 గంటల వరకు శేష వాహనసేవ జరుగనున్నాయి. ప్రతిరోజూ రాత్రి 8 నుండి 9.30 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 25న శ్రీరామనవమి, మార్చి 26న హంస వాహనం, మార్చి 27న సింహ వాహనం, మార్చి 28న హనుమంత వాహనం, మార్చి 29న గరుడవాహన సేవలు జరగనున్నాయి. మార్చి 30వ తేదీ రాత్రి 8 నుండి 10 గంటల వరకు సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగనుంది. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. మార్చి 31న రథోత్సవం, ఏప్రిల్ 1న అశ్వవాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించనున్నారు. ఏప్రిల్ 2న ఉదయం చక్రస్నానం, సాయంత్రం 5.30 గంటలకు ధ్వజావరోహణం ఉత్సవాలు ముగియ నున్నాయి. ఏప్రిల్ 3న సాయంత్రం 5 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహి స్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు :



ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మార్చి 25 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగ నున్నాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఎస్వీ సంగీత నృత్య కళా శాల ఆధ్వర్యంలో మంగళధ్వని, ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ధార్మికోపన్యాసం, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఊంజల్‌సేవలో భక్తి సంగీతం, రాత్రి 7 నుండి 8 గంటల వరకు హరికథ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మార్చి 25న శ్రీరామనవమి సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం నిర్వహిస్తారు. ఏప్రిల్ 30న కల్యాణోత్సవం సందర్భంగా సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు శ్రీమతి మండా సుధారాణి, శ్రీమతి వందన, సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శ్రీ చైతన్య సోదరులు గాత్ర సంగీత కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి 8 నుండి 10 గంటల వరకు శ్రీ దీవి హయగ్రీవాచార్యులు, శ్రీ కడిమెళ్ల వరప్రసాద్, శ్రీబి.వి.నరసింహదీక్షితులు కల్యాణోత్సవానికి ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తారు.




ఆయుష్



చివరి వరకూ పెరిగే అవయవం

కాలేయం


అప్పట్లో విజ్ఞానవేత్తల అంచనాలకు అందకుండా ఉండేది కాలేయ పనితీరు. బాబిలోనియన్స్ కాలేయం రక్తాన్ని ఉత్పత్తి చేస్తుంది, కాబట్టి ఆత్మ ఇక్కడే ఉంటుందనుకునేవారు. గ్రీకులు ఆత్మ ఎక్కడో ఉంది, కానీ కాలేయం నల్లటి బైల్ రసం పసుపు పచ్చటి బైల్ రసాలని ఉత్పత్తి చేస్తాయని భావించారు. శరీరం సరిగా పని చేయడానికి కాలేయం ముఖ్య పాత్రని నిర్వహిస్తోందని తెలుసుకోగలిగారు. క్రమంగా కాలేయం ఆరోగ్యంగా లేకుండా బతకలేమని తెలుసుకోగలిగారు.



కడుపులో కోన్ ఆకారంలో, ముదురు ఎరుపు రంగులో, మెత్తగా ప్రకాశిస్తూ స్పాంజ్‌లా ఉండే కాలేయం ఎవరికైనా శరీర బరువులో 2-3% మధ్యలో ఉంటుంది. కడుపులో కుడిభాగాన, ఉదర వితానం కింద ఉరః పంజరంలో ఉంటుంది.

కాలేయ నిర్మాణం

కాలేయానికి రెండు లోబ్స్ ఉంటాయి. ఒక్కో భాగంలోనూ మళ్ళీ నాల్గేసి విభాగాలుంటాయి. వీటిని 'సెగ్మెంట్' అంటారు. ఒక్కో సెగ్మెంట్ విడివిడిగా ఉండగల్గుతుంది. ఎలాగంటే ప్రతీదానికీ రక్తం లోపలికి వెళ్ళే రక్తనాళాలు, బయటకు రక్తాన్ని తీసుకొచ్చే రక్తనాళాలు వేరువేరుగా ఉన్నాయి. అంటే ఒక విధంగా చెప్పాంటే ఒక అపార్ట్‌మెంట్‌లో ఎనిమిది ఫ్లాట్లు ఉన్నట్లు ఎనిమిది వేరువేరు సెగ్మంట్‌లో కాలేయముంటుంది. ఏ ఫ్లాట్‌కి ఆ ఫ్లాట్‌కి నీటి సరఫరా లోపలికి, మురుగు బయటకు వెళ్ళే ఏర్పాటున్నట్లు కాలేయ ప్రతి సెగ్మెంట్‌కి రక్త ప్రసరణ చేసే, తిరిగి వెనక్కి తెచ్చే నాళాలున్నాయి. ఇలాంటి నిర్మాణం ఉండడం వల్లే కంతులు లాంటివి ఏమైనా వస్తే కాలేయంలో ఆ భాగాన్ని తొలగించగల్గుతున్నారు. అలాగే బతికున్నవాళ్ళు దగ్గర బంధువులకు కాలేయంలో కొంతభాగాన్ని దానం చేయగల్గుతున్నారు. కాలేయంలో



మూడవ వంతున్నా అది చేసే పనులన్నీ చేయగల్గుతోంది. అలాగే రెండు, మూడు నెలల్లో అది మామూలు పరిమాణానికి పెరగగలదు.

కాలేయం 'బైల్ రసాన్ని' ఉత్పత్తి చేస్తుంది. కొవ్వులు, విటమిన్లు ఆహారంలో ఉన్న వాటిని పూర్తిగా జీర్ణం చేయడానికి ఈ రసం తోడ్పడుతుంది. ఈ బైల్ రసం కాలేయం నుంచి 'బైల్‌డక్ట్' అనే నాళం ద్వారా ఆహార నాళంలో డుయోడినమ్ ప్రాంతంలోకి పంపుతుంది.

కాలేయ ప్రత్యేకతలు

కాలేయంలో 70% దెబ్బతిన్నా మిగిలిన భాగం అన్ని పనుల్నీ నిర్వర్తించగలదు. చనిపోయే వరకూ పెరిగే ఏకైక అవయవం కాలేయం. మూడో భాగం మిగిలి మిగతాది తెగిపోయినా, రెండు నెలల్లో ఉన్న కాలేయం పూర్తి స్థాయికి పెరుగుతుంది.

కాలేయ అనారోగ్యాలు

కాలేయ సింథటిక్ ఫంక్షన్ దెబ్బ తినడంతో రక్తస్రావం, కామెర్లు, ఎన్‌కెఫలోపతి లాంటి అనారోగ్యాలు కలుగవచ్చు. విసర్జన పని దెబ్బ తినడంతో కామెర్లు పుట్టుకతో రావచ్చు. బలియరీ ఎట్రీషియా అంటారు. లేకపోతే పెద్దయిన తర్వాత గాల్‌స్టోన్స్, కంతులు రావచ్చు. వీటిని తొలగించడానికి లాప్రోస్కోపిక్ సర్జరి చేయాల్సి రావచ్చు. సిర్రోసిస్ వల్ల రక్తప్రసరణలో అడ్డంకులేర్పడితే 'పోర్టల్ హైపర్‌టెన్షన్' కలుగవచ్చు. రక్తవాంతులు కావచ్చు, కడుపులో నీరు చేరడాన్ని ఎసైటిస్ అంటారు.

లక్షణాలు


కాలేయ సమస్యలుంటే కడుపులో కుడి భాగంలో నొప్పి, జ్వరంతో వణికిపోవడం, కామెర్లు, శరీరంలో నొప్పులు, ఆకలి లేకపోవడం, ముదురు రంగులో మూత్రం, పేల్ మలం, ఎసైటిస్, కాళ్ళవాపులు, రక్తవాంతులు, దురదలు, కోమా వస్తాయి.

కాలేయ విధులు

కాలేయం చేసే పనులు 500కి పైగా ఉన్నాయి. అల్బ్యుమిన్ లాంటి ప్రొటీన్లను తయారు చేస్తుంది. రక్తాన్ని గడ్డకట్టించే పదార్థాల్ని తయారుచేస్తుంది. రక్తంలోని విషపదార్థాల్ని తొలగిస్తుంది, ఫిల్టర్‌లా వ్యర్థ పదార్థాల్ని తొలగిస్తుంది, డ్రైనేజ్‌లా. కాలేయం ఉత్పత్తి చేసే బైల్ రసం ఈ పనిని నిర్వర్తిస్తుంది. జీర్ణమైన ఆహారంలోంచి పోషకాలను స్వీకరిస్తుంది. గ్లూకోజ్ ఎక్కువగా ఉంటే గ్లైకోజెన్‌గా మార్చి నిల్వ ఉంచుతుంది, స్టోరేజ్ ఆరాన్‌లో. శరీరంలోని రసాలు వ్యర్థంగా బయటకు వెళ్తుంటే ఆపి, వెనక్కి ఆయా భాగాల్లోకి పంపేస్తుంటుంది కాలేయం, సెక్యూరిటీ గార్డ్‌లా.

సాధారణ కాలేయ అనారోగ్యాలు

ఎ, బి, సి, డి, ఇ వైరస్ ఇన్‌ఫెక్షన్‌తో 'హెపటైటిస్' వ్యాధి కలుగవచ్చు. అల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం వల్ల 'సిర్రోసిస్' రావచ్చు. అపరిశుభ్ర నీరు తాగడం, పరిశుభ్రతని పాటించకపోవడం, ఒకరు వాడిన సిరెంజ్‌లు, బ్లేడ్స్ మరోకరు వాడడం, రక్తమార్పిడి మొదలైన వాటివల్ల 'హెపటైటిస్' కలుగవచ్చు. వైరస్ శరీరంలోకి ప్రవేశించిన 10 నుంచి 20 సంవత్సరాల్లో హెపటైటిస్ వ్యాధి కనిపించవచ్చు. హెపటైటిస్ బి, సి – అల్కహాల్‌లో సిర్రోసిస్ వచ్చి, హెపటోమా రావచ్చు. కాలేయంలోని కంతులు, క్యాన్సర్లను హెపటోమా అంటారు.




మనదేశంలో బైల్ డక్ట్, గాల్‌బ్లాడర్ క్యాన్సర్లు కూడా సాధారణంగా వస్తుంటాయి. వీటిని ప్రథమ దశలో కనుక్కుంటే శస్త్రచికిత్స ద్వారా తొలగించవచ్చు. కంజెనైటల్ బలియరీ ఎట్రీసియాలాంటి వాటివల్ల కాలేయం దెబ్బతింటే మార్పిడే చికిత్స. కాలేయం ఫెయిలైతే మార్పిడి శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. ఎన్‌కెఫలోపతి రక్తస్రావంచ ఎసైటిస్ ముదిరినా కాలేయ మార్పిడి చేయాలి. కాలేయం సిర్రోసిస్ లాంటి అనారోగ్యంలో శరీరం మీద ఎర్రటి మచ్చలు ఏర్పడవచ్చు. ఛాతీ పైభాగంలో సాలెగూడులో ఉబ్బెత్తున కనిపిస్తాయి. శరీరం దురదలు, నల్లబడడం, ఇబ్బందికరంగా ఉండడం, నీరసం, పెదాల రంగు మారుతుంది. నల్లటి మచ్చలు రావచ్చు. ఈ లక్షణాలన్నీ కాలేయ మార్పిడితో మారిపోతాయి.


కాలేయం భాగం బంధువుల నుంచి తీసుకోవచ్చు. అలా కొంత భాగం కాలేయాన్ని కాలేయం ఫెయిలైన వాళ్ళకు ఇవ్వడంతో రెండు నెలల్లో అ యొక్క కాలేయం పూర్తిస్థాయికి పెరుగుతుంది. అలాగే దానం చేసిన వాళ్ళ కాలేయ భాగం పూర్తి స్థాయికి పెరుగుతుంది.

కెడావర్ లివర్‌లు దొరికితే మార్పిడికి లివింగ్ డోనార్స్ నుంచి తీసుకోవాల్సిన అవసరం ఉండదు. కెడావర్ డొనేషన్ అంటే బ్రెయిన్‌డెత్ అయినవాళ్ళని వాళ్ళ వాళ్ళ అనుమతితో వెంటిలేటర్స్ మీద ఉంచి అవయవాలు తీసుకొని కావలసిన వాళ్ళకు అమరుస్తారు. బ్రెయిన్‌డెత్ అయినవాళ్ళ నుంచి దానంగా రెండు కళ్ళు, రెండు మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, గుండె, కాలేయం, పాంక్రియాజ్‌లాంటి అవయవాల్ని దానంగా స్వీకరించవచ్చు. బ్రెయిన్ డెత్‌ని న్యూరాలజిస్ట్ డిక్లేర్ చేయాలి. బతికున్నప్పుడు నలుగురికీ సహకరిస్తూ ఉండాలంటారు. చనిపోతూ ఎనిమిది మందికి జీవితమివ్వగలగడం గొప్ప విషయం కదా! అందుకని అందరం కెడావర్ డొనేషన్‌కు ముందుకు రావాలి. ఎవరికి ఎప్పుడు ఏ అవయవం ఫెయిలై మార్పిడి అవసరమో చెప్పలేంగా? ఇవాళ మనం దాతలమనుకోవచ్చు... విధి వక్రిస్తే రేపు స్వీకర్తలమూ కావచ్చుగా? ఎవరికి ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియదు కాబట్టి అందరం దాతలమైతే అవసరమైన వాళ్ళకు కావలసిన అవయవాలు లభ్యమవుతాయి.

కాయాన్ని బూడిద చేయడమో, మట్టిలో కలపడమో చేయడం బదులు మరికొందరికి అవయవదానంతో ప్రాణాలివ్వగలగడం గొప్ప విషయం కదూ!?

బ్రెయిన్ డెత్ అయిన తర్వాత అవయవాలు ఉపయోగపడాలన్నా అవి ఆరోగ్యాంగా ఉండాలి. అందుకే ఆరోగ్యంగా ఉండడానికి అందరూ సరైన జాగ్రత్తలు తీసుకోవాలి.





మిమ్మల్ని మొలలు బాధిస్తున్నాయా?

నిత్యం తీసుకునే ఆహారంలో పీచు పదార్థాల శాతం తగ్గడం వలన మలబద్ధకం కలుగుతుంది. మలవిసర్జన కష్టంగా మారుతుంది. మలవిసర్జన సాఫీగా జరగనప్పుడు గట్టిగా ముక్కడం వల్ల మలాశయం వద్ద ఉండే కండరాలు, రక్తనాళాలు ఒత్తిడికి గురై ఉబ్బుతాయి. కొన్ని సందర్భాల్లో రక్తస్రావం కూడా జరుగుతుంటుంది. పైల్స్‌ని (హిమరాయిడ్స్)లను 'అర్శమొలలు' అంటారు. పైల్స్ అంటే గడ్డ అని హిమరాయిడ్ అంటే రక్తస్రావం కావడం అని అర్థం. మొలలు చూడటానికి పిలకలుగా కనిపించి, రక్తంతో ఉబ్బి ఉంటాయి. ఇవి మల ద్వారం వెంట బయటకు పొడుచుకొని వచ్చినట్టుగా కనిపిస్తాయి. అర్శమొలలు (పైల్స్) ముఖ్యంగా రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. వీటిలో ఒక రకం పైల్స్ మలద్వారం లోపలే ఉండి బయటికి కనిపించకుండా ఉంటాయి. ఇలా పైల్స్ మలద్వారం లోపల ఉండటం వల్ల రోగికి పైల్స్ ఉన్న విషయం చాలా రోజుల వరకు తెలియకుండా ఉంటుంది.

ఇక రెండో రకం పైల్స్ మలద్వారానికి వెలుపలే ఉంటాయి. ఇవి చేతికి తాకుతుంటాయి. మల విజర్జనకు వెళ్ళినప్పుడు కొన్ని రకాల మొలలు నొప్పి కలిగిస్తాయి. అర్శమొలలు లోపలికిపోతునానయి కదా అని అజాగ్రత్తతో మందులు వాడకుండా, డాక్టర్ సలహా తీసుకోకుండా ఉంటే కొన్ని రోజులకు మొలలు మలద్వారం బయట ఎక్కువ సంఖ్యలో తయారై, శాశ్వతంగా బయటనే ఉండిపోయి తీవ్రమైన అవస్థలకు గురిచేస్తుంది.

కారణాలు: తీవ్రమైన మానసిక ఒత్తిళ్ళు, మలవిసర్జన సక్రమంగా జరగక మలబద్ధకం తోడవడంతో కొందరిలో వంశపారంపర్యంగా ఎక్కువసేపు కుర్చీలో కూర్చొని కదలకుండా విధులను నిర్వర్తించడం వలన, తక్కువగా నీరు తాగడం వల్ల, మద్యం అతిగా సేవించడం వల్ల, ఫాస్ట్‌ఫుడ్స్, వేపుళ్ళు అతిగా తినడం వల్ల, మాంసాహారం తరచుగా తినడం వల్ల పైల్స్ సమస్య వస్తుంది.

లక్షణాలు: విసర్జన సాఫీగా జరగక తీవ్రమైన నొప్పి, మంట ఉంటుంది. మనుషులు చురుకుగా ఉండలేరు. ఎక్కడికంటే అక్కడికి ప్రయాణాలు చేయలేరు. విరోచనం కాకపోవడం వీరికి బాధ కలిగిస్తుంది. సుఖ విరోచనం కాకపోవడంతో చిరాకుగా కోపంగా ఉంటారు. అప్పుడప్పుడు విరోచనంలో రక్తం పడుతుంటుంది. మలవిసర్జన అనంతరం కూడా కొందరిలో నొప్పి, మంట రెండు గంటల వరకు ఉంటుంది. మల విసర్జన సమయంలో మొలలు (పైల్స్) బయటకు పొడుచుకొన్ని వచ్చి బాధిస్తాయి.

జాగ్రత్తలు: సులభంగా జీర్ణమయ్యే ఆహారపదార్థాలు తీసుకోవడం, ఘనపదార్థాలకన్నా ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవటానికి ప్రయత్నించాలి. కారం, నూనె, మసాలా పదార్థాలు బాగా తగ్గించాలి. పీచు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి (కనీసం రోజుకు 4 నుంచి 5 లీటర్లు). ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు మలవిసర్జన సాఫీగా జరుగినట్లు చూసుకోవాలి. మద్యం అతిగా సేవించడం, మాంసాహారం, చిరుతిండ్లు మానుకోవాలి. మానసిక ఒత్తిడి నివారణకు నిత్యం యోగా, మెడిటేషన్ లాంటివి చేయాలి.

చికిత్స: వెంటనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం ఉత్తమం. మలం మృదువుగా ఉండేలా, సులభంగా విసర్జితమయ్యేలా ఆకు కూరలు, తాజా పండ్లు, పీచు పదార్థాలున్న ఆహారం తీపుకోవాలి. క్రమబద్ధంగా ఒకేవేళలో మలవిసర్జనానికి వెళ్ళే విధంగా చూసుకోవాలి. ఈ జాగ్రత్తలతో పాటు నొప్పి నివారణకు మందులు, అయింట్‌మెంట్స్, విసర్జన తేలిగ్గా జరిగే మందులు ఉపయోగించాలి. కొన్ని మందులు మొలల సైజ్‌ను తగ్గించి, నొప్పి, రక్తస్రావాన్ని తగ్గిస్తాయి. డాక్టర్ సలహా మీద అవసరమైతే మొలలకు శస్త్ర చికిత్స చేయించుకోవాలి, లేకపోతే బాధతో పాటు రక్తస్రావం జరుగుతుంది.

గర్భధారణ.. ప్రసవం..

స్త్రీ జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం. స్త్రీ గర్భం దాల్చినప్పటి నుంచి నవమసాలు కొనసాగే వరకు అనేక అనుభూతులు పొందుతారు. యువతీ నుంచి మాతృమూర్తిగా మారే ఈ సమయంలో, బరువు పెరగడం, భంగిమల్లో మార్పులు చేకూరడం, కీళ్లలో కదిలికలు పెరగడం, కండరాల బలం క్షీణించడం వంటి మార్పులు స్త్రీ యొక్క శరీరంలో సహజబద్ధంగా జరుగుతాయి. ఇవి కాకుండా చాలా వరకు సర్వసాధారణంగా నడుము నొప్పి, కాళ్ళ వాపులు వంటి చిన్న చిన్న సమస్యలతో కూడా బాధపడుతుంటారు.



గర్భిణుల్లో అనేక అపోహలు తలెత్తుతాయి. ముఖ్యంగా వాళ్ళ చేసే పనుల విషయంలో. కొందరేమో ఎంత ఎక్కువ పని చేస్తే కాన్పు అంత సులువుగా అవుతుంది అని ఆలోచిస్తారు. మరి కొందరేమో దీనికి పూర్తి విరుద్ధం. తల్లి, బిడ్డ ఇద్దరి ఆహారం తినాలని ఎక్కువెక్కువ తింటుంటారు. మరి మంచం అసలు దిగరు. రెండు ధోరణులు సరికాదు. సమపాళ్లలో వ్యాయామం చేయడం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు. సాధారణంగా వ్యాయామం అనగానే అందం కోసం అనే అపోహలో ఉంటారు. ఒక బిడ్డకు తల్లి అయిన తరువాత ఇంకా పెద్దగా అందానికి ప్రాముఖ్యత ఇవ్వడం అనవసరం అనుకుంటారు. నిజానికి అందమే కాకుండా, వారి ఆరోగ్యం, జీవన శైలి చురుకుగా మల్చడానికి వ్యాయామం తోడ్పడుతుంది. గర్భిణిల్లో కాన్పుకు ముందు తరువాత సహజంగా జరిగే మార్పుల వల్ల చిన్న చిన్న సమస్యకు సమర్థవంతంగా ఎదురుకొనుటకు వ్యాయామం ఎలా తోడ్పడుతుందో మీ ముందుకు తెస్తుంది మా ఈ గమన్ ఫిజియో కేర్.

గర్భధారణ మార్పులు–సమస్యలు

భంగిమలో మార్పు జరగడానికి అతి ముఖ్యమైన కారణం బరువు. నెలలు నిండే కొద్ది గర్భం పెరగడంతో పొట్ట పెరుగుతుంది. ఎత్తుగా కడుపు పెరిగే కొద్దీ స్త్రీలు సమతుల్యం కోసం కొద్దిగా వెనక్కి వంగి నడవడం అలవాటు చేసుకుంటారు. ఇలా చేయడం వల్ల వెర్టిబ్రై (వెన్నెముక)పైన తీవ్ర ఒత్తడి పడుతుంది. పెద్ద పొట్ట ఉన్నప్పుడు గురుత్వాకర్షణ శక్తి కేంద్రం ముందుకు జరుగుతుంది. దీనిని వెనక్కి తీసుకురావడానికి కొద్దిగా వెనక్కి వాలటం అలవాటు చేసుకుంటారు. అందు చేత నడుము దగ్గర ఉండే కండరాలు అధిక శ్రమకు లోనవుతాయి. ఫలితంగా అవి బిగుసుకుపోవడం, నడుము నొప్పి రావడం జరుగుతుంది.


రిలాక్సిన్ హార్మోన్ ఉత్పత్తి అవ్వడం చేత కీళ్ల యొక్క కదలికలు మామూలుకంటే ఎక్కువ ఉండటంతో, సులువుగా బ్యాలెన్స్ అవుట్ అవ్వడం, చిన్న చిన్న ప్రమాదాలకు గురవ్వడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. కాళ్లలోని రక్తనాళాల్లో నిరోధకత తగ్గడం, ఇంకా పొట్ట వద్ద ఉండే ప్రధానమైన సిరల మీద ఒత్తిడి పడటం వంటి రక్త సరఫరా లోపాల చేత ఎక్కువ శాతం గర్భిణుల్లో కాళ్ళ వాపులు కనిపిస్తుంటాయి.

వ్యాయామం కీలకపాత్ర

నొప్పి నివారణ: సాధారణంగా నొప్పి తగ్గడానికి ఐ.ఎఫ్.టి., అల్ట్రా సౌండ్ వంటి కరెంట్ పరికరాలతో చికిత్స చేస్తారు. అయితే గర్భిణీ స్త్రీలకు వాటితో చికిత్స చేయకూడదు. అందుకు వ్యాయామమే కీలకం. నొప్పి వేధిస్తున్నప్పుడు, ఏ ఏ కండరాలు సమస్యకు కారణమవుతున్నాయో గుర్తించి, బిగుసుకుపోయిన కండరాలకు (సెలెక్టివ్ స్ట్రెచ్చింగ్) క్షీణించిన కండరాలను బలోపేతం చేసేందుకు వ్యాయామం సూచిస్తారు.

వాపుల నియంత్రణ

ఎక్కువ సమయం నిల్చోవడం, కాలు కిందకు పెట్టి కాలు మీద కాలు వేసుకొని కూర్చోవడం చేయకూడదు. ప్రతి గంటకు 309 సెకండ్లు పాదాలను పైకి కిందకి వీలైనంతవరకు కదిలించడం చేత మంచి ఉపయోగం ఉంటుంది.



సులువైన ప్రసవం

పెల్విక్ ఫ్లోర్ అవసరమైన కండరాలను సురక్షితమైన వ్యాయామంతో బలోపేతం చేయడంతో కాన్పు సులువుగా జరుగుతుంది. విసర్జన సమస్యలు కూడా నివారించవచ్చు.

చురుకు, ఆరోగ్యకరమైన బిడ్డ

పూర్వం గర్భిణులు వ్యాయామం చేస్తే గర్భానికి జరగవలసిన రక్త సరఫరా, వ్యాయామం చేసే గర్భిణి కండరాలకు జరుగుతుందని వ్యాయామాన్ని నిర్దేశించేవాళ్లు. అయితే అధునిక పరిశోధన, వారానికి 5 రోజులు, 30 నిమిషాల పాటు నడక (వాకింగ్), సైక్లింగ్, కుదిరితే ఈత (స్విమ్మింగ్) వంటి సులువైన ఏరోబిక్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం చేత గర్భిణికి ఎటువంటి హానీ జరగదు అంతే కాకుండా పరిమిత బరువు, చురుకు, ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవిస్తారని తేల్చి చెప్పారు.

కంగుబాటు : కొందరు అనవసరంగా ఒత్తిడికి గురవుతుంటారు. ఈ మానసిక ఒత్తిడిని తగ్గించడానికి రిలాక్సేషన్, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు ఉపయోగపడతాయి.

సలహాలు–సూచనలు

కాన్పు తరువాత బిడ్డ యొక్క ఆలనా పాలనా చూసుకునే సమయంలో తల్లి తన భంగిమలపైన పెద్దగా దృష్టి పెహించదు. వీటికి సంబంధించిన సలహాలు–సూచనలు పాటించడం వల్ల అనేక ఇబ్బందులను నివారించవచ్చు.



ముఖ్య గమనిక

స్త్రీలు గర్భం దాల్చినప్పుడు లేక ప్రసవం తరువాత వ్యాయామం మొదలుపెట్టే ముందు... ఫిజియోథెరపిస్ట్‌ని సంప్రదించి వారి సలహా మేరకు పాటించడం మంచిది. స్త్రీ యొక్క శారీరక స్థితిని క్షుణ్ణంగా పరిశీలించి వారికి సురక్షితమైన వ్యాయామం సలహాలు సూచించగలరు.

– డా॥ ఎ. సుష్మజ
సీనియర్ ఫిజియోథెరపిస్ట్, గమన్ ఫిజియోకేర్

నేడే విడుదల భరత్ అనే నేను మొదటి పాట



రంగస్థలం' చిత్రానికి సూపర్ హిట్ మ్యూజిక్ ఇచ్చిన దేవిశ్రీప్రసాద్ 'భరత్ అనే నేను' చిత్రానికి కూడా సంగీత దర్శకుడు కావడంతో.. ఈ చిత్రం పాటల కోసం మహేష్‌బాబు ఫ్యాన్స్‌తోపాటు అందరూ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. సుకుమార్‌కి ఎలాగయితే దేవిశ్రీప్రసాద్ పర్మనెంట్ మ్యూజిక్ డైరెక్టరో, కొరటాల శివకు కూడా అంతే. 'మిర్చి, శ్రీమంతుడు, జనతా గ్యారేజ్' చిత్రాలనంతరం కొరటాల–దేవిశ్రీ కాంబినేషన్‌లో వస్తున్న 'భరత్ అనే నేను' టీజర్‌కు అసాధారణమైన స్థాయిలో స్పందన రావడంతో నేడు విడుదలవుతున్న మొదటి పాటపై విపరీతమైన అంచనాలున్నాయి. మహేష్ సరసన కైరా అద్వాని నటిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 20న విడుదలవుతుండడం తెలిసిందే. డి.వి.వి. దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు!!

దిల్‌రాజుతో పూరి కనెక్ట్



మే 11న రానున్న మెహబూబా



తన తనయుడు ఆకాష్ పూరిని హీరోగా పరిచయం చేస్తూ ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'మెహబూబా' చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఈమేరకు ఈ చిత్ర కార్యనిర్వాహక నిర్మాత, ప్రముఖ హీరోయిన్ ఛార్మి కౌర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఆకాష్ సరసన నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం మే 11న విడుదల కానుంది. తన తనయుడు హీరోగా పరిచయం అవుతున్న చిత్రం కావడంతో పూరి జగన్నాథ్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని తెరకెక్కించారు. 1971లో జరిగిన ఇండో పాక్ వార్ నేపథ్యంలో జరిగే ఈ ప్రేమకథ పూరి జగన్నాథ్ స్టయిల్‌లో ప్రేక్షకులను ఉర్రూతలూగిసుదేమో వేచి చూడాల్సిందే!!

కుమారి 21 ఎఫ్ కలయికలో



రాజ్ తరుణ్ కెరీర్‌లో హిట్ సినిమాల్లో 'కుమారి 21 ఎఫ్' ఒకటి. ఈ చిత్రాన్ని పల్నాటి సూర్య ప్రతాప్ డైరెక్ట్ చేశారు. ఇప్పుడు ఈ దర్శకుడితో మరో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు రాజ్ తరుణ్. ఈ చిత్రాన్ని ఎస్.ఆర్.టి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. తాజా సమాచారం మేరకు ఈ చిత్రం ఏప్రిల్ 18 న మొదలు కానుంది!!



రాజ్యసభకు ఎంపికైన టి.న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందిస్తున తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు!!

టెన్ థౌజండ్‌వాలా టాక్సీవాలా



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'టాక్సీవాలా' ఫస్ట్ లుక్ విడుదలైంది. టైటిల్‌కి సంబంధం లేని విధంగా ఈ లుక్‌లో విజయ్ దేవరకొండ చాలా స్టయిలిష్‌గా ఉన్నాడు. జి.ఎ–2, యువి క్రియేషన్స్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

రాహుల్ సంకృత్యన్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి ఎస్.కె.ఎన్ నిర్మాత. 'పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి' చిత్రాలతో స్టార్ హీరోగా ఎదిగిన విజయ్ దేవరకొండ టైటిల్ రోల్ ప్లే చేస్తున్న 'టాక్సీవాలా'పై విపరీతమైన అంచనాలున్నాయి. ఆ అంచనాలకు తగ్గట్లుగా ఫస్ట్ లుక్ ఉంది.

దేవరకొండ సరసన మాళవిక నాయర్, ప్రియాంక జవల్కర్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం టీజర్ త్వరలోనే రిలీజ్ కానుంది. కాగా, ఈ చిత్రాన్ని మే 18న విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది!!

పువ్వు పుట్టగానే పరిమళించడమంటే ఇదే!

చిన్నారి చిట్టిబాబుగా అలరిస్తున్న అల్లు అయాన్



అల్లు ఫ్యామిలీ నుంచి నెక్స్ట్ జనరేషన్ హీరో తయారవుతున్నాడు. 'రంగస్థలం'లో రామ్‌చరణ్ పోషిస్తున్న చిట్టిబాబు గెటప్‌ను అనుకరిస్తూ ఫోజులిచ్చిన అల్లు అర్జున్ తనయుడు అల్లు అయాన్ సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తున్నాడు. ఈ స్టిల్ చూసినవాళ్లంతా అయాన్ కూడా హీరో అవ్వడం ఖాయమని ఫిక్స్ అయిపోతున్నారు. అల్లు కుటుంబంలో ఇప్పటికే ఇద్దరు హీరోలున్నారు. అల్లు అర్జున్, అల్లు శిరీష్‌ల తర్వాత అల్లు అయాన్ హీరోగా మారనున్నాడన్నమాట!!

ఆర్గానిక్ ఫ్రూట్‌లాంటి ప్యూర్ ఎంటర్‌టైనర్



ఏ విధమైన రసాయనాలు వాడకుండా పండించిన పండులాంటి సినిమా మా సినిమా' అంటున్నారు 'ఇంతలో ఎన్నెన్ని వింతలో' దర్శకనిర్మాతలు వరప్రసాద్ వరికూటి–ఎస్.శ్రీకాంత్‌రెడ్డి–రామ్‌మోహన్‌రావు ఇప్పిలి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొన్న ఈ చిత్రం ఏప్రిల్ మొదటివారంలో విడుదలవుతోంది. నందు, సౌమ్య వేణుగోపాల్, పూజ రామచంద్రన్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం విడుదలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు వరప్రసాద్ వరికూటి, నిర్మాతల్లో ఒకరైన ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సహ నిర్మాత డి.శ్రీనివాస్ ఓంకార్ పాల్గొని చిత్ర విశేషాలు వెల్లడించారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ అంకిత భావంతో పనిచేయడంతో చాలా మంచి అవుట్‌పుట్ వచ్చిందని, ప్రేక్షకులకు మంచి అనుభూతినిస్తుందని వారు తెలిపారు. రసాయనాలు వాడకుండా పండించిన ఫలం ఎంత మధురంగా ఉంటుందో 'ఇంతలో ఎన్నెన్ని వింతలో' సినిమా అలా ఉంటుందనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు!!

తాతయ్య అన్న పిలుపు మా ఇంట ముద్దులకు పొద్దుపొడుపు

రెండోసారి తాతయిన బాలయ్య





ప్రథమ కుమార్తె బ్రాహ్మణి కుమారుడు దేవాన్ష్ పుట్టుకతో 'తాతయ్య హోదా' సంపాదించుకొని, దానిని పూర్తి స్థాయిలో ఆస్వాదిస్తున్న నందమూరి బాలకృష్ణ.. ఇప్పుడు తన రెండవ కుమార్తె తేజస్వినికి కుమారుడు జన్మించడంతో మరోమారు తాతయ్య అయ్యారు. మార్చి 22వ తారీఖు తెల్లవారుఝామున తేజస్విని–శ్రీభరత్ లకు పండంటి మగ బిడ్డ పుట్టాడు. వారసుడి ఆగమనంతో నందమూరి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది!!

శ్రీకారం చుట్టుకొన్న శివానీ రాజశేఖర్ 2 స్టేట్స్





లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా రూపొందిస్తున్న చిత్రం '2 స్టేట్స్. చేతన్ భగత్ రాసిన నవలకి సినిమా రూపంగా హిందీలో రూపొంది అక్కడ అసాధారణ విజయం సొంతం చేసుకొన్న చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో రీమేక్ చేస్తున్నారు. అడవిశేష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా ప్రముఖ హీరో రాజశేఖర్ కుమార్తె శివానీ రాజశేఖర్ హీరోయిన్‌గా పరిచయమవుతుండడం విశేషం. ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి రెబల్‌స్టార్ కృష్ణంరాజు కెమెరా స్విచాన్ చేయగా ఎస్.ఎస్.రాజమౌళి క్లాప్ కొట్టారు. కె.రాఘవేంద్రరావు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా టి.సుబ్బరామిరెడ్డి, కోడి రామకృష్ణ, వి.వి.వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఎల్.ఏ సాధిస్తున ఘన విజయాన్ని నాకంటే ఎక్కువగా మా అన్నయ్య ఆస్వాదిస్తున్నాడు!

-మంచి లక్షణాలున్న తమ్ముడు ఉపేంద్ర మాధవ్




అతని పేరు ఉపేందర్‌రెడ్డి. కానీ దర్శకుడయ్యే అవకాశం రాగానే ఆ పేరును 'ఉపేంద్ర మాధవ్'గా మార్చుకున్నాడు. 'నేను దర్శకుడు కావడం వెనుక మా అన్నయ్య మాధవ్‌రెడ్డి మద్దతు చాలా ఉంది. నేను దర్శకుడు కావాలని.. నాకంటే ఎక్కువగా మా అన్నయ్యే కోరుకున్నాడు. అందుకే నా పేరు పక్కన మా అన్నయ్య పేరు కలుపుకొని నా స్క్రీన్ నేమ్‌ని 'ఉపేంద్ర మాధవ్'గా మార్చుకున్నాను. అలాగే 'ఎం.ఎల్.ఏ' చిత్రం సాధిస్తున్న ఘన విజయాన్ని నా కంటే మా అన్నయ్యే ఎక్కువ ఆస్వాదిస్తున్నాడు. తన ఫ్రెండ్స్ అందరికీ స్పెషల్‌గా ఓ షో కూడా ఏర్పాటు చేసుకున్నాడు' అంటున్నారు ఉపేంద్ర మాధవ్ అలియాస్ ఉపేంద్రరెడ్డి.

ఉపేంద్ర మాధవ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ నందమూరి కళ్యాణ్‌రామ్ టైటిల్ పాత్రలో, కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్–పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై.. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో కిరణ్‌రెడ్డి–భరత్ చౌదరి నిర్మాతలుగా వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా రూపొందిన 'ఎం.ఎల్.ఏ' (మంచి లక్షణాలున్న అబ్బాయి) ఈ శుక్రవారం విడుదలై విజయ దుందుభి మ్రోగిస్తోంది. కళ్యాణ్‌రామ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ ఓపినింగ్స్ నమోదు చేసింది. ఉభయ రాష్ట్రాల్లో గల అన్ని నియోజక వర్గాల్లో భారీ మెజార్టీలో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యువ ప్రతిభాశాలి ఉపేంద్రమాధవ్ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించి, తన విజయానందాన్ని రెట్టింపు చేసుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..!!

'చిన్నప్పట్నుంచీ దర్శకుడవ్వాలని నా కోరిక. ప్రియదర్శిని రామ్‌గారి దగ్గర శిష్యరికం చేయడంతో నా సినీ ప్రస్థానం మొదలైంది. నిజానికి నాలో 'మంచి రచయిత' కూడా ఉన్నాడని నాకూ తెలియదు. 'దూకుడు' సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్న టైమ్‌లో.. 'ఎవరైనా మంచి స్పార్క్ ఉన్న కుర్రాడు మన స్టోరీ డిస్కషన్స్‌లో ఉంటే బాగుంటుంది' అన్న శ్రీను వైట్లగారి కోరిక మేరకు, ఆ సినిమాకి రైటర్‌గా పని చేసే అవకాశం దొరికింది. 'దూకుడు' నుంచి 'బ్రూస్‌లీ' వరకు వైట్లగారి దగ్గర పని చేశాను. ఆ తర్వాత నుంచి.. డైరెక్షన్ ట్రయిల్స్ వేస్తున్న నా గురించి హీరో కళ్యాణ్‌రామ్‌గారితో రఘు కారుమంచి (అదుర్స్ రఘు) చెప్పడంతో, ఆయన్ను కలవడం, ఫస్ట్ సిట్టింగ్‌లోనే కథ ఓకె చేయడం, సెట్స్‌కి వెళ్లడం చకచకా జరిగిపోయాయి. అప్పటికే నాకు కళ్యాణ్‌రామ్‌గారితో మంచి పరిచయముంది. 'ఎం.ఎల్.ఏ' సినిమాకి ఇప్పుడు ఇన్ని ప్రశంసలు వస్తున్నాయంటే వాటి వెనుక మా హీరో కళ్యాణ్‌రామ్‌గారి ప్రోత్సాహం, అంకితభావం ఉన్నాయి. అలాగే మా నిర్మాతలు విశ్వప్రసాద్, కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి, వివేక్ కూచిభొట్ల సహకారం కూడా ఎంతో ఉంది. నా రెండో సినిమాను కూడా వీరికే చేయబోతున్నానంటే దాన్నిబట్టి మీరు అర్థం చేసుకోవచ్చు.

కళ్యాణ్‌రామ్–కాజల్ అగర్వాల్ కెమిస్ట్రీ, మణిశర్మ మ్యూజిక్, ప్రసాద్ మూరెళ్ల కెమెరా వర్క్, ప్రొడక్షన్ వేల్యూస్ 'ఎం.ఎల్.ఏ' సాధిస్తున్న ఘన విజయంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. అలాగే నా డైలాగ్స్‌కు మంచి స్పందన వస్తుండడం నాకు చాలా సంతోషాన్నిస్తోంది. ఇంత మంచి విజయాన్ని అందిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఇందాక చెప్పినట్లుగా.. నా రెండో సినిమా కూడా ఇదే బ్యానర్‌లో చేయబోతున్నాను. వివరాలు త్వరలోనే వెల్లడిస్తాను!!



కన్ను కొట్టి అవగాహన కల్పిస్తోంది

వడోదర పోలీసుల వినూత్న ప్రయత్నం

వడోదర : రోడ్డు ప్రమాదాల బారిన పడి నిత్యం ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. రోడ్డు భద్రతల మీద ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, అవన్నీ బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నాయి. ఇటీవల చెన్నైలో ఓ బధిరుడు మైమ్ ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ప్రయత్నం చేశాడు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహన దారుల దగ్గరకు వెళ్లి శిరస్త్రాణం, సీటు బెల్టు పెట్టుకోమని సంజ్ఞల ద్వారా చెప్పాడు. అయితే, వడోదరకు చెందిన ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఇంకాస్త వినూత్నంగా ఆలోచించారు. రోడ్డు ప్రమాదాలపై మరింత అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాన్ని అస్త్రంగా ఎంచుకున్నారు. తన కనుసైగలతో యావత్ భారత్‌దేశాన్ని తన వైపుకు తిప్పుకొన్న మలయాళ నటి ప్రియా ప్రకాశ్ వారియర్ ఫోటోను తమ ప్రచార చిత్రంగా వాడుకొంటున్నారు. ప్రియ కన్నుకొడుతున్న ఫోటో పక్కన రెప్పపాటులో ప్రమాదాలు జరగవచ్చు అని అర్థం వచ్చేలా సందేశాన్ని రాసి దాని కింద ప్రయాణాల్లో నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా నడపండి అని 'ట్రాఫిక్ ఏక్ సంస్కార్' అని హ్యాష్‌ట్యాగ్ ఉన్న ఫోటోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. దీంతో ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్‌గా మారింది. యువతకు తమ సందేశం మరింత త్వరగా చేరాలనే ఉద్దేశంతోనే ఇలాంటి ప్రయత్నం చేశామని వడోదర పోలీసులు తెలిపారు. ఇంటర్నెట్‌లో ఎక్కువగా క్రేజ్ ఉండే ప్రముఖులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా చెప్పించినా యువత తీరు కొంతైనా మారుతుందనే ఆలోచనతో ఈ విధంగా ముందుకు వచ్చామని తెలిపారు. తన హావభావాలతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన మలయాళీ నటి ప్రియా ప్రకాశ్ వారియర్ తన తొలిచిత్రం 'ఒరు అదార్ లవ్' చిత్రంలోని మాణిక్య మలయార పోవు పాటలో తనదైన శైలిలో కన్ను కొడుతూ ఉన్న వీడియో గత నెలలో విడుదలై సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది

'మా నాన్న ప్రాణాలకు ముప్పు'



- లాలూ తనయుడి సంచలన ఆరోపణలు
- బిజెపి కుట్ర పన్నుతోందని తేజస్వి యాదవ్ ఆరోపణ
- దాణా కుంభకోణం కేసులో కోర్టు తీర్పు అనంతరం లాలూ తనయుడి సంచలన ఆరోపణలు
- సిబిఐ కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేస్తామని వెల్లడి
- జైలులో ఉన్న వ్యక్తి ప్రాణాలకు ముప్పు ఎలా ఉంటుంది?
- ఆయనను కలవడానికి ఎవరినీ అనుమతించడం లేదు
- ప్రాణ భయం ఉంటే కోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు : సుశీల్ మోడీ



పాట్నా : తన తండ్రి ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వి యాదవ్ శనివారం సంచలన ఆరోపణలు చేశారు. ఈ దిశగా భారతీయ జనతా పార్టీ (బిజెపి) కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. బీజేపీ చేస్తున్న కుట్రను చూస్తుంటే, లాలూజీ ప్రాణాలకు ముప్పు ఉందని నేను కచ్చితంగా చెప్పగలను అని ఆయన అన్నారు. పశుగ్రాసం కుంభకోణానికి సంబంధించిన నాలుగో కేసులో లాలూకు రాంచీలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం శనివారం పద్నాలుగేళ్ల జైలుశిక్ష విధించిన నేపథ్యంలో తేజస్వి చేసిన ఆరోపణలు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 14 ఏళ్ల కారాగారంతో పాటు రూ. 60 లక్షల జరిమానా కూడా లాలూ చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అయితే, కోర్టు తీర్పును తాము హైకోర్టులో సవాలు చేస్తామని తేజస్వి చెప్పారు. హైకోర్టులో ఈ కుంభకోణానికి సంబంధించిన మొత్తం నాలుగు కేసుల్లో వచ్చే తీర్పు ఆధారంగా తదుపరి వ్యూహాన్ని రచించుకుంటామని ఆయన తెలిపారు. కాగా, దాణా కుంభకోణానికి సంబంధించిన ఈ నాలుగో కేసు 1990 దశకంలో దుమ్కా కోశాగారం నుంచి లాలూ మోసపూరితంగా రూ. 3.13 కోట్లు విత్‌డ్రా చేశారన్న ఆరోపణలకు సంబంధించినది.

జైలులో ఉన్న లాలూ ప్రాణాలకు ముప్పు ఎలా?: సుశీల్ మోడీ

తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు ప్రాణ హాని ఉందంటూ ఆయన కుమారుడు తేజస్వి యాదవ్ భయాందోళనలను వ్యక్తపరిచిన సంగతి తెలిసిందే. బీజేపీ, జేడీయూ పార్టీల కుట్రకు తన తండ్రి బాధితుడిగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోడీ స్పందించారు. భయాందోళనలను కొట్టిపారేశారు. జైలులో, పోలీసుల కస్టడీలో ఉన్న వ్యక్తి ప్రాణాలకు ముప్పు ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ఆయనను కలుసుకునేందుకు ఎవరినీ అనుమతించడం కూడా లేదని సుశీల్ మోడీ చెప్పారు. అలాంటప్పుడు ప్రమాదం ఎలా ఎదురవుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ప్రాణ హాని ఉందనుకుంటే కోర్టులో అప్పీల్ చేసుకోవాలని సుశీల్ మోడీ సూచించారు.

నక్సలిజం చివరి దశలో ఉంది : రాజ్‌నాథ్



గురుగ్రామ్ : దేశంలో నక్సజలిం చివరి అంచుల్లో ఉందని, భద్రతా దళాలు నక్సలిజాన్ని ఎదుర్కోవడంలో విజయవంతం అయ్యాయని కేంద్ర హోమ్ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో శనివారం సీఆర్‌పీఎఫ్ దళాల 79వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుక్మా ఎన్‌కౌంటర్‌లో మరణించిన జవాన్లకు నివాళులు అర్పించిన అనంతరం రాజ్‌నాథ్ ప్రసంగించారు. 'నక్సలిజాన్ని ఎదుర్కొవడం పెద్ద సవాల్. కానీ, సీఆర్‌పీఎఫ్ సహా భద్రతా దళాలు దానిని కట్టడి చేసేందుకు కృషి చేస్తున్నాయి. భద్రతా దళాలను నేరుగా ఎదుర్కొనే శక్తిలేక మావోయిస్టులు పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారు. దీనివల్ల భద్రతా సిబ్బంది మరణాల రేటు తీవ్రంగా పెరిగింది. అందుకే నక్సల్ వ్యతిరేక చర్యలను ప్రోత్సహిస్తున్నాం. నిర్ణయాత్మక చర్యలతో వారి చేష్టలను తిప్పికొడుతున్నాం' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

వారే నష్టపోతున్నారు : 'మావోయిస్టుల చర్యల వల్ల సామాన్య ప్రజానీకం కూడా ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. వారి చర్యల వల్ల వారే నష్టపోతున్నారు' అని రాజ్‌నాథ్ తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వ్యతిరేకంగా మావోయిస్టులు పని చేస్తున్నారని, చివరకు రోడ్లు వేస్తున్న సిబ్బందిని కూడా హతమారుస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. నిజానికి ఆవిర్భావ దినం మార్చి 19నే కాగా, రాజ్‌నాథ్ బిజీ షెడ్యూల్ మూలంగా శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీజేపీ ఎంపీలకు కొత్త టార్గెట్ విధించిన నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీలంతా ట్విట్టర్ లో అధికారిక ఖాతాలు తెరవాలని ప్రధాన మోదీ ఆదేశించారు. ఒక్కో ఎంపీకి కనీసం మూడు లక్షల మంది ఫాలోయర్లు ఉండాలని టార్గెట్ విధించారు. ఢిల్లీలో ఈరోజు బీజేపీ పార్లమెంటరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ఉపన్యసించారు. ప్రతిపక్షాల తప్పుడు విమర్శలను ఎండగట్టేందుకు ఎంపీలంతా ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రతిపక్షాల అసత్యాలను తిప్పికొట్టేలా మన సందేశం ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. దాదాపు మూడు గంటల సేపు ఈ సమావేశం జరిగింది. ఇందులో సోషల్ మీడియాను వినియోగించుకోవడంపైనే ఎక్కువ చర్చ జరిగింది. సమావేశం సందర్భంగా 43 మంది ఎంపీలకు ఫేస్ బుక్ ఖాతాలు లేవని తేలింది. అకౌంట్లు ఉన్నవారిలో కూడా 77 మంది అకౌంట్లకు వెరిఫికేషన్ పూర్తి కాలేదని తెలిసింది.

మా పొత్తు చెక్కు చెదరదు : మాయావతి

లక్నో : రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎస్పీ, బీఎస్పీ మధ్య సంబంధాలపై ప్రభావం చూపించే ప్రసక్తే లేదని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ అధినేత్రి మాయావతి అన్నారు. ఎస్పీ, బీఎస్పీ పొత్తు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆమె కీలక ప్రకటన చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన తమ పార్టీ అభ్యర్థులపై మాయావతి గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి ఓటు వేసిన పార్టీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ సింగ్‌ను ఆమె సస్పెండ్ చేయనున్నట్లు సమాచారం. బీఎస్పీ అభ్యర్థికి మద్దతు ఇవ్వకుండా ఇతర పార్టీకి ఓటు వేశారన్న కారణంగా అనిల్ కుమార్‌పై వేటు పడే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. లక్నోలో మాయావతి మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా తమను ఒక్క అంగుళం కూడా కదిలించలేరని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ అపహాస్యం చేసిందనడానికి తాజా రాజ్యసభ ఓటింగే నిదర్శనంగా నిలిచిందని ఆమె అన్నారు. ఎస్పీ, బీఎస్పీ పరస్పర అవగాహనతో ఓటింగ్‌లో పాల్గొంటే సీటు కోల్పోతామన్న భయంతో బీజేపీ తమఎమ్మెల్యేలను భయపెట్టిందని, ప్రలోభాలకు గురి చేసిందని మాయావతి ఆరోపించారు. ప్రజలు బీజేపీని నమ్మడం నిజమైతే గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ ఎందుకు ఓడిపోయిందో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజలు ఎన్నుకున్న నేతలు ఆ పార్టీకి మద్దతు తెలపకపోవడం ప్రజాస్వామ్య విజయం ఎలా అవుతుందని బీజేపీ అధిష్ఠానాన్ని ఈ సందర్భంగా మాయావతి ప్రశ్నించారు. మరో వైపు యూపీ రాజ్యసభ ఎన్నికల్లో 10 సీట్లకు 9 సీట్లు బీజేపీ కైవసం చేసుకోగా సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి ఒకరు నెగ్గారు. ఎస్పీ, బీఎస్పీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి మాత్రం ఓటమి పాలయ్యారు. బీజేపీ అభ్యర్థులు కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ, పార్టీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు సహా 9 మంది విజయం సాధించగా ఎస్పీ తరపున జయా బచ్చన్ గెలుపొందిన విషయం తెలిసిందే. ఓ బీఎస్పీ, ఓ బీజేపీ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లలేదు.



అక్కడ బీజేపీ ఓటమే బీఎస్పీ లక్ష్యం

పంతం... పంతం... పంతం నీదా నాదా సై...! అవును. రాజకీయ రణరంగంలో విశ్రమించడం ఉండదు. అలుపెరుగని పోరాటం చేయాల్సిందే. పోట్లాడుకునే వేదికలు మారుతుంటాయ్ అంతే... మొన్న, నిన్న ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో దెబ్బకు దెబ్బ అన్నట్టు సాగిన బీజేపీ, బీఎస్పీ మధ్య పోరు ఇక కర్నాటకకు మారింది. అదేమిటీ.. అక్కడ ప్రధాన ప్రత్యర్థులు కాంగ్రెస్, బీజేపీలే కదా. మరి మధ్యలో బీఎస్పీ ఎందుకు వచ్చింది అనుకుంటున్నారా? విషయం ఏమిటంటే, ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ కంచుకోటలు గోరఖ్‌పూర్, ఫూల్పూర్ స్థానాల్లో విజయం సాధించి ఎస్పీ-బీఎస్పీ కూటమి ఆ పార్టీకి గట్టి సవాల్ విసిరిన సంగతి తెలిసిందే. అయితే, శుక్రవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో అనూహ్యంగా క్రాస్ ఓటింగ్ ద్వారా వచ్చిన ఓట్లతో బీజేపీ తన తొమ్మిదో అభ్యర్థిని గెలిపించుకొని బీఎస్పీపై ప్రతీకారం తీర్చుకుంది. ఈ పోటాపోటీ ఎత్తులు పైయెత్తులు 20 శాతం దళిత జనాభా ఉన్న కర్నాటకకు మారాయి. దళిత ఓటర్ల మద్దతుతో కర్నాటకలో బీఎస్పీ పోటీ చేయబోతున్న 20 అసెంబ్లీ స్థానాల్లో గెలిచి బీజేపీకి అధికారాన్ని దూరం చేయాలని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ అధినేత్రి మాయావతి పావులు కదుపుతున్నారు. దానిలో భాగంగానే దేవెగౌడ సారథ్యంలోని జేడీ (ఎస్)తో బీఎస్పీ పొత్తు పెట్టుకుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి రెండు నెలల్లో జరగనున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఎస్పీల్లో ఎవరి పాచికలు పారతాయో తెలియాలంటే అంత వరకు వేచి చూడాల్సిందే.

ఆ పార్టీ అభ్యర్థి ఓడిపోయాడు.. వేడుకలు వద్దు



రాజ్యసభ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి ఓడిపోయినందుకు గాను సమాజ్‌వాదీ పార్టీ గెలుపువేడుకలను చేసుకోకూడదని నిర్ణయించుకుంది. ఆమె పార్టీ అభ్యర్థి ఓడిపోయినందుకు సంఘీభావంగా వేడుకలు చేసుకోవద్దంటూ ఎస్పీ గెలుపు సంబరాలను రద్దు చేసింది. శుక్రవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థి జయా బచ్చన్ గెలుపొందారు. ఈ సందర్భంగా ఎస్పీ లక్నో పార్టీ కార్యాలయంలో సంబరాలు చేయాలని తొలుత నిర్ణయించింది. కానీ బీఎస్పీ అభ్యర్థి భీమ్‌రావ్ అంబేద్కర్ ఓటమి పాలయ్యారు. దీంతో బీఎస్పీ అభ్యర్థి ఓడిపోయినందుకు గాను ఎస్పీ తన సంబరాలను చేసుకోవడాన్ని రద్దు చేసుకుంది. ఎస్పీ ఎమ్మెల్యే ఒకరు, బీఎస్పీ ఎమ్మెల్యే అనిల్ సింగ్ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడడంతో పాటు, ఈ రెండు పార్టీలకు చెందిన మరి ఇద్దరు శాసనసభ్యులు జైలులో ఉండడంతో బీఎస్పీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు.

మసీదు ఇస్లాంలో భాగమేనా?

న్యూఢిల్లీ : అయోధ్య బాబ్రీ మసీదు కేసు విచారణ కొత్త మలుపు తీసుకుంది. ఈ కేసులో తుది తీర్పు వెల్లడించడానికంటే ముందు అసలు మసీదు అన్నది ఇస్లాంలో భాగమేనా, కాదా? అన్న దానిపై రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతుందని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ తో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 1994లో మసీదు అన్నది ఇస్లాంలో భాగం కాదని సుప్రీం కోర్టే తీర్పు ఇచ్చింది. ఇప్పుడు ఆ తీర్పుపై రాజ్యాంగ ధర్మాసనం పునర్విచారణ చేస్తుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దీంతో అయోధ్య రామమందిరం- బాబ్రీ మసీదు భూ వివాదం కేసు విచారణ మరింత ఆలస్యం కానున్నది. 70 ఏళ్ల నుంచి వివాదం ఉన్న ఈ కేసు విచారణను ఎక్కువ మంది న్యాయమూర్తులతో కూడిన పెద్ద ధర్మాసనానికి బదలీ చేయాలన్న ఓ పిటిషనర్ వినతిని కోర్టు తిరస్కరించింది.

అనంత్ నాగ్‌లో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన భద్రత సిబ్బంది



శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఇద్దరు ఉగ్రవాదులను భద్రత సిబ్బంది మట్టుబె ట్టారు. అనంత్ నాగ్‌లోని శిస్త్రాగమ్ గ్రామంలో శనివారం ఉదయం భద్రత సిబ్బంది కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఇంటిలో దాక్కున్న ముష్కరులు భద్రత సిబ్బందిపై కాల్పులకు పాల్పడ్డారు. దీనితో, భద్రత సిబ్బంది ఎదురు కాల్పులకు పాల్పడడంతో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. సంఘటన స్థలం నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు భద్రత సిబ్బంది తెలిపారు.

హైదరాబాద్, బెంగళూరు నగరాలకు ప్రోత్సాహం లేకపోవడంపై మండిపడ్డ సిద్ధరామయ్య

బెంగళూరు : అత్యధిక పన్ను ఆదాయం తీసుకువస్తూ దేశాభివృద్ధికి ఊతంగా నిలవడమే కాకుండా, మహిళా సాధికారత, విద్యలో ముందడుగు వేస్తున్న బెంగళూరు, హైదరాబాద్, కోచి, కోయంబత్తూరు నగరాలను రాయితీలతో ప్రోత్సహించాలని కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 15వ ఆర్థిక సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాలకు ప్రోత్సాహం కరవుపై ఆవేదన వ్యక్తం చేశారు. 'అభివృద్ధిలో వెనుకబడిన రాష్ట్రాలకు నిధులు మళ్లింపు చట్టబద్ధమే. అభివృద్ధి విషయంలో ప్రాంతీయ అసమానతలను పరిష్కరించడం అవసరమే. కాని, దీనిని దక్షిణాదికి నిధులు వెచ్చించకుండా ఇతర ప్రాంతాలకు నిధులు మళ్లించడంపైనే ప్రశ్న తలెత్తుతోంది. అభివృద్ధి, జనాభా నియంత్రణలకు ప్రోత్సాహం ఉండదా' అని సిద్ధరామయ్య కేంద్రం తీరును ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తన ట్విట్టర్ పేజీలో అభిప్రాయాలను పోస్ట్ చేశారు.

వాయిదాపడ్డ చంద్రయాన్ - 2 ప్రయోగం



చెన్నై: చంద్రయాన్ -2 ప్రయోగం వాయిదా పడినట్టు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ఛైర్మన్ డాక్టర్ కె. శివన్ తెలిపారు. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రయోగాన్ని వచ్చే నెలలో నిర్వహించాలనుకుని ముందుగా భావించినప్పటికీ సాంకేతిక కారణాల రీత్యా వాయిదా వేస్తున్నట్టు చెప్పారు. నిపుణులు కొన్ని మార్పులు సూచించారని, చంద్రయాన్ -2 ప్రయోగం అక్టోబర్‌లో ఉంటుందని తెలిపారు. జాలర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించనున్న మొబైల్ యాప్ పనులు ఈ నెలాఖరులోగా పూర్తవుతాయని, ఏప్రిల్ నుండి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కాగా, చంద్రుడిపై మరిన్ని పరిశోధనల నిమిత్తం చేపట్టనున్న ఈ ప్రయోగానికి పూర్తిగా దేశీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నారు. రూ. 800 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రయోగంలో జీఎస్‌ఎల్‌వీ ద్వారా ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌లను చంద్రుడిపైకి పంపనున్నారు. ఇది ఇలా ఉండగా, ఈ నెల 29న జీశాట్ -6 ఏ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్టు ఇస్రో ప్రకటించింది. జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్ 08 ద్వారా దీనిని ప్రయోగించనున్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలోని రెండో లాంచ్ పాడ్ నుంచి ఈ ప్రయోగం చేపట్టనున్నట్టు పేర్కొంది.

అదే మన టార్గెట్ : అమిత్ షా

గువాహటి : ఈశాన్య రాష్ట్రాల భారతీయ జనతా పార్టీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా కొత్త లక్ష్యాన్ని నిర్దేశించారు. రాబోయే 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈశాన్య రాష్ట్రాల్లోని 25 ఎంపీ స్థానాలకు గాను 21 స్థానాలకు పైగా కైవసం చేసుకోవాలని ఆయన తన పార్టీ నేతలకు లక్ష్యంగా నిర్ణయించారు. శనివారం గువాహటిలోని బూత్ యూనిట్ అధ్యక్షులతో నిర్వహించిన కార్యక్రమంలో అందరూ ఈ లక్ష్యం దిశగా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, 'నేను 2019 ఎన్నికల కోసం ఓ లక్ష్యాన్ని ఇవ్వాలనుకుంటున్నాను.ఈశాన్య ప్రాంతం నుంచి 25 లోక్‌సభ స్థానాలకు గాను 21 కంటే ఎక్కువ గెలవాలి. మిజోరాం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లోని నియోజకవర్గాల్లో ఎన్‌ఈడీఏ (ఈశాన్య ప్రజాస్వామ్య కూటమి) అధికారంలో ఉంది. కాబట్టి మీరంతా దీన్ని ముందుకు తీసుకువెళ్లాలి' అని అన్నారు. 2014 ఎన్నికల్లో బిజెపి ఇక్కడ 8 ఎంపీ స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈశాన్య ప్రాంతంలో వీలైనన్ని సీట్లు గెలవడం ద్వారా ప్రధాని నరేంద్ర మోడీకి మద్దతుగా నిలవాలని, తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రస్తుత పార్లమెంట్‌ను ప్రతిపక్షాలు స్తంభింపజేయడంపై ఆయన మండిపడ్డారు. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రతి




అంశంపైనా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. కానీ సభను సాగనివ్వడం వారికి ఇష్టం లేదని విమర్శించారు. టిడిపి, వైసిపి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవడానికి తమకు తగినంత మెజారిటీ ఉందని అమిత్ షా చెప్పారు.

'హిట్లరే పోయాడు... ఈ బీజేపీ ఎంత?'

బెంగళూరు : బీజేపీపై సినీ నటుడు ప్రకాష్ రాజ్ మరోసారి ధ్వజమెత్తారు. తప్పుడు హామీలతో దేశ ప్రజలను బీజేపీ మభ్యపెడుతోందని మండిపడ్డారు. సర్వ ధిక్కార ధోరణి అనేది కొన్ని రోజుల వరకు మాత్రమే పరిమితమని, ఎంతో కాలం కొనసాగదని చెప్పారు. హిట్లర్ వంటి వారి ఆధిపత్యమే కూలిపోయిందని, ఇక కేంద్రంలో ఉన్న బీజేపీ ఎంత అని ఆయన ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వస్తే గంగా నదిని స్వచ్ఛంగా మారుస్తామని బీజేపీ చెప్పిందని, అధికారంలోకి వచ్చాక కొంత మేర పనులు చేపట్టి, ఆ తరువాత చేతులు దులిపేసుకుందని విమర్శించారు. మతతత్వాన్ని పెంచి పోషిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని మండిపడ్డారు. దక్షిణ కన్నడలోని మంజేశ్వరలో ఉన్న శాంతి సేనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడానికి గట్టి ప్రయత్నాలు చేస్తాం'



న్యూఢిల్లీ : బీజేపీకి, కాంగ్రెస్‌కు అతీతంగా మూడో కూటమిని నిర్మించడం అంత తేలికైన విషయం కాదని సీపీఎం అగ్ర నేత ప్రకాశ్ కరత్ చెప్పిన విషయం తెలిసిందే. కాగా, ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించేందుకు తాము గట్టి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇటీవల వెలువడ్డ ఉప ఎన్నికల ఫలితాలు తమకు మంచి పాఠం నేర్పాయని, బీజేపీని కాంగ్రెస్ ఓడించగలిగే అవకాశం ఉన్న నియోజకవర్గాల్లో తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని ప్రకటించారు. బీజేపీని ఓడించేందుకు ఎన్నికల వ్యూహాలకు సంబంధించి మంచి పాఠాలను ఆ ఉప ఎన్నికలు తమకు అందించాయని, బీజేపీయేతర పార్టీల్లో ముఖ్యమైన పార్టీలన్నీ కలిస్తే మిగతా చిన్న పార్టీలు కూడా మద్దతు ప్రకటిస్తాయని అభిప్రాయపడ్డారు.

హజారే దీక్ష వెనుక అజ్ఞాత శక్తి?

న్యూఢిల్లీ : దేశంలో అవినీతిని అరికట్టేందుకు, ప్రధాని స్థాయి వ్యక్తులను కూడా విచారించేందుకు జన్ లోక్‌పాల్ బిల్లును తీసుకరావాలని కోరుతూ అన్నా హజారే మరోసారి రామ్ లీలా మైదానంలో ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్ష ఈ సారైనా విజయం సాధిస్తుందా? ఫలితం సంగతి మాట పక్కనే పెడితే కనీసం ఆయన దీక్షకు అంతటి ప్రాచుర్యం లభిస్తుందా? నాటి దీక్ష అరవింద్ కేజ్రివాల్ నాయకత్వాన ఆప్ పార్టీ ఆవిర్భవించేందుకు దోహదం పడిందీ. ఇప్పుడు అలాంటి పార్టీ మరొకటి పుట్టుకువస్తుందా? 2011లో అవినీతికి వ్యతిరేకంగా అన్నా హజారా ప్రారంభించిన దీక్షకు అంతటి ఆదరణ లభించడానికి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా అనుకూల పరిణామాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా హోస్నీ ముబారక్, కల్నల్ గడాఫీ వంటి నియంతలను మట్టి కరిపించిన అరబ్ వసంతం పేరిట మధ్య ప్రాచ్యంలో ఉప్పెనలా ప్రజా ఉద్యమం కొనసాగుతున్న రోజులు అవి. దేశీయంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో అవినీతి కుంభకోణాలు వెలుగులోకి వచ్చిన రోజులు. అన్నా హజారే దీక్ష వంటి ఉద్యమాలను 24 గంటల పాటు ప్రసారం చేయడానికి అవసరమైన ఫుటేజ్ కోసం టీవీలు కూడా వెతుక్కుంటున్న రోజులు. అన్నింటి కన్నా అవినీతిని అంతమొందించాలన్న మొండి సంకల్పంతో అరవింద్ కేజ్రివాల్, ఆయన సహచరుడు మానిష్ సిసోడియా ముందుకు వచ్చిన రోజులు. నిజం చెప్పాలంటే నాడు ఆర్టీఐ కార్యకర్తగా మెగసెసె అవార్డు అందుకున్న అరవింద్ కేజ్రివాల్, అన్నా హజారే ఉద్యమానికి ఊపిరిలా నిలబడ్డారు. హజారేను రామ్‌దేవ్ బాబా, శ్రీశ్రీ రవిశంకర్, కిరణ్ బేడీ, ప్రశాంత్ భూషణ్‌ను తన సహచరుడు సిసోడియా సహకారంతో కలుసుకొని వారిని ఒక వేదికపైకి తీసుకు వచ్చిందే కేజ్రివాల్. అప్పటికే మహారాష్ట్ర మంత్రుల అవినీతికి వ్యతిరేకంగా పలు సార్లు నిరాహార దీక్షలు చేసిన అన్నా హజారే ముందు ఉంటే బాగుంటుందని భావించే కేజ్రివాల్ ఆయనకు ఆ తరువాత పోరాటంలో సముచిత స్థానం కల్పించారు. 2011 జనవరి నెలలో మొదటిసారి అవినీతికి వ్యతిరేకంగా భారీ సభను నిర్వహించినప్పుడు పలువురు వక్తల్లో అన్నా హజారే ఒకరు మాత్రమే. అవినీతికి వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాన్ని ఎంత తీవ్రంగా నడిపించినా ఫలితం లేకపోవడంతో అరవింద్ కేజ్రివాల్ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి పోరాడాలనుకున్నారు. ముందుగా అందుకు స్వాగతం పలికిన అన్నా హజారే ఆ పార్టీతో తనకు సంబంధం లేదంటూ తప్పుకున్నారు. హిమాచల్ నుంచి పార్టీని ప్రారంభించాలనుకున్నప్పుడు అందుకు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసి రావాల్సిందిగా సిసోడియాను అక్కడికి పంపించిందే హజారియా. చివరకు రాజకీయ పార్టీకి దూరంగా ఉండాలనుకోవడం ఆరెస్సెస్ ఒత్తిడే కారణమని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. తెల్లవార్లు రామ్‌లీలా మైదానంలో జనం ఉన్నా లేకున్నా పడిగాపులు కాసిన వారంతా ఎక్కువగా ఆరెస్సెస్ కార్యకర్తలే. నాడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై పోరాటం కనుక ఆరెస్సెస్ తన కార్యకర్తలను పెద్ద ఎత్తున పంపించింది. నేడు బీజేపీ అధికారంలో ఉంది కనుక అన్నా హజారే ఉద్యమానికి ఆరెస్సెస్ కలసి వచ్చే అవకాశం లేదు. అరవింద్ కేజ్రివాల్ బృందం అండ అంత కన్నా లేదు. నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉన్నా, అవినీతి కుంభకోణాలు నాడు ఉన్నంతగా లేవు. నాడు టెలికమ్, బొగ్గు కుంభకోణం, కామన్‌వెల్త్ గేమ్స్ స్కామ్ మన్మోహన్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. కామన్‌వెల్త్ గేమ్స్ కుంభకోణం కారణంగానే కేజ్రివాల్ ప్రధానంగా ప్రజా ఉద్యమంలోకి వచ్చారు. ఇక ఏ టీవీ కూడా అన్నా హజారేతో పాటు పడిగాపులు పడేందుకు నేడు సిద్ధంగా లేదు. చాలా టీవీలు



ప్రజల గొంతును మరచిపోయి హిజ్ వాయిస్‌గా మారిపోయాయి. అంతర్జాతీయంగా కూడా ప్రజా ఉద్యమాల స్ఫూర్తి లేదు. మరి, ఏ ప్రతిఫలాన్ని ఆశించి అన్నా హజారే మళ్లీ ఉద్యమం చేపట్టారో అర్థం కావడం లేదు. మరో రాజకీయ పార్టీ ఆవిర్భావానికి అంకురార్పణ చేయడానికి వచ్చారా? మోడీ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు వచ్చారా? ఆ సంకల్పంతోనే మరో సారి ఆరెస్సెస్ ఆయన వెంట ఉండి ఆయనను పక్క దారి పట్టించిందా? కాలమే సమాధానం చెప్పాలి. గతంలో అన్నా హజారే ఒత్తిడి వల్ల ఆరుగురు మంత్రులను మహారాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ నుంచి తొలగించిన నాటికి నేటికి ఒక్క మహారాష్ట్రలోనే అవినీతి 600 రెట్లు పెరిగిందన్నది ఓ సర్వే అంచనా.

బెంగళూరు జట్టులో మార్పు!



బెంగళూరు : ఐపీఎల్‌లో భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ నాయకత్వం వహిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టులో మార్పు చోటు చేసుకుంది. ఆస్ట్రేలియా ఆటగాడు నాథన్ కౌల్టర్ నైల్ స్థానంలో కివీస్ ఆటగాడు కోరె అండర్సన్‌ను తీసుకున్నట్లు ఐపీఎల్ టెక్నికల్ కమిటీ తెలిపింది. దీంతో కౌల్టర్ నైల్ ఈ ఏడాది మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరమయ్యాడు. కౌల్టర్ నైట్ గాయంతో బాధపడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌సీబీ ఫ్రాంఛైజీ యాజమాన్యం తెలిపింది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం వేలం కోసం పేరు నమోదు చేసుకున్న ఆటగాళ్లలో ఎవరినైనా ఎంపిక చేసుకోవచ్చు. రూ. 2కోట్ల కనీస ధరకే అండర్సన్‌ను ఆర్‌సీబీ కైవసం చేసుకుంది. ఈ ఏడాది మెగా ఐపీఎల్ టోర్నీ ఏప్రిల్ 7న ప్రారంభంకానుంది. టోర్నీలో భాగంగా బెంగళూరు తన తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 8న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌కు దినేశ్ కార్తీక్ నాయకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే.

సత్తా ఉన్నోళ్లు దొరికారు



న్యూఢిల్లీ : టీంఇండియా యువ ఆటగాళ్లతో దుర్భేద్యంగా ఉందని భారత ఓపెనర్ శిఖర్ ధావన్ అంటున్నాడు. యువ క్రికెటర్లు అంతర్జాతీయ టోర్నీలలో అద్భుతంగా రాణించగలుగుతున్నారని..టోర్నీకి తగ్గట్టుగా ప్రదర్శన చేసే సత్తా వారిలో ఉందని ఈ ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్ పేర్కొన్నాడు. ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్‌నే ఉదాహరణగా తీసుకుంటే..రోహిత్ శర్మ నాయకత్వంలో యువ టీంఇండియా కప్‌ను గెలుచుకోవడంలో యువ ఆటగాళ్లు విశేషంగా రాణించారని ధావన్ అన్నాడు. ఒకవైపు విరాట్ కోహ్లీ, ఎంఎస్ ధోని, మరి కొంత సీనియర్లు అందుబాటులో లేకున్నా..యువ ఆటగాళ్లు ఈ సిరీస్‌లో సత్తా చాటడంతో ఎంతటి అంతర్జాతీయ మ్యాచ్‌లోనైనా సులభంగా రాణించగలరనే నమ్మకం వారిలో చూసినట్లు ఈ ఓపెనర్ బ్యాట్స్‌మెన్ విశ్లేషించాడు. మా బెంచ్ బలంగా ఉంది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టుతో శ్రీలంక, బంగ్లాదేశ్‌లను ఓడించి మరీ నిదహాస్ ట్రోఫీని ఒడిసిపట్టుకున్నాం. ఆ గెలువు గొప్ప ప్రభావం చూపించింది. దీన్ని బట్టి మా యువ ఆటగాళ్లతో కూడిన జట్టు కూడా దృఢంగా ఉందని గట్టి సంకేతాలు పంపే అవకాశం దొరికింది. ఇక్కడి నుంచే వాళ్లు క్రమంగా వెలుగులోకి వస్తున్నారంటూ ఈ ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్ అన్నాడు. బౌలింగ్‌లోనూ ఎన్నో మెరుగైన వనరులు ఈ సిరీస్ ద్వారా భారత్‌కు దొరికినట్లు శిఖర్ పేర్కొన్నాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఓడిపోయినా, తర్వాతి మ్యాచ్ నుంచి మెరుగైన ప్రదర్శనతో ప్రత్యర్థిని కట్టడి చేశామని అన్నాడు. ఉత్కంఠభరిత పోరాటంతో సిరీస్‌ను ముగించినట్లు..సిరీస్‌ను బాగా ఆస్వాదించినట్లు ధావన్ చెప్పుకొచ్చాడు. ఇక ఐపీఎల్ సీజను గురించి మాట్లాడుతూ.. ఏప్రిల్ 7నుంచి ప్రారంభంకానున్న ఈ సీజన్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు. డేవిడ్ వార్నర్ లాంటి నాణ్యమైన ఆటగాడు సన్‌రైజర్స్‌కు నాయకుడిగా దొరికాడు. అతనో గొప్ప బ్యాట్స్‌మెన్. ఆస్ట్రేలియాకు మాత్రమే కాదు..ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరవున కూడా మంచి రికార్డు కలిగి ఉన్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే మా ఇద్దరిదీ(ధావన్-వార్నర్) బెస్ట్ ఓపెనింగ్ జోడీ అని పేర్కొన్నాడు.



ఐపీఎల్ తరువాత ఇంగ్లాండ్ టూర్ : కోహ్లీ

ముంబయి : ఐపీఎల్ మెగా టోర్నీ ముగియగానే భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ ఇంగ్లాండ్ పయనం కానున్నాడు. భార్య అనుష్క శర్మతో కలిసి సరదాగా గడిపేందుకు అనుకుంటే మాత్రం పప్పులో కాలేసినట్లే. ఎందుకంటే కోహ్లీ వెళ్లేది అక్కడ కౌంటీ క్రికెట్ ఆడేందుకు. జులైలో కోహ్లీ నాయకత్వంలోని భారత జట్టు టీ20, వన్డే, టెస్టు సిరీస్‌ల కోసం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ ఏడాది దక్షిణాఫ్రికా పర్యటనకు ముందుగా వెళ్లకపోవడంపై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నెల రోజులు ముందుగానే భారత జట్టును పంపనున్నట్లు గతంలోనే బీసీసీఐ తెలిపింది. ఐతే, కోహ్లీ ముందుగా వెళ్లి అక్కడ కౌంటీల్లో సర్రే జట్టు తరఫున ఆడనున్నాడట. దీంతో జూన్ 14న బెంగళూరులో అఫ్ఘానిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టుకు కోహ్లీ దూరం కానున్నాడు. ఇంగ్లాండ్ గడ్డపై బ్యాటింగ్‌లో రాణించేందుకే కోహ్లీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో కపిల్‌దేవ్ కూడా కోహ్లీ కౌంటీల్లో ఆడాలని సూచించిన సంగతి తెలిసిందే. ఛతేశ్వర పుజారా కూడా యార్క్‌షైర్ జట్టు తరఫున ఆడనున్నాడు. ఈ ఏడాది మెగా ఐపీఎల్ టోర్నీ ఏప్రిల్ 7న ప్రారంభంకానుంది. టోర్నీలో భాగంగా కోహ్లీ నాయకత్వం వహిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఢీకొట్టనుంది. కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్‌లో ఈ మ్యాచ్ ఏప్రిల్ 8న జరగనుంది.

కామన్వెల్త్ క్రీడల్లో పతాకధారిగా సింధు



న్యూఢిల్లీ : ఏప్రిల్ 4 నుంచి ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో కామన్వెల్త్ క్రీడలు ప్రారంభంకానున్నాయి. సుమారు 222 మంది క్రీడాకారులు ఈ సారి కామన్వెల్త్ క్రీడల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇది ఇలా ఉండగా భారత జట్టుకు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు నాయకత్వం వహించనుంది. టోర్నీలో భాగంగా ఏప్రిల్ 4న గోల్డ్‌కోస్ట్‌లోని కరార స్టేడియంలో ఆరంభ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పీవీ సింధు త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని భారత జట్టుకు నాయకత్వం వహించనుంది. భారత జట్టులో మేరి కోమ్, సైనా నెహ్వాల్ లాంటి సీనియర్ క్రీడాకారులున్నప్పటికీ ఈ మధ్య కాలంలో సింధు సాధిస్తున్న విజయాలు ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తున్నాయి. అందుకే ఆమెను పతాకధారిగా ఎంపిక చేసినట్లు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారి ఒకరు తెలిపారు. క్రీడాకారుల అభ్యర్థన మేరకు ఈసారి ప్రారంభ వేడుకల్లో భారత క్రీడాకారిణీలు చీరలకు బదులు కోటు, ట్రౌజర్ ధరించనున్న సంగతి తెలిసిందే. కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పాల్గొనడం ఇది 15వ సారి. మొత్తం 15 క్రీడాంశాల్లో భారత్ క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారు. మొత్తం 70 దేశాలు ఈ కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొంటున్నాయి. 1930లో ప్రారంభమైన క్రీడల్లో భారత్ మొత్తం 438 పతకాలు సాధించింది.

మను బాకర్‌కు బంగారం



సిడ్నీ : మను బాకర్... ఈ పేరు ఎక్కడో విన్నట్టు ఉందే అని అనుకుంటున్నారా. ఔను. నిజమే. ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో రెండు స్వర్ణ పతకాలతో సంచలనాలు సృష్టించిన ఈ 16 ఏళ్ల షూటర్ ఇప్పుడు జూనియర్ ప్రపంచకప్‌లోనూ తన సత్తా చాటుతోంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మను స్వర్ణం సొంతం చేసుకుంది. అలాగే 10మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో మను జట్టు స్వర్ణం సొంతం చేసుకుంది. వ్యక్తిగత విభాగంలో 235.9 పాయింట్లతో మను స్వర్ణం గెలుచుకోగా.. థాయ్‌లాండ్ (234.9), చైనా (214.2) క్రీడాకారిణీలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరో భారత క్రీడాకారిణి దేవాన్షి రాణా 195.3 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. మను బాకర్, దేవాన్షి రాణా, మహిమా అగర్వాల్ కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, థాయ్‌లాండ్ నిలిచింది.

సూపర్ సాహా

- **20 బంతుల్లో.. 102 పరుగులు**
- **దేశవాలి క్రికెట్‌లో సాహా రికార్డు**



కోల్‌కతా : 20 బంతుల్లో శతకం సాధించడం అంటే ఎంత కష్టమో అందరికీ తెలుసు. ఎదుర్కొన్న ప్రతి బంతిని బౌండరీకి తరలించాలి. అప్పుడైతేనే శతకం సాధించగలం. తాజాగా భారత ఆటగాడు వృద్ధిమాన్ సాహా 20 బంతుల్లో 102 పరుగులు చేసి ఆశ్చర్యపరిచాడు. ఇందులో 14 సిక్స్‌లు ఉండగా.. నాలుగు ఫోర్లు ఉన్నాయి. బౌండరీలను కలుపుకుంటేనే సాహా స్కోరు 100. జేసీ ముఖర్జీ ట్రోఫీలో భాగంగా ఈ రోజు మోహున్ బగన్-బెంగాల్ నాగ్‌పూర్ రైల్వేస్ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మోహున్ బగన్ జట్టుకు సాహా ప్రాతినిథ్యం వహించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 151 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బగన్ జట్టు ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా కేవలం ఏడు ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఓపెనర్లు సాహా-దాస్ ప్రత్యర్థి జట్టు బౌలర్లపై విరుచుకుపడ్డారు. బౌండరీలతో రైల్వేస్ జట్టుకు పట్టపగలే ఓపెనర్లు ఇద్దరూ చుక్కలు చూపించారు. మీడియం పేసర్ అమన్ ప్రొసాద్ వేసిన ఏడో ఓవర్లో సాహా ఏకంగా 37 పరుగులు రాబట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. 20 బంతుల్లో సాహా 102 పరుగులు సాధించగా..ఇందులో 100పరుగులు బౌండరీల ద్వారా వచ్చినవే కావడం విశేషం. మరో ఎండ్‌లో ఉన్న అమన్ కూడా 22 బంతుల్లో 43 పరుగులు చేయడంతో బగన్ జట్టుకు సునాయాస విజయం దక్కింది. ఇప్పటి వరకు టీ20 లో అతి తక్కువ బంతుల్లో శతకం సాధించిన రికార్డు విధ్వంసకర బ్యాట్స్‌మెన్ క్రిస్‌గేల్ పేరిట ఉంది. 2013 ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిథ్యం వహించిన గేల్.. పుణె వారియర్స్‌పై 30 బంతుల్లో శతకం సాధించి రికార్డు సృష్టించాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో సాహా సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఈ ఐపీఎల్‌లో ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేసేందుకు సిద్ధం అన్న సాహా తాజాగా రికార్డు శతకంతో అందరి చూపును తనవైపే తిప్పుకున్నాడు.

ఎంతో మానసిక క్షోభ అనుభవించా : షమి



డెహ్రాడూన్ : బీసీసీఐ కాంట్రాక్టు నుంచి తప్పించడంతో తాను ఎంతో మానసిక క్షోభకు గురయ్యానని టీమిండియా పేసర్ మహమ్మద్ షమి చెప్పారు. మ్యాచ్ ఫిక్సింగ్, ఇతర మహిళలతో సంబంధాలు, హత్యాయత్నానికి పాల్పడ్డాడంటూ షమి భార్య హసీన్ జహాన్ సంచనల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అప్పుడు బీసీసీఐ షమికి కాంట్రాక్టులో స్థానం కల్పించలేదు. అనంతరం బీసీసీఐ అవినీతి నిరోధక విభాగాధికారులకు మ్యాచ్ ఫిక్సింగ్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు నిర్వహించి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం దర్యాప్తులో షమి ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేలడంతో బీసీసీఐ బి గ్రేడ్ కాంట్రాక్టులో చోటు కల్పించినట్లు స్పష్టం చేశారు. దీంతో ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆడేందుకు మార్గం సుగమమైంది. వేలంలో ఢిల్లీ డేర్ డెవిల్స్ షమిని రూ. 3కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ ఫిక్సింగ్ పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేకపోవడం, బీసీసీ ఐ కాంట్రాక్టు దక్కడం, ఐపీఎల్‌లో ఆడటంపై షమి తాజాగా సంతోషం వ్యక్తం చేశాడు. ఇది పూర్తిగా కుటుంబానికి సంబంధించిన సమస్య. నాకు వ్యతిరేకంగా వచ్చిన వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు. గత 10-15 రోజులుగా ఎంతో మానసిక క్షోభకు గురయ్యా. ఈ రోజులన్ని ఎంతో కఠినంగా గడిచాయి. వీలైనంత త్వరగా వీటన్నింటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నా అని తెలిపాడు షమి.

జహన్ మరో పోస్ట్... మండిపడ్డ నెటిజన్లు



టీమిండియా పేసర్ మహ్మద్ షమీ చాటింగ్ వ్యవహారాలను అతని భార్య హసీన్ జహాన్ సోషల్ మీడి యాలో మరోసారి పోస్ట్ చేసారు. ఓ అమ్మాయితో షమీ చాటింగ్ చేసిన స్క్రీన్ షాట్‌లను తన ఫేస్ బుక్‌లో నా భర్త ఓ స్టార్‌గా ఏ ఒక్కరిని వదల్లేదు అనే సెటైరిక్ క్యాప్షన్‌తో పంచుకున్నారు. అయితే ఈ పోస్టపై జహాన్‌కు ఊహించని విధంగా నెటిజన్ల నుంచి విమర్శలెదురయ్యాయి. ఇది జహాన్ జాత్యాహంకార దాడి అని కొందరంటే... డబ్బుల కోసమే ఇలా చేస్తుందని మరి కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు నిరూపించాలంటే న్యాయస్థానాల్లో పోరాడాలని, కానీ సోషల్ మీడియా వేదికగా రచ్చ చేయడం ఏమిటని మండిపడుతున్నారు. ఇప్పటికే షమీ ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేలడంతో బీసీసీఐ బి-గ్రేడ్ కాంట్రాక్టులో చోటు కల్పించిన విషయం తెలిసిందే.

అమరావతిలో ఏపీ లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్



విజేతగా సీఎం లెవెన్ జట్టు

అమరావతి : విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం ఏపీ లేజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2018 ఉత్సాహంగా జరిగింది. స్పీకర్ లెవన్ వర్సెస్ సీఎం లెవన్ జట్ల మధ్య జరిగిన ఈ పోరులో సీఎం లెవెన్ జట్టు ఘనవిజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన స్పీకర్ లెవెన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 6 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 42 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సీఎం లెవెన్ జట్టు 4.5 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సీఎం లెవెన్ జట్టుకు కొల్లు రవీంద్ర, స్పీకర్ లెవెన్ జట్టుకు వి. ప్రభాకర్ చౌదరి సారథ్యం వహించారు.

క్రీడలతో మానసికోల్లాసం : కోడెల

ఈ సందర్భంగా సభాపతి కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ... నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఒత్తిడికి గురయ్యే ప్రజాప్రతినిధులు ఆట విడుపుగా క్రీడల్లో భాగస్వామ్యం కావాలని అన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంతంలో తొలిసారిగా ఏపీ లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2018లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మధ్య క్రీడాపోటీలు జరుగుతున్నాయన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ప్రజాప్రతినిధులు ఒత్తిడి నుంచి దూరం కావొచ్చని సూచించారు. వివిధ విభాగాల్లో క్రీడాపోటీలు మార్చి 24,25,26 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు క్రీడల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మహిళా సభ్యులు కూడా క్రీడాంశాలలో పాల్గొనడం, వారి కోసం ప్రత్యేకంగా పోటీలను నిర్వహించడం అభినందనీయమని స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రికెట్, బ్యాడ్మింటన్, టగ్‌ఆఫ్ వార్ తదితర పోటీలు నిర్వహించనున్నారు.



అలసిపోలేదు..ఆస్వాదిస్తున్నాం



ముంబయి : వరుస వైఫల్యాలతో భారత క్రికెట్ మహిళల జట్టు తీవ్రంగా సతమతమవుతోంది. దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం ఇప్పటివరకూ ఆడిన ఓ మ్యాచ్‌లోనూ మహిళలు గెలిచింది లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంగ్లాండ్ మహిళలతో జరుగనున్న టీ20 పైనే ఆశలన్నీ. ఆదివారం మ్యాచ్‌తో వరుస వైఫల్యాల నుంచి తిరిగి జట్టును విజయబాట పట్టించేందుకు నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు భారత టీ20 కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తెలిపారు. భారత మహిళల జట్టు గత రెండు నెలలుగా నిరంతరాయంగా క్రికెట్ ఆడుతోంది. ఈ క్రమంలో ముందుగా దక్షిణాఫ్రికా జట్టుపై సిరీస్ విజయాన్ని నమోదు చేసుకున్నా, ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో మాత్రం తడబడ్డాం. దురదృష్టవశాత్తు ప్రస్తుతం జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపైనే ఓడాం. నిరంతరాయంగా మ్యాచ్‌లు ఆడుతుండటం వల్లనే ఓడిపోతున్నామని కొందరు విమర్శిస్తున్నారు. కానీ ఆ వ్యాఖ్యల్లో ఎలాంటి నిజం లేదు. అస్సలు వెంటవెంటనే రెండు అంతర్జాతీయ సిరీస్‌లు ఉండటం మాకు బాగా కలిసొచ్చే అంశం. అలసిపోయామనే ఆలోచనే మాలో లేదు. వరుసగా మ్యాచ్‌లు ఉండటం వల్ల మేము ఆటను బాగా ఆస్వాదిస్తున్నాం. బీసీసీఐ నుంచి మేము కోరుకునేది ఇదేనంటూ హర్మన్ ప్రీత్ కౌర్ వివరించింది. మరోవైపు ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఫామ్‌లోకి రావడం జట్టుకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నట్లు హర్మన్ ప్రీత్ అన్నారు. అదేవిధంగా ఇదే మ్యాచ్‌లో ఝులన్ కూడా చక్కగా బంతులు విసిరింది. కానీ చివరలో ప్రత్యర్థిని కట్టడి చేయడంలో కాస్త తడబడటంతో మ్యాచ్ చేజారినట్లు ఆమె పేర్కొంది. జయాపజయాలు అనేవి ఆటలో సర్వసాధారణం. ఒకవేళ మేము గెలిస్తే..ఓడినప్పుడు చేసిన తప్పులు అందులో కలిసిపోతాయని ఈ కుడిచేతి వాటం బ్యాట్స్ ఉమెన్ తెలిపింది. మరోవైపు శుక్రవారం ఆస్ట్రేలియా మహిళల జట్టుపై ఇంగ్లాండ్ మహిళల జట్టు 8 వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఫామ్ మీదన్న ఇంగ్లాండ్‌ను భారత మహిళలు ఎలా ఎదుర్కొంటారో చూడాల్సిందే.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.